అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 25-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 3 సంచిక : 238 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00





అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 25-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 238 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00



పాఠకులకు, ప్రకటనకర్తలకు,ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి సందర్భంగా నవతెలంగాణ శుభాకాంక్షలు
- చీఫ్ జనరల్ మేనేజర్

వినాయక చవితి సందర్భంగా శనివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.



వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

కాంగ్రెస్ పార్టీ నియంతృత్వపోకడలను తూర్పారబట్టి కేంద్రంలో అధికారానికి కొచ్చిన బీజేపీ సర్కారు వ్యవహారశైలి చర్చనీయాంశమవుతున్నది. మోడీ ప్రభుత్వంతో పాటు, బీజేపీ పాలిత రాష్ట్రాలూ వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదని..వాదించిన తీరుతో దేశ జనం ముక్కున వేలేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పౌరస్వేచ్ఛ,ప్రజాస్వామ్యం గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడారు. అధికారం దక్కాక వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించటానికి ఏమాత్రం వెనుకాడలేదు. సుప్రీం కోర్టులోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని చెప్పడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. ప్రజాస్వామ్య మనుగడకు బలంచేకూర్చింది. వ్యక్తిగత గోప్యతను వ్యాపార ప్రయోజనాలకు ఫణంగా పెట్టే మోడీ సర్కారు ప్రయత్నాలను సుప్రీం అడ్డుకోవటం ప్రజాస్వామ్య పరిరక్షణకు మరో ముందడుగు..

- అధికరణం 21లో... సహజంగా జీవించే హక్కు
- ప్రాథమిక హక్కులన్నిటిలోనూ అంతర్గతంగా ఉండేదే: సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ
- సుప్రీం తీర్పుతో ఆధార్‌లింక్ ప్రశ్నార్థకం

వివరాలు 2లో

రాష్ట్రాల తీరు ఇలా...

వామపక్ష పాలిత రాష్ట్రాలైన కేరళ, త్రిపుర, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, పంజాబ్, పాండిచ్చేరి, తృణమూల్ పాలిత పశ్చిమబెంగాల్ వ్యక్తిగత గోప్యతకు మద్దతు

కేంద్రం,బీజేపీపాలిత రాష్ట్రాలు మహారాష్ట్ర,గుజరాత్ గోప్యత ప్రాథమిక హక్కు కాదని వాదన

ఏ అంశంతో తెరపైకి..



కేంద్రం నిబంధన

సంక్షేమ పథకాలకు, ఇతర వాటికీ ఆధార్ లింక్ తప్పనిసరంటూ..

సవాల్ చేస్తూ పిటిషన్లు

ప్రాథమిక హక్కు అయిన వ్యక్తిగత గోప్యతకు అవరోధమని, నిబంధన రాజ్యాంగ విరుద్ధమని ఛాలెంజ్ పిటిషన్లు

ప్రైవసీకి రక్షణ

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో



న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్వాగతించింది. రాజ్యాంగంలోని అధికరణం 21 ద్వారా ప్రైవసీ హక్కుకు రక్షణ ఉన్నదని రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు చెప్పడం పట్ల పొలిట్‌బ్యూరో సంతోషం వ్యక్తం చేసింది. దీంతో, ప్రైవసీ హక్కు...9లో

సర్కారుకు జీవన్మరణ సమస్య

భగీరథ సమీక్షలో సీఎం కేసీఆర్

- డిసెంబర్ నాటికి సురక్షిత మంచి నీటి సరఫరా
- కొత్త సంవత్సరం కానుకగా శుద్ధి జలం
- పనుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటన
- అధికారులకు ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలందరికీ, అన్ని ఆవాస ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందివ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయననే సవాల్ తీసుకుని మిషన్ భగీరథ పనులు చేస్తున్నామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చెప్పారు. దేశంలో ఎవరూ తీసుకోని సవాల్ ను స్వీకరించామని తెలిపారు. దానికి తగినట్టుగా పని చేయాలని సూచించారు.సకాలంలో పనులు పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రజలకు సురక్షిత మంచినీరు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం ...9లో

యువ ఇంజినీర్ బలి

కుల దురహంకారానికి..

- లంచం వసూలు చేసి ఇవ్వాలని ఉన్నతాధికారి వేధింపులే కారణం..?
- ఈఈ రఘువీరారెడ్డి కారణమని సూసైడ్ నోట్
- న్యాయం చేయాలని బంధువుల ధర్నా

నవతెలంగాణ-వెల్గటూర్

కుల దురహంకారానికి యువ ఇంజినీర్ అధికారి బలయ్యాడు. 'మాలోడివై దొరలా ప్రవర్తిస్తు న్నావ్‌రా... నువ్వుపిచ్చోడివిరా, నీకు ఉద్యోగం ఎందుకు....." ఇలా పై అధికారి తిట్టడాన్ని తట్టుకోలేక పోయాడు. ఎంత సర్దుకుపోదామనుకున్నా... ...9లో

నేటి నుంచి చెలామణీలోకి రూ.200 నోటు



న్యూఢిల్లీ: కొత్త రూ.200 నోటు శుక్రవారం నుంచి చెలామణీలోకి రానున్నట్టు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. నవంబరు8న పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ.500, రూ.2000, రూ.50 నోట్లను చెలామణీలోకి తెచ్చిన ఆర్బీఐ తాజాగా రూ.200 నోటును అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా విడుదలకానున్న రూ.200 నోటు ముదురు పసుపు రంగులో ఉంది. నోటుపై భాగంలో మహాత్మాగాంధీ బొమ్మ, వెనుక భాగంలో దేశ సంప్రదాయ వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా సాంచీ స్థూపం బొమ్మను ముద్రించారు. ఈ నోటు ఎంపిక చేసిన కొన్ని బ్యాంకులు, ఆర్బీఐ కార్యాలయాల్లో అందుబాటులోకి రానుంది. రూ.200 నోటు చెలామణిలోకి రావడంతో పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎదురవుతున్న చిల్లర సమస్యలు తగ్గవచ్చునని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



భర్తీ చేయాలి..

వైద్య సీట్ల వివాదంపై హైకోర్టు తీర్పు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ప్రామాణికంగానే తెలుగు రాష్ట్రాల్లోని సూపర్‌స్పెషాలిటీ కోర్సుల వైద్య సీట్లను భర్తీ చేయాలని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. 371-డీ చెల్లదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీల పరిధిలో డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు జస్టిస్ వీ.రామసుబ్రమణియన్, జస్టిస్ టీ.రజనిల కూడిన ధర్మాసనం గురువారం తీర్పును వెలవరించింది. 371-డీ అమల్లో ఉండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హెల్త్ యూనివర్సిటీ పరిధుల్లోని సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని నేషనల్ కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలంటూ కేంద్రం మే 4న ఉత్తర్వులిచ్చింది. దీనిని సవాలుచేస్తూ కొంతమంది డాక్టర్లు ...9లో

స్వైన్‌ఫ్లూతో ఒకరు మృతి

నవతెలంగాణ-చందుర్తి

స్వైన్‌ఫ్లూతో ఒకరు చనిపోయారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని లింగంపేటలో బుధవారం రాత్రి జరిగింది. బంధువుల వివరాల ప్రకారం లింగంపేట గ్రామానికి చెందిన కోరుట్ల తిరుపతి(35) హైదరాబాద్‌లోని కపిల్ చిట్‌ఫండ్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. జ్వరంతో బాధపడుతున్న ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు స్వైన్‌ఫ్లూ అని నిర్ధారించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య వందన, ఇద్దరు కుమారులున్నారు.



గుడ్డిగా అమెరికా వెంటవెళ్లం

జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్

- ఉ.కొరియాతో ఉన్న సమస్యను ఆయుధ బలంతో పరిష్కరించలేం

వివరాలు 8లో

వేయి విచ్చుకత్తులకు భయపడను కానీ,
ఒక్క కలానికి మాత్రం వణుకుతాను. – నెపోలియన్

సంపాదకీయం

అమెరికాపై పట్టు బిగించిన డీప్ స్టేట్!

ఏమైనా సంఘటనలు జరిగినప్పుడు రాజకీయాలలో అంతర్లీనంగా ఉండే ఆవశ్యక విషయాలు బయటపడటం జరుగుతుంటుంది. పది రోజుల క్రితం చార్లొట్‌విల్లేలో జరిగిన వర్ణ వ్యతిరేక నాజీ దాడిపై అమెరికా పాలక వర్గాలలో తలెత్తిన విభేదాలవల్ల ట్రంప్ ప్రధాన వ్యూహకర్త స్టీఫెన్ బాన్నన్ శుక్రవారం బర్తరఫ్ కావటం దీనిని రుజువు చేస్తున్నది. ఈ సంఘటనను శ్వేతసౌధం నుంచి 'శ్వేత జాతీయవాదం' వేరుపరచటంగా కార్పొరేట్ మీడియా చిత్రించింది. అంటే అమెరికా అధ్యక్ష భవనం ఇప్పుడు మరింత హేతుబద్ధంగా ఆలోచించేవారి నియంత్రణలోకి వెళ్ళిందని అర్థం. ఇలా హేతుబద్ధంగా ఆలోచించేవారు ఎవరంటే శ్వేత భవన చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీ నేతృత్వంలోగల సైనికాధికారుల, మాజీ సైనాకాధికారుల గ్రూపు, ప్రపంచ ద్రవ్య పెట్టుబడికి కేంద్రమైన వాల్‌స్ట్రీట్‌కు చెందిన పెట్టుబడిదారులు గ్యారీ కోన్, ట్రంప్ ప్రధాన ఆర్థిక సలహాదారు, ట్రెజరీ కార్యదర్శి స్టివెన్ మ్నూచినల బృందం చేతుల్లోకి శ్వేతసౌధం వెళ్ళింది. నిజానికి అమెరికాలో అధ్యక్షుడు ఎవరైనా మొత్తం వ్యవస్థను నియంత్రించే సామర్థ్యం మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌గా పిలువబడే యుద్ధ పరిశ్రమ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గానికి నాయకత్వం వహిస్తున్న అమెరికా ద్రవ్య పెట్టుబడిదారీ వర్గాలకు మైత్రి ఉన్నది. ఈ కూటమికి ఉన్న మరో పేరు డీప్ స్టేట్.

ప్రజల ప్రజాస్వామిక హక్కులకు వస్తున్న ప్రమాదం కొద్ది సంఖ్యలోగల ఫాసిస్టు గూండాలనుంచి కాక ఈ ఫాసిస్టు మూకలకు విరుగుడుగా పేర్కొనబడుతున్న సైనిక-ద్రవ్య పెట్టుబడిదారీ వర్గ మైత్రి నుంచే ఉత్పన్నమౌతున్నది. ఎందుకంటే అమెరికాలో ప్రగతిశీల ఉద్యమాల ఆవిర్భావానికి సరియైన సమయం ఆసన్నమైనదని ప్రజలకంటే ముందుగా పాలక వర్గాలకే తెలుసు గనుక!

రాజకీయంగా, రాజ్యాంగపరంగా నాగరిక నాయకత్వానికి అలవాటుపడిన అమెరికన్లు ట్రంప్ బండి పట్టాలు తప్పకుండా చూడటానికి ముగ్గురు వర్తమాన, మాజీ సైనికాధికారుల–వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లి, జాతీయ భద్రతా సలహాదారు హెచ్ ఆర్ మెక్ మాస్టర్, రక్షణ కార్యదర్శి జిమ్ మాట్టిస్‌లపై ఆధారపడుతున్నామని తెలుసుకుంటున్నారు. వీరికి ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న యుద్ధాలవల్ల ఏర్పడే కష్టనష్టాలు తెలుసు. ప్రజాసేవకు సంబంధించిన విషయాలలో కూడా ట్రంప్ అనుభవ రాహిత్యానికి పరిష్కారంగా వీరు తమ సేవలను అందించగలుగుతారని న్యూయార్క్ టైమ్స్ ఆదివారంనాడు రాసిన సంపాదకీయంలో పేర్కొంది. అదే రోజు టైమ్స్ పత్రిక ఇచ్చిన వార్తా విశ్లేషణలో కార్పొరేట్ అమెరికా తన నైతిక గళాన్ని విప్పిందని, అది వర్ణ వివక్ష దాడులను ఖండించిందని, సహనంతో మెలగాలని, అందరినీ కలుపుకుపోవాలని ప్రభోదించింది. 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభానికి బాధ్యత వహించవలసిన జేపీ మోర్గాన్ చేస్ కంపెనీకి చెందిన జేమీ డిమాన్, ఇగ్నిషన్ స్విచ్‌లోగల లోపాన్ని దాచి వందలాదిమంది మరణానికి కారకుడైన జనరల్ మోటార్స్‌కు చెందిన మేరీ బర్రా, తక్కువ వేతనాలు చెల్లించి కార్మికుల శ్రమను క్రూరంగా దోచుకునే వాల్‌మార్ట్ సిఇఒ డగ్ మెక్‌మిల్లాన్‌వంటి కార్పొరేట్ నేరస్తులు అలాంటి నైతిక నాయకత్వంలో భాగమైన వారిలో ఉన్నారు.



చార్లొటెస్‌విల్లెలో జరిగిన నియో నాజీ దొమ్మీని డోనాల్డ్ ట్రంప్ సమర్థించటం వల్ల విదేశాల్లో అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు భంగకరం అవటమే కాకుండా దేశంలో సామాజిక, రాజకీయ స్థిరత్వాన్ని కొనసాగించటం కష్టమౌతుందని అమెరికా పాలకవర్గాలకు తెలుసు. మెడికల్ ఎయిడ్‌వంటి సామాజిక కార్యకలాపాలను కుదించి, కార్పొరేట్ల పన్నులను తగ్గించి, వ్యాపార నియమ, నిబంధనలను సరళీకరించి కార్పొరేట్ కంపెనీలకు లాభాలను దోచిపెట్టే ట్రంప్ విధానాలు ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపుతాయోనని కార్పొరేట్ కంపెనీలు భయపడుతున్నాయి. ఒక అప్రజాస్వామిక ఫాసిస్టు పునాది ఏర్పాటుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నం 2008లో అమెరికా ఆయువుపట్టయిన వాల్‌స్ట్రీట్ పతనంలాంటి సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంటుందనే ఆందోళన ద్రవ్య పెట్టుబడిదారీ వర్గంలో ఉన్నది.

ఈ పరిస్థితిని ఎదుర్కోవటానికి అమెరికా చరిత్రలో కనీవినీ ఎరుగనంత స్థాయిలో ప్రభుత్వం మీద సైనిక, కార్పొరేట్ల కూటమి (డీప్ స్టేట్) తన పట్టు బిగిస్తున్నది. ఆవిర్భవిస్తున్న 'మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్' నుంచి అమెరికాలోని ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి వున్నదని 56ఏండ్ల క్రితమే 1961లో అధ్యక్షుడుగావున్న ఐసెన్ ఓవర్ తన వీడ్కోలు ప్రసంగంలో చెప్పాడు. అయితే నేటి అమెరికాలోగల విస్తృత సైనిక, గూఢచార, కార్పొరేట్ కాంప్లెక్స్ పరిమాణం, ప్రాబల్యం, ఆధిపత్యం అప్పటి అధ్యక్షుడి ఊహకే అందని విషయం.

ట్రంప్ నాయకత్వంలో అమలుచేస్తున్న విధానాలకు వ్యతిరేకంగానే కాకుండా మొత్తం రాజకీయ వ్యవస్థపైనే ప్రజలు తిరగబడతారనే భయం పాలకవర్గాలకు పట్టుకుంది. కేవలం 20మంది వ్యక్తులు దేశంలోని కింది 50శాతం జనాభాకుగల సంపదతో సమానమైన సంపద కలిగి ఉండటం వంటి సమస్యలను అమెరికా ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చటానికే వర్ణ వివక్ష దాడులను, నియో నాజీ దొమ్మీలను అమెరికా పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్నాయి. ప్రజల ప్రజాస్వామిక హక్కులకు వస్తున్న ప్రమాదం కొద్ది సంఖ్యలోగల ఫాసిస్టు గూండాలనుంచి కాక ఈ ఫాసిస్టు మూకలకు విరుగుడుగా పేర్కొనబడుతున్న సైనిక–ద్రవ్య పెట్టుబడిదారీ వర్గ మైత్రి నుంచే ఉత్పన్నమౌతున్నది. ఎందుకంటే అమెరికాలో ప్రగతిశీల ఉద్యమాల ఆవిర్భావానికి సరియైన సమయం ఆసన్నమైనదని ప్రజలకంటే ముందుగా పాలక వర్గాలకే తెలుసు గనుక!

ప్రజావాణి

ప్రజా ప్రభుత్వాలేనా..?

మన తెలంగాణ. మన బంగారు తెలంగాణలో కూడా వైద్యం అందక, డాక్టర్ల నిర్లక్ష్యానికి ఎందరో చనిపోతున్నారు. ఇటీవల గాంధీ, నిలోఫర్, ఉస్మానియా చావులు మర్చిపోలేం.. అయితే యూపీకి, తెలంగాణకు కొంత తేడా ఉంది. తెలంగాణ ప్రజలు కొంత ధిక్కరిస్తున్నారు. అక్కడక్కడ ధిక్కరణ గొంతులు బలంగానే వినిపిస్తున్నాయి. వికారాబాద్‌లో మూడుగంటల రాత్రి బాలింతకు వైద్యం అందక శిశువు చనిపోతే.. బంధువులు ఆందోళనకు దిగారు. నిజామాబాద్‌లో ఇద్దరు శిశువులు చనిపోతే బంధువులు ఆందోళనకు దిగారు. జిల్లా యంత్రాంగం ఏదో చర్య తీసుకుంటే డాక్టర్లు సమ్మెకు దిగారు. ఎందుకూ? సిబ్బంది సరిగ్గా లేదని, డాక్టర్ల కొరత ఉందని, పరికరాలు సరిగ్గా లేవని.. ఇందంతా ఎవరి తప్పు? ఎవరి దుఃఖానికి ఎవరు కారకులు. ఇవి ప్రజా ప్రభుత్వాలేనా?

సిహెచ్. మధు, నిజామాబాద్.

అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు అవసరమా?

రాజకీయ నిరుద్యోగాన్ని నిర్మూలించటం కోసమే అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గాల పెంపుతప్ప వాటివల్ల ఒరిగేదేమీలేదు. ఇప్పటికే జిల్లాల పెంపుదల వల్ల నియోజకవర్గాలు చిన్నవైపోయాయి. మళ్లీ అసెంబ్లీ స్థానాల పెంపువల్ల ప్రాంతాల పరిధి చిన్నవిగా అయిపోయే ప్రమాదం ఉంది. దానివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ పార్టీలకు లబ్ధి మినహా పాలనా సౌలభ్యం ఎలా ఉన్నా గందరగోళ పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడి కొన్ని గ్రామాలు, పట్టణాలు కొత్త నియోజకవర్గాలలో కలిసిపోవటం వల్ల గందరగోళంగా అగమ్యగోచరంగా ఉంది. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలోకి పోకుండా కొన్ని చోట్ల నడుస్తున్నాయి. వాళ్ళ నియోజకవర్గాల పేరిట ఇబ్బందులకు గురిచేయకుండా ఉండాలి.

అయినం రఘురామారావు, ఖమ్మం.

జూనియర్ కళాశాలల ఏర్పాటు చేయాలి

ప్రతీ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తప్పక ఉండాలి. ఇప్పటికీ చాలా మండల కేంద్రాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేవు. ప్రయివేటు కళాశాలు పుట్టగొడుగులుగా వస్తున్నాయి. కానీ, పేద విద్యార్థులు అక్కడ విద్య అభ్యసించలేక పోతున్నారు. దూరమైనా ప్రభుత్వ కళాశాలలకు వెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాధాన్యత యిస్తుంది అని అంటున్నారు. కాబట్టి ప్రభుత్వం ఏఏ మండల కేంద్రాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అవసరమో, సంబంధిత అధికారులతో నివేదిక తీసుకుని, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అవసరమో ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్.

చరిత్ర చీకటి పొరల్లో... మత మౌఢ్య సంస్కృతి



డాక్టర్ దేవరాజు మహారాజు

అజ్ఞానం ముందు వంగి లేచేది మతం. అజ్ఞానం చుట్టూ ప్రదక్షిణలు చేసేది మతం. సంకుచితతత్వం, దురహంకారం, రాజకీయాలతో కలగలసి చరిత్రను మానవ రక్తంతో గడ్డ కట్టించింది మతం. ఏ కాలమైనా మతం సృష్టించింది చీకటే. చీకటికి పర్యాయపదమే మతం. మతకలహాల విశ్వరూపాన్ని దర్శింపజేయడమే భీష్మ సహాని నవల 'తమస్' ఉద్దేశం. ప్రముఖ హిందీ నవలా రచయిత నవలకు అదే పేరుతో గోవింద్ నిహలానీ రూపొందించిందే 'తమస్' చలన చిత్రం. "చీకటి రోజుల్లో కళలూ, కవిత్వాలు ఉంటాయా?" అని ప్రశ్నించాడు జర్మన్ మహాకవి బెర్తోల్డ్ బ్రెహ్ట్ "ఉంటాయి! అయితే అవి చీకటి రోజుల గురించి మాత్రమే ఉంటాయి" అని ఆయనే సమాధానం కూడా చెప్పాడు. "గత చరిత్ర నుండి గుణపాఠం నేర్చుకోనివారు అవే తప్పిదాల్ని మళ్ళీ మళ్ళీ చేయక మానరు" అని ప్రత్యక్షంగా అనుభవించి చెప్పాడు హిందీ చలనచిత్ర దర్శకుడు గోవింద్ నిహలానీ. గతంలోనే కాదు, మతకలహాల చీకటి వర్తమానంలో కూడా దేశమంతా వ్యాపించే ఉంది. ఇది నడుస్తున్న చరిత్రకు వ్యాఖ్యానం!

సమసిపోయాయని అనుకుంటున్నా ఎన్నో వ్యవస్థలు ఇంకా సమసిపోలేదు. గతాన్ని తవ్వుకుంటూ, సమకాలీనం లోని వెనకబాటు తనంతో పోల్చుకుంటూ, లోపించిన మానవతా విలువల్ని ఎత్తి చూపుకుంటూ, ఎప్పటి కప్పుడు ఎక్కడి కక్కడ సరిదిద్దుకుంటూ ఉండాలి. మరీ ముఖ్యంగా సమాజాన్ని వెనక్కి నడిపించే ప్రభుత్వాలున్నప్పుడు ప్రజలు మరింత అప్రమత్తంతో ఉండాలి.


1947 ఆగస్ట్ దేశ విభజనకు ముందు జలాలాబాదులో జరిగిన సంఘటనల ఆధారంగా భీష్మ సహాని (నటుడు బలరాజ్ సహాని తమ్ముడు) నవల రూపుదిద్దుకుంది. అటు సింధ్ ఇటు పంజాబ్‌ల మధ్య, అటు ముస్లింలు ఇటు హిందువుల మధ్య, అటు ముస్లింలీగ్ ఇటు కాంగ్రెస్ రాజకీయాల మధ్య ఐదు లక్షల మంది అసువులు కోల్పోయారు. పదిహేను మిలియన్ల మంది గూడు నీడ లేక నిరాశ్రయులై పాకిస్థాన్‌లోకి, భారతదేశంలోకి వలస వెళ్ళారు. తప్పులు ఇరు పక్షాల వారివీ ఉన్నాయి. కాబట్టి జరిగిన నరమేధం వెనుక లోపించిన మానవ విలువల్ని, అప్పటి హీనమైన సమయాన్ని 'తమస్' చలనచిత్రం బేరీజు వేసింది. ఇందులోని సంఘటనలు ఆ కాలానికే పరిమితం కాదు. అహ్మదాబాద్, భివండి, మొరాదాబాద్, మీరట్, హైదరాబాద్‌లలో అప్పుడప్పుడు జరుగుతూ వచ్చిన హిందూ ముస్లిం కొట్లాటల వల్ల ఈ కథ ఈ కాలనీదే అని సాక్ష్యం పలుకుతుంది. హిందూరాజ్యం, ఖలిస్థాన్‌ల కోసం జరుగుతున్న తీవ్రవాద రక్తపాతాలు అందుకు వంతపాడుతున్నాయి. అంతే కాదు కరాచీ వీధులలో మొహజిర్ – నాన్ మొహజిర్‌ల మధ్య జరుగుతున్న ఘర్షణలు. కొద్దిపాటి తేడాలతో మత–రాజకీయాలకు సంబంధించిన ఏ అల్లర్లలోనైనా నష్టపోయేది ప్రజలే! ఈ విశ్వజనీనమైన నిజాన్ని మనకు దర్శింపజేయడానికి దర్శకుడు చేసిన తపస్సే – తమస్! మానవ సంబంధాల్ని మరింత మెరుగు పరచడానికి మతాల్ని, నీచ రాజకీయాల్ని దూరంగా తరిమేయడానికి, నిజమైన విశ్వశాంతిని కాంక్షించడానికి – తప్పదు, మనం ఎక్కడో ఓ చోట ఈ విధానాన్ని మార్చుకోక తప్పదు.. అని గోవింద్ నిహలానీ 'తమస్'లో చెప్పడానికి ప్రయత్నించాడు.

ఆ చిత్రంలోని కథాంశం ఈ విధంగా ఉంటుంది. ఎవరో ధనవంతులైన హిందువులు అర్ధరాత్రి నాథూ ఇంటికి వస్తారు. డబ్బులిచ్చి ఒక పందిని చంపమంటారు. తను చంపిన పంది ఉదయానికి మసీదు ముందుకు చేరుతుందని, దానితో పట్టణంలోని హిందూ ముస్లింల మధ్య అపార్థాలు ఎక్కువై తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని నాథూ ఊహించాడు. కాంగ్రెస్ వాళ్ళ 'ప్రభాతభేరి' కార్యక్రమం అర్థాంతరంగా ముగుస్తుంది. మరో పక్క 'అల్లాహో అక్బర్' నినాదాన్ని తొక్కేయడానికి 'హర హర మహాదేవ' బృందం బయలుదేరుతుంది. కత్తులు, కర్రలు తిప్పగలిగే ఖాకీ నిక్కర్ల యువకులు 'హిందూ సభ'గా విజృంభిస్తారు. వీరందరి మధ్య నాథూ పాత్ర ఎంతో ఉదాత్తమైంది. మత రాజకీయాల్లో చిక్కుకుని, బలైపోయే లక్షలాది సామాన్యులకు ప్రాతినిధ్యం వహించే పాత్ర. "ఇంతగా కుళ్ళిపోయిన ఈ సమాజంలోకి మన కొడుకును ఎందుకు రానివ్వాలి?" అని నాథూ (ఓంపూరి) గర్భవతి అయిన భార్యను ప్రశ్నిస్తాడు. "వాడి పుట్టుకను ఆపడానికి మనమెవ్వరం? వాడికి కావల్సిన సమాజం కోసం వాడే సంఘర్షిస్తాడు" అని ఆమె (దీపా సాహి) జవాబు చెపుతుంది. ఇక్కడ కొడుకు పుట్టడానికి భారత స్వాతంత్ర్యోంమానికి అన్వయిస్తాడు దర్శకుడు.

నవలలో లేని కొన్ని కొత్త విషయాలు కూడా దర్శకుడు చిత్రంలో చేర్చుకున్నాడు. ఉదాహరణకు స్త్రీలు బావిలో దూకిన సంఘటన! ఒకసారి ముస్లింలతో కొట్లాడి సిక్కులు మరణించారని వార్త తెలుస్తుంది. వారికి సంబంధించిన సిక్కు స్త్రీలందరూ పిల్లలతో సహా ఊరిబావిలోకి దూకుతారు. పంజాబ్‌లోని ఒక గ్రామంలో జరిగిన 'ఖుర్‌బానీ' ఘటనను దర్శకుడు అదనంగా చేర్చుకున్నాడు. భీష్మ సహాని నవలలో ఈ సంఘటన లేదు. అలాగే ఉత్కంఠ భరితంగా సాగే మరికొన్ని సంఘటనలు కూడా చిత్రంలో ఉన్నాయి. ఒక ముస్లిం మహిళ కాఫిర్లయిన సిక్కు దంపతులకు ఆశ్రయమిస్తుంది. మరోచోట ముస్లిం ఉపాధ్యాయుణ్ణి ఒక సిక్కు మహిళ 'సజీవ దహనం' నుండి కాపాడుతుంది. పాకిస్థాన్‌లో స్థిరపడ్డ రాబాబీలు ఒకప్పుడు గురునానక్ శిష్యులు. అయినా ఇప్పుడు వారు ముస్లిం ఆచార వ్యవహారాలు, నియమాలు కూడా పాటిస్తారు. సామాన్యుల్లో సుహృద్భావం జాతీయ సమైక్యతను ఆకాంక్షించే గుణం నిండుగా ఉంది. దాన్ని వెలికితీసి చూపే ప్రయత్నం చేశాడు దర్శకుడు. అతనిలో మార్క్సిస్టు దృక్పథం ఇందులో కళాత్మకంగా బయటపడింది.

చలన చిత్ర దర్శకుడు గోవింద్ నిహలానీ బాల్యం కరాచిలో గడిచింది. 'డాన్' వార్తా పత్రిక కార్యాలయం ఎదురుగా మేడమీద వీరి కుటుంబం ఉండేది. వారి ఇంటికింద ఒక పాన్‌షాపు ఉండేది. పాన్‌షాప్ యజమాని ఆందోళనకారులకు భయపడి, పైకి నిహలానీ వాళ్లింటికి వచ్చాడు. ఆ రోజు సంపాదించిన మొత్తం నిహలానీ తండ్రికి అప్పగించాడు. దాచిపెట్టమని చెప్పి, తప్పించుకుని పారిపోదామని కిందికి వెళ్ళాడు. అంతే, ఆందోళన కారులు అతన్ని కాల్చేశారు. ఇదంతా బాలుడిగా నిహలానీ ప్రత్యక్షంగా చూశాడు. మత కల్లోల భయంకర స్వరూపం ఆనాడే ఆ పసి హృదయంలో చెరగని ముద్ర వేసింది. ఆ అనుభవం అతన్ని ఊర్కోనివ్వలేదు. చిత్రసీమలో ప్రవేశించిన తర్వాత, మత కల్లోలంపై సినిమా తీయాలన్న కోరిక బలపడింది. ఫలితంగానే 'తమస్' (చీకటి) పేరుతో సమాజంలో వెలుగులు ప్రసరించాయి.

దర్శకుడు గౌతమ్‌ఘోష్ తీసిన చలనచిత్రం 'అంతర్జలి యాత్ర' అది కంచి శంకరాచార్యకు ఓ సవాల్ విసిరింది. కొన్నేండ్ల క్రితం 'సతి'పై వాదోప వాదాలు చెలరేగాయి. జాతీయ స్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగాయి. అందుకు కారణం పూరీ శంకాచార్యులు, కంచి శంకరాచార్యులూ కలిసికట్టుగా 'సతి'ని బాహాటంగా బలపరచడమే! ఖాంద్వా జిల్లాలో ఓం కారేశ్వర్‌లో బయటపడ్డ



రెండువేల యేండ్ల కిందటి ఒక గుహను ప్రారంభిస్తూ స్వామి జయేంద్ర సరస్వతి 'సతి'ని ప్రోత్సహిస్తూ మాట్లాడాడు. హిందూమత పునరుద్ధరణలో 'సతి' కూడా భాగమేనన్నాడు. కొన్ని వేల యేండ్ల కిందటి గుహను వెలుగులోకి తెచ్చినట్టే.. అడుగున పడిపోయిన ఆనాటి మూఢాచారాల్ని కూడా వెలుగులోకి తేవాలని ఆయన గారి ఉబలాటం కాబోలు! విశేషమేమంటే వారి పత్రికా విలేకరుల గోష్ఠిలో మహారాష్ట్ర పౌరసంబంధ, ఆర్థికశాఖ ఉప మంత్రి, నాగపూర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉన్నారు. ఇలాంటి సంఘటనల్లో అలాంటి వారి గూర్చి విన్నప్పుడు మనకు 'చదువుకున్న మూర్ఖులు' అనే పదం గుర్తుకొస్తుంది. 'స్త్రీ అత్యాచార విరోధి సమితి' పూనుకుని శంకరాచార్య ప్రకటనను నిరసించడంతో విషయాలు మరింతగా వెలుగులోకి వచ్చాయి. మానవ పురోగమనానికి అడ్డుపడే అలాంటి దద్దమ్మలంతా పెద్దలై కూర్చోబట్టే దేశమింకా ఈసురోమంటోంది. ఎవడి మతం వాడు, ఎవడి డబ్బా వాడు వాయించుకోకపోతే మానవాళి సమస్యను హేతువాద దృక్పథంతో పరిశీలించొచ్చు కదా? భార్య చనిపోతే, 'పతి' ఆమె శవంతో పాటు చితిమీద పడి సజీవంగా కాలి చావాలన్న నియమం ఉంటే మరి ఈ స్వాములు ఏం మాట్లాడేవారూ? "పతి"ని బలపరిచేవారా?

ఇటు ఇంట్లో స్త్రీలను, అటు బయట ఇతర కులాల వారిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి అగ్రవర్ణం వారు ఏర్పరిచిన నియమాలు, నిబంధనలు ఎంతటి హాస్యాస్పదమైనవో, ఎంత నికృష్టమైనవో 'అంతర్జలి యాత్ర' చలన చిత్రం స్పష్టం చేసింది. బెంగాలి రచయిత కమల్ కుమార్ మజుందార్ కథకు రూపకల్పనే ఈ సినిమా. కథాంశం ఈ విధంగా ఉంటుంది. వృద్ధ బ్రాహ్మణుడు సీతారాం అవసాన కాలం దగ్గరి కొస్తుంది. జాతకాలు చెప్పే బ్రాహ్మడు పరిగెత్తుకొస్తాడు. "వృద్ధ బ్రాహ్మణుడు అప్పుడప్పుడే చనిపోడని, మళ్ళీ పెళ్ళి చేస్తే భార్యతో పాటే జంటగా పరలోకాలకు చేరుకుంటాడని" జోస్యం చెపుతాడు. ఇప్పుడో, అప్పుడో అన్నట్టున్న వృద్ధ బ్రాహ్మణుణ్ణి అప్పటికే స్మశానానికి తరలిస్తారు. జ్యోతిష్కుడి మాట మీద ఉన్న ఫలంగా వృద్ధుడికి స్మశానంలోనే పద్దెనిమిదేళ్ళ కన్యతో హడావుడిగా వివాహం జరిపిస్తారు. కన్య తండ్రి చాలా పేదవాడు. కూతురికి పెండ్లి చేయలేదనే లోకనింద తప్పించుకోవడానికి పరోక్షంగా కూతురిని చంపడానికే సిద్ధపడ్డన్నమాట!

కొన్ని గంటల వ్యవధిలో వృద్ధుడు సీతారాం చనిపోతాడని అందరికీ తెలుసు. అతనితో పాటు అతని భార్య సతీ సహగమనం చేయాల్సి వస్తుందనీ తెలుసు. తెలిసి తెలిసి జోశోబతి అనే అమ్మాయిని ఆమె తండ్రి మరణశయ్యపై ఉన్న వృద్ధుడికి కన్యాదానం చేస్తాడు. జోశోబతి బాధ్యతతో భర్తకు సపర్యలు చేస్తూ ఉంటుంది. కాటికాపరి బైజు నిమ్నజాతికి చెందినవాడు. శవాల్ని కాల్చడమే అతని వృత్తి. చదువురాని వాడు, అజ్ఞాని అయినా సతీసహగమనం ఎంతటి నీచమైన వ్యవస్థో తెలిసినవాడు. హృదయమున్నవాడు. జోశోబతి పట్ల సానుభూతితో, ఆమెను ఆ విషవలయం నుండి తప్పించడానికి ప్రయత్నం చేస్తాడు. ఆమెను సజీవంగా కాల్చడానికి అతనికి మనసొప్పదు... అందుకే పారిపొమ్మని ప్రాధేయపడతాడు. జోశోబతి, బైజుపై నమ్మకం పెంచుకుంటుంది. ఎటు చూసినా ఎవరూ లేని అసహాయ స్థితిలో ఆమె అతని ప్రేమకు పాత్రురాలవుతుంది. వృద్ధుడు సీతారాం మరణిస్తాడు. బైజు మాటవిని పారిపోనూలేక, సమాజాన్ని ఎదిరించి బైజుతో ఉండనూలేక అయోమయ స్థితిలో 'సతి' కావడానికే నిశ్చయించుకుంటుంది. భర్త మరణానంతరం వైధవ్యం పొందిన భార్య జీవితం మరణం కన్నా భయంకరమైందని ఆమెకు తెలుసు. దేశంలోని ఒక మూఢాచారాన్ని నిర్భయంగా విమర్శించ గలిగిన ఈ చలనచిత్రం ఉత్తమ బెంగాలీ చిత్రంగా జాతీయ బహుమతి నందుకుంది. చిత్రానికి సంగీతం సత్యజిత్‌రే సమకూరిస్తే, శత్రుఘ్న సిన్హా, శంపాఘోష్, ఉత్పల్‌దత్, మోహన్ అగాషే వంటి కళాకారులు నటించారు. సమసిపోయాయని అనుకుంటున్నా ఎన్నో వ్యవస్థలు ఇంకా సమసిపోలేదు. గతాన్ని తవ్వుకుంటూ, సమకాలీనం లోని వెనకబాటు తనంతో పోల్చుకుంటూ, లోపించిన మానవతా విలువల్ని ఎత్తి చూపుకుంటూ, ఎప్పటి కప్పుడు ఎక్కడి కక్కడ సరిదిద్దుకుంటూ ఉండాలి. మరీ ముఖ్యంగా సమాజాన్ని వెనక్కి నడిపించే ప్రభుత్వాలున్నప్పుడు ప్రజలు మరింత అప్రమత్తంతో ఉండాలి.

రచయిత: సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్, సెల్: 9908633949

అకౌంటబిలిటీ లేని రాజకీయాలు




డాక్టర్ కాలువ మల్లయ్య

రాజకీయాలను మనం రాజనీతి శాస్త్రంగా చదువుకున్నాం. అంటే రాజకీయాలంటే నీతిమంతంగా ఉండాలనీ, శాస్త్రీయంగా ఉండాలని అర్థం. కానీ క్రమంగా రాజనీతి శాస్త్రం నుండి నీతి, శాస్త్రం రెండూ ఎగిరిపోయి రాజకీయం మిగిలింది. ఈ రాజకీయం క్రమక్రమంగా చెడు నుండి అధ్వాన్న స్థితికి మారిపోతున్నది. ఇందులో నీతి నియమాలకు చోటే లేదు. పేరుకు చట్టం తప్ప న్యాయం, ధర్మం అసలే లేవు. మన పార్టీ వాడైతే ఏం చేసినా ఫర్వాలేదు. ఎంత అవినీతి చేసినా ఎన్నివేల కోట్ల అక్రమ సంపాదనున్నా ఎలాంటి చర్యలూ ఉండవు. అధికార పార్టీని ప్రశ్నించేవాడయితే అనేక సమస్యలనెదుర్కోవాలి. చిన్న తప్పయినా, అసలు తప్పు చేయకున్నా జైలుకెళ్ళే పరిస్థితులను కల్పిస్తారు. అణగారిన తరగతులైతే ఇక శిక్ష ఖాయం. మనుధర్మ శాస్త్రంలో చెప్పినట్టు బ్రాహ్మణులు తప్పుచేస్తే ఏ శిక్షా ఉండదు. క్షత్రియులైతే మందలించి వదిలిపెడతారు. వైశ్యులైతే ఉండీలేనట్టు స్వల్ప శిక్ష. శూద్రులు, అతిశూద్రులైనా కఠిన శిక్షలు తప్పవు గాక తప్పవు. ఇదే పద్ధతి ప్రస్తుత రాజకీయాల్లోనూ నడుస్తున్నది. రాజకీయాలు ఏ పార్టీ వారైనా సరే అగ్రకుల పెత్తందారులూ, కాంట్రాక్టర్లూ, పారిశ్రామిక వేత్తలైతే ఎంత పెద్ద తప్పులు, స్కాంలు చేసినా వారికి శిక్షపడ్డ దాఖలాలు డెబ్బై ఏండ్ల స్వతంత్ర భారతంలో లేవు. అదే ఎస్సీలో, బీసీలో అయితే వాళ్ళ వెంటపడి వేటాడుతారు. మీడియా కూడా సమధికోత్సాహంతో వీళ్ళను శిక్షించి తీరాలని గోల చేస్తుంది. వేల, లక్షల కోట్ల స్కాం లుండగా, బాబ్రీ మసీదు కూల్చివేత లాంటి కేసులున్నా అవన్నిటినీ వదిలిపెట్టి మనువాద రాజకీయాలను ఎదిరిస్తున్నాడన్న నెపంతో గడ్డిస్కాం మొదలుకొని వివిధ స్కాముల పేరుతో లూలూ ప్రసాద్‌యాదవ్‌ను ముప్పతిప్పలు పెట్టడం మనువాద రాజకీయ ఎత్తుగడల్లో భాగమే. అవినీతి పరులెవరైనా సరే శిక్షించాల్సిందే కానీ అక్రమ సంపాదనా పరులైన రాజకీయుల్లో, పారిశ్రామిక వేత్తల్లో, ఉన్నతాధికారుల్లో ఎంతమంది నిమ్నకులాల వారున్నారు? ఎంతమంది పాలకవర్గ అగ్రకులాల వారున్నారో గమనిస్తే మంచిది. నిజంగా అవినీతినీ, నేరాలను నిర్మూలించాలన్న చిత్తశుద్ధి ఉంటే అందరిపట్ల ఒకే వైఖరి ప్రదర్శించాలి కదా! రాజకీయ అవినీతిని ప్రక్షాళనం చేయాలంటే స్వాతంత్ర్యానంతరం రాజకీయ నాయకులు రాజకీయాలకు రాకముందు, రాజకీయాల్లోకి ప్రవేశించింతర్వాత ఇప్పటివరకు సంపాదించిన ఆస్తుల వివరాలను, వారు పొందిన జీతాన్ని లెక్కలుగట్టి మిగిలిన లక్షలకోట్ల ధనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే సరిపోతుంది కదా. కానీ అలా చేసేదెవరు? రాజకీయ ప్రయోజనాల, కక్షసాధింపు చర్యలుగానే ఉంటున్నాయి కానీ సత్యాన్వేషణ చర్యలుగా ఉండటం లేదు. ఎన్నికల్లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి యాభై అరవైకోట్లు పార్లమెంటు నియోజకవర్గానికి వందలకోట్లలో ఖర్చుపెడుతున్న రాజకీయనాయకులకు ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో, గెలిచింతర్వాత వాళ్ళంతకంటే ఎన్ని రెట్లెక్కువ సంపాదించుకుంటారో తెలియదా? ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి ఓట్లు కొనడం ఎంత నీతి బాహ్యమైందో రాజకీయాలెంత భ్రష్టుపట్టాయో అర్థమవుతూనే ఉంది.

ఈ మధ్య తెలుగు రాష్ట్రాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ జరిగిన, జరుగుతున్న పార్టీ ఫిరాయింపు రాజకీయాలను చూస్తుంటే అవెంత నీతి బాహ్యంగా సాగుతున్నాయో అర్థమవుతోంది. ఇది నిజానికి వ్యభిచారం కంటే ఘోరమైంది. తనకు ఓటేసిన ప్రజలను మోసగించినట్టు కాదా? అధికార పార్టీలోకి వెళ్ళదలుచుకుంటే తన సభ్యత్వానికి రాజీనామా చేసి అందులో చేరాలి. ఆ పార్టీ ద్వారా పోటీచేసి గెలువాలి. ఇది మినిమమ్ రాజనీతి.

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నీతివాక్యాలు వల్లించారు. ఏ పార్టీకి ఎదురుగా నిలబడటానికైతే లాలూ ప్రసాద్‌తో కలిసి ఎన్నికల్లో గెలిచి, ఆ పార్టీ సహాయంతో రెండేండ్లు పాలించారో ఆ పార్టీ పొత్తును వదులుకొని తానోడించిన పార్టీతోనే జతకట్టారు. 15 గంటల్లో మళ్ళీ ప్రమాణ స్వీకారం చేసారు. ఇదెంత అనైతికత? నితీశ్‌కుమార్ రిజైన్ చేసినప్పుడు అసెంబ్లీలో అత్యధిక సీట్లున్న ఆర్‌జేడీని ముందు పిలిచి ప్రభుత్వం ఏర్పాటు



చేయాలని పిలువాలి కదా! మెజారిటీ నిరూపించుకోవడానికి సమయమివ్వాలి కదా! ఆర్‌జేడీతో పొత్తు నచ్చకుంటే రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికలకు సిద్ధం కావాలి. కానీ తానోడించిన పార్టీతోనే, భావస్వామ్యం లేని శత్రుపూరిత వైరుధ్యమున్న పార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం రాజకీయాలెంత భ్రష్టుపట్టాయో తెలుపుతున్నాయి. ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలోకి లేదా గెలిచిన పార్టీలోకి దూకడం, ఓడించిన పార్టీతోనే జతకట్టి మిత్ర పార్టీని దూరం కొట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే అంశాలు. గోవా అసెంబ్లీలోనూ ఇదే తంతు జరిపి బీజేపీ తన నిజస్వరూపమేంటో చూపింది. ఇలాంటి తంతులు, ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిరపరచడం అప్పుడు ఇందిరాగాంధీ, ఇప్పుడు బీజేపీ నాయకత్వం విలువలకు తిలోదకాలిచ్చి చేస్తున్నారు.

బూటకపు వాగ్దానాలు చేసి గెలవడం, తాము చేసిన వాగ్దానాలకు ఏ మాత్రం బాధ్యత వహించకుండా నగ్నంగా వాటిని తుంగలో తొక్కడం ఈ మధ్య మరీ ఎక్కువయింది. మళ్ళీ ఎన్నికల్లో గెలువడానికి ఏం చేయడమో, మరిన్ని వాగ్దానాలు చేయడం తప్ప వాటిని అమలు పరిచింది లేదు. ఒకటీరెండు అమలు చేసినా అవి కంటితుడుపు చర్యలు గానే. ప్రజలకు చెందాల్సిన డబ్బును ప్రజలమీద ఖర్చు చేయడం కాకుండా చేసిన స్వల్ప మొత్తాన్ని తామేదో మెహర్బానీ చేసినట్టు ప్రచారం చేసుకుంటూ తమ బాధ్యతలను పూర్తిగా మరిచిపోతున్నారు. ఏ మాయచేసి ఎన్నికల్లో గెలవాలన్న ధ్యాసతప్ప మెజారిటీ ప్రజల సంక్షేమం వీరికి పట్టదు. గత ముప్పయి ఏండ్లుగా రాజకీయమనేది ఈ దేశంలో లాభసాటి వ్యాపారం అయిపోయింది. రాజకీయాలంటే డబ్బు, అధికారం తప్ప విలువలు, అకౌంటబిలిటీ ఎలా ఉంటాయి? ఏదో కొద్దిమంది వేళ్ళమీద లెక్కబెట్టగలిగేంత మంది రాజకీయాలు విలువలు, అకౌంటబిలిటీ గల రాజకీయాలను నడుపుతున్నారు తప్ప మిగతా వాళ్ళంతా అంతే సంగతులు.

ఈ మధ్య తెలుగు రాష్ట్రాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ జరిగిన, జరుగుతున్న పార్టీ ఫిరాయింపు రాజకీయాలను చూస్తుంటే అవెంత నీతి బాహ్యంగా సాగుతున్నాయో అర్థమవుతోంది. ఇది నిజానికి వ్యభిచారం కంటే ఘోరమైంది. తనకు ఓటేసిన ప్రజలను మోసగించినట్టు కాదా? అధికార పార్టీలోకి వెళ్ళదలుచుకుంటే తన సభ్యత్వానికి రాజీనామా చేసి అందులో చేరాలి. ఆ పార్టీ ద్వారా పోటీచేసి గెలువాలి. ఇది మినిమమ్ రాజనీతి. భారత రాజకీయాల్లో అదీ కరువైంది. పార్టీ ఫిరాయిస్తే ఎవరైనా సరే తన శాసనసభ, పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేసి తీరాలి. మళ్ళీ పోటీచేసి గెలువాలి. నితీశ్‌కుమార్ కూడా ప్రభుత్వాన్ని రద్దు చేసి మళ్ళీ ప్రజల తీర్పు అడిగితే అతడు ఇంతవరకు కాపాడుకున్న పేరు నిలబడుతుంది. లేకుంటే ఇప్పుడు రెండు మూడేండ్లు అధికారంలో ఉండొచ్చుకానీ తర్వాత అతని పరిస్థితి దయనీయంగా మారుతుంది. బీజేపీ చక్రబంధంలో చిక్కుకొని కొట్టుమిట్టాడక తప్పదు.

సెల్: 9849377578

మతంకాదు మానవత్వం కావాలి..



సమాజంలోని సంఘటనలపై స్పందించేవారిని మతాల పరంగా, కులాల పరంగా విడదీయవద్దన్నది ఆమె విన్నపం. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అందరికీ ఉందని చెప్పి వివాదస్పద రచయితగా మారారు తస్లీమా నస్రీన్. హేతువాదిగా, నాస్తికురాలిగా, స్త్రీవాద మానవహక్కుల కార్యకర్తగా ప్రపంచవ్యాప్తంగా ఆమె గుర్తింపు పొందారు. ముస్లిం చాంధసవాదుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటూ ఎన్నో రచనలు చేశారు. తన తలకు వెలకట్టినా.. తలవంచకుండా నిలబడ్డారు. స్పందించే మనసును ఎవరూ కొనలేరని నిరూపించారు. ఇటీవల ఔరంగాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమెను అడ్డుకునే ప్రయత్నం కొందరు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..'నేను మీ శత్రువును కాదు. ముస్లింల నిజమైన నేస్తాన్ని. విద్యవంతులు, మేధావులు తమ మతం సంస్కరించబడాలని కోరుకుంటున్నారు. నేనూ అదే కోరుకుంటున్నాను' అన్నారు.

బంగ్లాదేశ్ లోని మైమెన్‌సింగ్‌లో జన్మించారు తస్లీమా. ముస్లిం కుటుంబంలో పుట్టి, పెరిగినప్పటికీ ఆమె హేతువాదిగా, నాస్తకురాలిగా మారారు. వైద్యవిద్యను అభ్యసించిన ఆమె 1994 వరకు ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేశారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే అభ్యుదయవాద రచనలు చేసేవారు. ఆమె రచనలు 1990లోనే ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. 1992లో బాబ్రీమసీదు కూల్చివేతకు ప్రతిస్పందిస్తూ ఆమె రాసిన లజ్జా నవల అనేక వివాదాలకు కారణమైంది.

మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా మనిషిగా ఆమె తన రచనల్లో వెలువరించిన స్వేచ్ఛా అభిప్రాయాలకు 1994లో యూరోపియన్ పార్లమెంటు నుంచి సఖరోవ్ బహుమతిని పొందారు. మనిషికి కావల్సింది మతం కాదు మానవత్వం అని చాటిన ఆమె 1996లో మానవతా అవార్డు అందుకున్నారు.

తన రచనల ద్వారా ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపే సాహసం చేశారు తస్లీమా. ఇస్లాం లేఖనాలను విమర్శించినందుకు 1993 నుంచి ఇస్లాం ఛాందసవాదులు ఆమెపై ఎన్నో సార్లు దాడులకు ప్రయత్నించారు. బంగ్లాదేశ్ నుండి వచ్చి కోల్‌కతలో నివాసం ఏర్పర్చుకున్నారు. ఆ తరువాత చాందసవాదులు ఆందోళన చేయడంతో భారత ప్రభుత్వం ఆమెకు ఢిల్లీలో ఆశ్రయం కల్పించింది. 2007లో హైదరాబాదులో ఒక రచయితల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన సందర్భంలో ఆమెపై దాడిచేశారు. పశ్చిమ బెంగాల్లో ఉంటున్న ఆమెను భారతదేశం నుంచి బహిష్కరించాలని ప్రదర్శనలు చేశారు. ఆమెకు భారత పౌరసత్వం ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె భారత్‌ను వదిలి స్వీడిష్ పౌరసత్వం తీసుకున్నారు.

కండ్లమంట తగ్గాలంటే...



ఉల్లిగడ్డలను కోసేటప్పుడు కంటనీరు పెట్టనివారుండరు. ఇల్లుండదు. ఒక్క కోసేటప్పుడేనా... కొన్ని గంటల వరకు దాని తాలూకు ఘాటు కళ్లను వెంటాడుతూనే ఉంటుంది. అలా అని కట్ చేయకుండా ఉందామా అంటే... ఉల్లి లేని కూర రుచిగా ఉండదు. అది చేసే మేలు కూడా అంతా ఇంతా కాదు. ఉల్లిగడ్డలు కోయడం కోసం కన్నీళ్లను వృథా చేసుకోవడం ఎంత బాధాకరం? మరి ఆ మంట నుంచి బయటపడటం ఎలా అనుకుంటున్నారా? ఏం లేదు చిన్న టిప్ ఫాలో అయితే సరిపోతుంది. ఉల్లిగడ్డలు కట్‌చేయడానికి ముందు పదిహేను నిమిషాలు ఫ్రీజర్‌లో ఉంచాలి. దీనివల్ల కట్ చేసేటప్పుడు కొంచెం కష్టమవుతుంది. అంతేకాదు... పైన ఉన్న పొట్టును తొలగించడం కూడా కొంచెం కఠినమవుతుంది. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఉల్లిగడ్డలో ఉన్న సల్ఫర్ యాక్టివిటీని ఫ్రిజ్ లోని చల్లదనం తగ్గిస్తుంది. అయినా... కళ్ల మంటనుమాత్రం తగ్గిస్తుంది.

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్ 5
శుక్రవారం 25-8-2017

కశ్మీర్... ప్రపంచానికి భూతలస్వర్గం. మంచుపొరలు కప్పుకున్న సుందర సానువులు గోచరిస్తాయి. వాటి మధ్య పారే సన్నటి సెలయేళ్లు సాక్షాత్కరిస్తాయి. నిజానికి కాశ్మీరో నిత్య రణరంగం. సుందరదృశ్యంగా చూసే మనకు అక్కడ పారే నెత్తురు కనిపించదు. బిడ్డలు కోల్పోయిన తల్లులు.. భర్తలను కోల్పోయిన భార్యలు. ఎందుకు చనిపోతున్నామో తెలియకుండానే ప్రాణాలొదిలే పసిపిల్లలు. ఇలాంటి నిత్య సంఘర్షణ వాతావరణంలోనే పెరిగిందామె. స్వాతంత్ర్య దేశంలోనే ఉన్నా... తమ జీవితాల్లో స్వేచ్ఛ ఎందుకు లేదో అర్థం చేసుకుంది. ప్రజాస్వామిక భారతం కోసం పోరాడుతోంది. ఆ యువతి షెహ్లా రషీద్ షోరా. జెఎన్‌యూలో ఎగిసిపడిన విప్లవకెరటం. ఇటీవలే ఓ కార్యక్రమానికి హైదరాబాద్ వచ్చిన ఆమెను మానవి పలకరించింది. ఆ సందర్భంగా షెహ్లా పంచుకున్న అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...



ప్రాణాలనే పణంగా పెడుతున్నాం..

"కశ్మీర్‌లోని మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. అందరి కశ్మీరిల్లాగే నా బాల్యం భయంభయంగా గడిచిపోయింది. ఇప్పుడంటే మీడియా పెరిగింది. 24గంటల వార్తా ఛానళ్లు వచ్చాయి. కానీ అప్పటి పరిస్థితులు వేరు. ఆల్ ఇండియా రేడియో మాత్రమే ఉండేది. టీవీల విషయానికొస్తే దూరదర్శన్ ఒక్కటే. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు టీవీల్లో వేడుకలు అద్భుతంగా జరిగేవి. కానీ మా దగ్గర రియాలిటీ భిన్నంగా ఉండేది. మాకు ఆ రెండు రోజులు కర్ఫ్యూ కచ్చితంగా కొనసాగేది. ఈ తేడా చూశాక ఏదో కోల్పోతున్నాం అనిపించేది. కానీ అదేమిటో తెలుసుకోలేనంత చిన్నవయసు. మా తల్లిదండ్రులకు కర్ఫ్యూ అలవాటై పోయింది. ఇక స్కూలు ఎప్పుడు తెరుస్తరో, ఎప్పుడు మూస్తరో తెలియదు. నిత్యం హింస. ఇంకొన్ని చోట్ల స్కూళ్లు ఉండవు. కరెంటుండదు. న్యూస్‌పేపర్, ఇంటర్నెట్ అంటే... గొంతెమ్మ కోర్కెలు. పిల్లలు ఆడుకునే మైదానాల్లోకి యుద్ధ ట్యాంకులు వస్తాయి. రాజకీయాలు మాట్లాడటానికి అనుమతి ఉండదు. సొంత అభిప్రాయాలను కూడా బయటకు చెప్పేంత స్వేచ్ఛ ఉండదు. రాయడం, చర్చించడం పక్కన పెడితే... ఏం జరుగుతుందో కూడా మాట్లాడలేని స్థితి. చుట్టుపక్కల జరుగుతున్న విషయాల మీద తల్లిదండ్రులతోనూ చర్చించలేని వాతావరణం.

మహిళలకు అవమానం...

ఇదంతా ఒక ఎత్తయితే.. ఆర్మీ జరిపే కార్డన్ సెర్చ్‌లు మరో ఎత్తు. ఇక్కడిలాగా ఫ్లోర్స్‌లాగా ఉండవు కశ్మీర్‌లో. మొత్తం కార్పెట్స్ ఉంటాయి. కార్డన్ సర్చెస్ సమయంలో కనీసం బూట్లను వదిలి లోపలికి రావాలని తెలియదు ఆర్మీ వాళ్లకు. రావడం రావడమే.. మగవాళ్లను బయటికి పంపించేస్తారు. ఓ మైదానంలో వాళ్లను వరుసగా నిలబెట్టి పరేడ్ చేయిస్తారు. ఆ క్రమంలో ఎవరిపైన అయినా వాళ్లకు అనుమానంగా తోస్తే చాలు పట్టుకెళ్లి పోతారు. ఆ తరువాత యువకులు ఎన్‌కౌంటర్ పేరుతో శవాలై కనిపిస్తారు. శవాలకు రాజకీయాలు అంటగట్టే పరిస్థితి ఏంటో నెమ్మదిగా అర్థమైంది. మరోవైపు ఇళ్లలో ఆడవాళ్లు, పిల్లలు మాత్రమే ఉంటారు. ఆ సమయంలో జరిగే హుమిలియేషన్ అంతా ఇంతా కాదు. ఒక్క ఇళ్లల్లోనే కాదు... బస్సులో సర్చ్ చేస్తే... మగవాళ్లను మాత్రం దింపేస్తారు. ఆడవాళ్లను మాత్రమే లోపలే ఉంచుతారు. ఏదైనా జరగడానికి ఆస్కారం ఉంటుంది. ఆ బస్సులో ఉన్న ఆడవాళ్ల మానసిక స్థితి ఎలా ఉంటుంది? ఎలాంటి భయానక పరిస్థితిలో వారుంటారో అర్థం చేసుకోవచ్చు. 1991లో కూనన్ పోష్పోరాకు ముందు.. ఆ తరువాత మహిళలపై అత్యాచారాలు, అవమానాలకు అంతే లేకుండా పోయింది.

తేడా తెలిసింది...

ప్రతీది సెన్సార్ అయ్యే వాతావరణంలో పెరిగాను. కానీ తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కలవాళ్లు అందరూ 'ఏం కాదు.. అంతా బాగుంది' అని నేర్పించేవారు. కానీ పెరిగే కొద్దీ... అంతా సాధారణంగా లేదు అని తెలుసుకోవడం మొదలుపెట్టాను. 2010లో పోలీసులు భాష్పవాయు ప్రయోగంచేశారు. 17 ఏండ్ల యువకుడు చనిపోయాడు. దాని తరువాత ఓ బూటకపు ఎన్‌కౌంటర్ కూడా జరిగింది. వీటికి వ్యతిరేకంగా ఓ నిరసన కార్యక్రమం జరిగింది. అదే సమయంలో మహారాష్ట్రలో కూడా ఓ ప్రొటెస్ట్ జరిగింది. అక్కడ జనం పోలీసులపై రాళ్లువిసిరారు. దానికి పోలీసులు వాళ్లను చెదరగొట్టారు. చిన్నపాటి లాఠీచార్జ్ ఏదో చేశారు. కానీ.. అదే నిరసన, పోలీసులపై రాళ్లు విసిరిన నేరానికి కశ్మీరీ ప్రజలు తమ ప్రాణాలనే కోల్పోవాల్సి వచ్చింది. అక్కడ చిన్న లాఠీఛార్జ్ మాత్రమే జరిగింది. ఇక్కడ జీవితాలనే పణంగాపెట్టాల్సి వస్తున్నది. ఈ రెంటినీ గమనించాక, మిగిలిన ప్రాంతానికి కశ్మీర్‌కు కచ్చితంగా వ్యత్యాసముందని నాకు తెలిసొచ్చింది. దేశంలో మిగిలిన ప్రాంతాలన్నీ సొంతబిడ్డల్లా, మేం మాత్రం సవతితల్లి బిడ్డల్లా చూడబడుతున్నామని తెలుసుకోగలిగాను. ఇవన్నీ చూస్తుంటే ఆగ్రహం కలిగేది. కానీ దాన్ని ఆర్గనైజ్ చేసేదెలాగో తెలియకపోయేది. 2010 తరువాత 'యూత్ సమ్మిట్' నిర్వహించడం ప్రారంభించాం. 600 మంది యువత కలిసి ఓ చిన్న సమావేశం. అప్పటి పరిస్థితులపై నివేదికలు సమర్పించడం, చర్చలు చేయడం ఎజెండాగా ఉండేది. అలా కొంత రాజకీయావగాహన పెరిగింది. శ్రీనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ బీటెక్ పూర్తయిన తరువాత కొన్నాళ్లపాటు ఉద్యోగం కూడా చేశాను. కానీ నేను నమ్మినదానికి, చేస్తున్న పనికి పొంతన లేదనిపించింది. తరువాత ఐఐఎం బెంగళూరులో పొలిటికల్ లీడర్‌షిప్‌లో సర్టిఫికెట్ కోర్సు చేశాను. తరువాత జేఎన్‌యూలో ఎమ్మే సోషియాలజీలో చేరాను. నిత్యం కల్లోలంగా ఉండే కశ్మీర్‌ను చూసిన నాకు క్యాంపస్‌లోని ప్రజాస్వామిక వాతావరణం ఆశావహంగా కనిపించింది. ఇప్పుడు ఎంఫిల్ చేస్తున్నాను.



ఉద్యమాలే పరిష్కారం...

నిజానికి అన్ని యూనివర్సిటీల్లో వాతావరణం అంత ప్రజాస్వామికంగా లేదు. కొన్ని యూనివర్సిటీల్లో అమ్మాయిలకు క్యాంపస్‌లకు డ్రెస్ కోడ్ విధిస్తున్నారు. ఎనిమిది దాటితే బయట ఉండొద్దనే నిబంధనలు తెచ్చారు. చివరకు అమ్మాయిలు తమ మెన్‌స్ట్రువల్ డేట్స్‌ను కూడా రిజిస్టర్‌లో పొందుపరచాలనే చెత్త నియమాలు ఉన్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో లైబ్రరీలు 24గంటలు తెరిచే ఉంటాయి. కానీ 8గంటలకే అమ్మాయిల హాస్టల్స్ మూసేస్తే వాళ్లకు చదువుకోవడానికి అవకాశమేదీ? అబ్బాయిలయితే బలాదూర్‌గా తిరగొచ్చు... వాళ్లకు ఇష్టమొచ్చిన సమయానికి చదువుకునే అవకాశం ఉంటుంది. యూనివర్సిటీల్లో ఇలాంటి వివక్ష పోవాలంటే విద్యార్థినులు ఉద్యమాలు చేయాలి. విద్య కార్పొరేట్ అయిపోయింది... ఉపాధి అవకాశాలు లేవు. యువత ఆగ్రహంలో ఉంది. ఆ యూత్ ఫోర్స్‌ను కనెక్ట్ చేస్తూ ఉద్యమాలు నిర్మించగలగాలి. అయితే ఏకంగా ఉద్యమాలు అంటే ఎవ్వరూ ముందుకు రారు. వాళ్ల వాళ్ల సమస్యలను ప్రస్తావిస్తూ అర్థమయ్యేరీతిలో చెప్పగలిగితే కచ్చితంగా ముందడుగు పడుతుంది.

మహిళలందరిని కూడగట్టాలి...

నిజానికి మన దేశంలో చాలా విషయాల్లో విజయాలు సాధించాం. ఎందుకంటే అమెరికా, యూకే మహిళల్లాగా ఓటు హక్కు కోసం కూడా పోరాడాల్సిన అవసరం మనకు రాలేదు. కానీ మనం పోరాడాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. ప్రపంచంలో ఏం జరుగుతోంది? చుట్టుపక్కల ఏం జరుగుతోందని మహిళలు ఇప్పుడిప్పుడే గమనించడం మొదలుపెట్టారు. అంతర్మథనం ప్రారంభమైంది. బయట మహిళలపై కొనసాగుతున్న హింస గురించే కాదు... గృహహింస, మ్యారిటల్ రేప్స్ వంటివాటి గురించి కూడా మాట్లాడుతున్నారు. అయితే ఒకే సారి ఉద్యమాలు సాధ్యం కాకపోవచ్చు. కానీ అవకాశం ఉన్న ప్రతిచోటా మాట్లాడుతూ ఉండాలి. ప్రశ్నిస్తూ ఉండాలి. బహిరంగ స్థలాలను... అంటే రాజకీయాల్లో సైతం మన స్థానాలను మనం దక్కించుకోవాలంటే... ధర్నాలయినా, ప్రభుత్వ కార్యక్రమాలయినా, స్వచ్ఛంద సంస్థలైనా, పార్టీలైనా ఏకార్యక్రమం జరిగినా.. అందులో మహిళలెక్కడ? అనే ప్రశ్న లేవనెత్తాలి. జవాబు చెప్పాల్సి వస్తుంది కాబట్టి ఒక చర్చ జరుగుతుంది. తెలంగాణలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ ఉంది. కానీ అక్కడా మళ్లీ పురుషుల పెత్తనమే ఉందని విన్నాను. భర్తలో, కొడుకులో ఎవరో ఒకరు అధికారాన్ని చెలాయిస్తున్నారు. ఈ పద్ధతి పోవాలి. ఏ పార్టీలో అయినా మహిళా ప్రాతినిధ్యం ఎంత? అని ప్రశ్నించాలి. ప్రతి పార్టీలో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులుంటేనే ఓట్లేస్తాం అనే తీర్మానం మహిళలు, మహిళా సంఘాలుగా చేసుకోవాలి. అప్పుడే మహిళల సమస్యల ఎజెండా సాధ్యమవుతుంది. మహిలా నాయకులకు మద్దతు పలకాలి. వాళ్లకు మనం నిర్ణయించిన మేనిఫెస్టోను ఇవ్వాలి. అప్పుడు కొంతమేరకైనా మహిళలకు న్యాయం జరుగుతుంది. కేవలం మహిళా సమస్యలే కాకుండా పర్యావరణం, దళితులు, రైతులు, వైకల్యంతో ఉన్నవారు.. ఇలా అందరినీ కూడగట్టుకుంటూ వాళ్ల సమస్యలపైనా పోరాటం చేయాలి.

మార్పు సాధ్యమే...

ఈ పోరాటంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ప్రజాజీవితంలో ఉన్నవాళ్లపై సహజంగా జరిగేదాడే. కాకపోతే మహిళలైతే ఇంకెక్కువ దాడి చేస్తారు. క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తారు. నిందలు మోపుతారు. నేను కాశ్మీరీని కావడం, అందులోనూ ముస్లిం మహిళను అవ్వడంతో ఎన్నో రకాలుగా టార్గెట్ చేశారు. కానీ ఇవేవీ నన్ను వెనుకడుగు పడేలా చేయలేదు సరికదా... మానసికంగా మరింత స్థైర్యాన్ని నింపాయి. నేను మాట్లాడాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. పోరాడాల్సిన అంశాలు అనేక ఉన్నాయి. మహిళలు, దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా చేయాల్సిందెంతో ఉంది. లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉన్నది. పోరాటాలతో కచ్చితంగా మార్పు సాధ్యమవుతుందని నా ఆశ"

కట్ట కవిత

పెట్టుబడికి కొన్ని మార్గాలు...

దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొవాలంటే డబ్బు విషయంలో కచ్చితమైన ప్రణాళికలు తప్పని సరి! ప్రస్తుతం మార్కెట్‌లో చాలా రకాల ఇన్వెస్టిమెంట్‌లు ఉన్నాయి. ప్రయివేట్ సంస్థల్లో డబ్బును పెట్టుబడిగా పెట్టి మోస పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. స్వల్ప కాలంలో డబ్బును ఆదా చేయాలంటే ఇన్సూరెన్స్‌లు ఉన్నాయి. అయితే అవి జీవితానికి కచ్చితమైన భరోసాను కల్పించవు. అందుకే చాలా మంది సంపాదన మొదలు పెట్టిన సమయం నుంచి పెట్టుబడుల వెంట పడతారు. పెట్టుబడి పెట్టే వారిలో రెండు రకాలు ఉంటారు. ఎక్కువ రిస్క్ తీసుకుని బాగా డబ్బు సంపాదించాలని, ఎలాంటి రిస్క్ లేకుండా మన పెట్టుబడి భద్రంగా ఉంటే చాలు అనుకునే వారు దీర్ఘకాల లక్ష్యాలు కలిగి ఉన్న వారికి పెట్టుబడులకు సురక్షితమైన కొన్ని మార్గాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం...!

బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ)

ఏ బ్యాంక్‌లో డబ్బు డిపాజిట్ చేస్తే వడ్డీ ఎక్కువ వస్తుందో చూసుకోవాలి. ప్రతి బ్యాంక్ హెూమ్ పేజీలోనే వడ్డీ రేట్‌ల లింక్‌లను ఇస్తుంటాయి. ఎంత కాల పరిమితి వరకు డబ్బును డిపాజిట్ చేస్తున్నారో గమనించుకోవాలి. అలాగే వడ్డీ ఆఫర్లను తెలుసుకొని డిపాజిట్ చేయాలి. సమయానుసారంగా బ్యాంక్‌లు ప్రత్యేక డిపాజిట్ పథకాలను ప్రవేశ పెడుతుంటాయి. బ్యాంక్ ఎఫ్‌డీల వైపు మొగ్గు చూపే వారు దీర్ఘకాలంలోను కచ్చితమైన రాబడిని ఆశిస్తారు. కాబట్టి పెట్టుబడులపై తక్కువ నష్టం ఉండాలని ఎఫ్‌డీలనే ఎంచుకుంటారు. ముఖ్యంగా సీనియర్ సర్జన్‌లు అయితే సాధారణ ఎఫ్‌డీ కంటే అధిక వడ్డీలతో పాటు ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాల టర్న్ డిపాజిట్‌లలో ఇన్వెస్టు చేసుకోవడానికి ఇష్టపడతారు. ఈ కాలంలో వడ్డీ రేట్లు తగ్గినా, ఆదాయానికి భరోసా ఉండటమే ప్రధాన కారణం. ప్రస్తుతం బ్యాంక్‌లు వడ్డీ రేట్లను వరుసగా తగ్గిస్తున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో డబ్బు పెట్టే వారు అధిక వడ్డీ రేట్ల కోసం కాస్త దీర్ఘకాల వ్యవధి ఉండే టర్న్ ప్లాన్‌లనే డిపాజిట్లుగా



ఎంచుకోవడం మంచిది.

రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ)

ప్రతి నెల వచ్చే ఆదాయంలో కొంత డబ్బును పోస్టాఫీసులో లేదా బ్యాంక్‌లో పెట్టుకోవడం. రికరింగ్ డిపాజిట్‌లో కొన్ని ఏండ్ల పాటు డబ్బును డిపాజిట్ చేసుకోవచ్చు. కాల పరిమితి పూర్తి కాగానే వడ్డీతో సహ డబ్బు వస్తుంది. రికరింగ్ డిపాజిట్ వల్ల ప్రతి నెల డబ్బును ఇన్వెస్టు చేసుకోవచ్చు. ఇది దాదాపు బ్యాంకు డిపాజిట్ లాగే ఉంటుంది. దీంట్లో పది వేలకు మించితే పన్ను కట్ చేస్తారు.

పీపీఎఫ్ (పించన్ ప్రొటెక్షన్ ఫండ్)

చాలా మంది ఇష్టపడే పెట్టుబడి సాధనం పీపీఎఫ్. దీన్ని ఎంచుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి వడ్డీ ఆదాయానికి పన్ను ఉండదు. రెండోది పన్ను మినహాయింపు ప్రయోజనాలు ఉన్నాయి. అదే విధంగా పదవీ విరమణ తర్వాత పీపీఎఫ్ నుంచి ప్రతి నెల పించన్ వస్తుంది.



నెలవారీ ఆదాయ పథకాలు

నెలవారీ ఆదాయ పథకాలను చూసినట్లైతే తక్కువ రిస్క్‌తో మంచి పెట్టుబడి, రాబడి ఉండాలనుకునే వారికి ఉత్తమైనది పోస్టాఫీసు పథకాలు. సీనియర్ సిటిజన్లు లేదా పదవీ విరమణ చేసిన వారికి ఇవి బాగా నప్పుతాయి. ఈ పథకాలకు భారత ప్రభుత్వ హామీ ఉంటుంది. కాబట్టి సురక్షితంగా ఉండవచ్చు. అలాగే వడ్డీ రేట్లు కూడా బాగానే ఉన్నాయి.

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్స్

సీనియర్ సిటిజన్స్‌కు వివిధ రంగాల్లో ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుంటుంది. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ ఒకటి. మూడు నెలలకు ఒకసారి భారత ప్రభుత్వమే వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది.

సుకన్య సమ ద్ధి పథకం

ఇది అమ్మాయిల వివాహం, ఉన్నత విద్య కోసం డబ్బు ఆదా చేయాలనుకునే వారికి బాగా ఉపయోగపడుతుంది. బేటీ బచావో-బేటీ పడావో అనే నినాదంతో ప్రభుత్వం ప్రారంభించిన దాంట్లో ఇది ఒకటి. సుకన్య సమద్ధి ఖాతాను బ్యాంకుల్లో, పోస్టాఫీసు కార్యాలయాల్లో తెరవొచ్చు. దీనికి పన్ను మినహాయింపులు ఉన్నాయి.

ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టడం మూలంగా పన్ను మినహాయింపులను పొందవచ్చు. అయితే ఇవి తక్కువ కాల పరిమితిని కలిగి ఉంటాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే అధిక రాబడి కావాలనుకునే వారు వీటిలో డబ్బును పెట్టుబడి పెట్టుకోవచ్చు.

జాతీయ పొదుపు పథకాలు

చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకుంటూ పెట్టుబడిని వద్ధి రేట్లు పెరగాలనుకునే వారికి పోస్టాఫీసు పథకాలు బాగా ఉంటాయి. అలాంటి వాటిలో చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన పథకం జాతీయ పొదుపు పత్రం (నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్స్). ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, నెలవారీ వేతనం పొందే ఉద్యోగులు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. వీటి ద్వారా బ్యాంకుల్లో రుణం సైతం పొందవచ్చు. ❄

సులభంగా అవ్వాలంటే...

గిన్నెలు శుభ్రం చేయడం... చిరాకు పెట్టే పని. మరిదాన్ని సులభంగా చేసుకోవాలంటే... ఈ చిట్కాలు పాటించాలి.



- చాలామంది మహిళలు శుభ్రతకు సంబంధించిన పనులు తాము చేస్తేనే బాగుంటాయని భావిస్తుంటారు. అందుకే గిన్నెలు, బట్టలు వంటివి తామే చేస్తుంటారు. అలా పని ఎప్పుడూ మీరొక్కరే చేయకుండా... ఇంట్లో ఉన్నవాళ్లను భర్త లేదా పిల్లలను భాగస్వాములను చేయండి. దీంతో పని భారం మరింత తగ్గించుకోవచ్చు. శరీరానికి ఎక్కువ ఒత్తిడి కలగకుండా ఉంటుంది.
- చాలా మంది సింక్ నిండా గిన్నెలయ్యేవరకు చూస్తారు. అలా కాకుండా... వాడిన పాత్రలు వాడినట్టే వెంటనే శుభ్రం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. శుభ్రం చేయడానికి తక్కువ సమయం పడుతుంది. దాంతో త్వరగా శుభ్రం చేయాలనే ఆలోచన కలుగుతుంది.
- వంట చేయడానికి ఎక్కువ పాత్రలు ఉపయోగించడం నివారించాలి. తిరిగి ఉపయోగించే పాత్రలను వెంట వెంటనే శుభ్రం చేసుకుంటుండాలి. అలా చేస్తుంటే క్రమంగా పాత్రలు తక్కువగా పడుతాయి. మీకు శ్రమ తగ్గుతుంది.
- వాడిన పాత్రలను, వాడని పాత్రలన్నింటిని షింక్ దగ్గర్లో ఉంచకూడదు. ఇలా చేయడం వల్ల మొత్తం, కలిసిపోయి చిందరవందరగా కనబడుతాయి. మురికిపడ్డ పాత్రలన్నీ ఒక టబ్‌లో వేసి తర్వాత శుభ్రం చేసుకోవడం వల్ల సింక్ అశుభ్రంగా కనబడకుండా ఉంటుంది.
- పనిభారం ఎక్కువగా ఉన్నప్పుడు మీకు నచ్చిన మ్యూజిక్ వింటూ పని మొదలు పెడితే మీ పనిని మరింత సులభతరం చేస్తుంది . మీ ఏకాగ్రత పాత్రల శుభ్రం చేయడం కంటే మ్యూజిక్ మీద ఉండటం వల్ల పని భారంగా అనిపించదు. త్వరగా పని పూర్తి చేయగలుగుతారు. ❄

ఇట్లచేద్దాం

రోజంతా బయట తిరిగి వచ్చాక ముఖం చర్మం నిర్జీవంగా తయారవుతుంది. తిరిగి తాజాగా మెరవాలంటే... బొప్పాయి గుజ్జుకి కొంచెం తేనె కలపాలి. దీనికి ఓట్స్ జత చేసి, పచ్చిపాలు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో ముఖానికి మసాజ్ చేసి... ఆరేదాకా వదిలేయాలి. తరువాత చల్లటినీటితో కడిగితే మంచి ఫలితం ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్

శిల్పా చక్రపాణిరెడ్డిపై దాడికి యత్నం

నంద్యాల: నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ వద్ద గురువారం వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై టీడీపీ నాయకుడు అభిరుచి మధు కత్తితో పట్టపగలే వందల మంది సమక్షంలో దాడికి యత్నించారు. ఉప ఎన్నికలు బుధవారం ముగియడంతో గురువారం జరిగిన ఈసంఘటన రాష్ట్రంలో సంచలనమైంది. అధికార పార్టీ ఓటమి భయంతో దాడులకు పురిగొల్పిందని వైసీపీ నాయకులు అంటుండగా కావాలనే గొడవలు సృష్టిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక పక్క ఎన్నికలకోడ్ ముగియక ముందే అభిరుచి మధు అనే రౌడీషీటర్ ఆయుధాలతో బయట తిరుగుతున్నా పట్టించుకోని పోలీసుల వ్యవహారం చర్చనీయాశమైంది. బహిరంగంగా కత్తితో చంపేస్తానని బెదిరించిన అభిరుచి మధును వదిలిపెట్టి శిల్పాచక్రపాణిరెడ్డి, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది.

సంగీత చటర్జీ ఆత్మహత్యాయత్నం

చిత్తూరు: రెడ్‌క్వీన్‌గా పేరుగాంచిన టీవీ నటి సంగీత చటర్జీ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎర్రచందనం కేసులో చిత్తూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆమె బాత్‌రూం క్లీనర్‌ను (హార్‌ఫిక్) తాగి ఆత్మహత్యాయత్నానికి పూనుకుంది. జైలు సిబ్బంది ఆమెను హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన పేరుమోసిన ఓ ఎర్ర చందనం స్మగ్లర్‌కు సహకరించిన నేరం కింద సంగీత చటర్జీ ఐదు నెలలుగా చిత్తూరు సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

రైళ్లలో పరిశుభ్రతపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్: రైళ్లు, ఫ్లాట్ ఫారాలు, బోగీలు, టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడంపై హైకోర్టు అసంతప్తిని వెలిబుచ్చింది. ప్రయాణికులకు శుభ్రతతో కూడిన వసతులు ఎందుకు ఇవ్వలేకపో తున్నారని రైల్వే శాఖను ప్రశ్నించింది. ఆఖరికి ఉన్నతశ్రేణి బోగీల్లో ఎలుకలు తిరగడం స్వయంగా తామే చూశామని, ఇలాంటి వాటిని నివారించాల్సిన సిబ్బంది ఏం చేస్తున్నారని రైల్వే అధికారులను హైకోర్టు నిలదీసింది. భిక్షాటన చేసే వారో, అనాథలో, ప్రైవేటు వ్యక్తులో వచ్చి బోగీల్ని తుడిచి ప్రయాణికుల నుంచి డబ్బు కోరే పరిస్థితుల్ని రైల్వే శాఖ ఎందుకు చక్కదిద్దలేక పోతోందంటూ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ నిప్పులు చెరిగింది.

సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం

- మహారాష్ట్ర అంధశ్రద్ధ సమితి నేతలు అవినాశ్ పాటిల్, సుధేశ్ గోడేరావు
- సీఎం కేసీఆర్‌కు లేఖ
- ఆ ముగ్గురి హత్యల కేసుల్లో నిందితులను గుర్తించాలని డిమాండ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూఢ నమ్మకాలు, సాంఘిక బహిష్కరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్టు మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలనా సమితి ప్రకటించింది. ఈమేరకు ఆ సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు పి. అవినాశ్‌పాటిల్, జాతీయ సమన్వయ కార్యదర్శి సుధేశ్ గోడేరావుతో కూడిన ఆరుగురు సభ్యుల బృందం గురువారం హైదరాబాద్‌కు వచ్చింది. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా మూడు డిమాండ్లను అందులో ప్రస్తావించారు. మూఢ నమ్మకాల నిర్మూలనా చట్టం తేవాలని, సాంఘీక బహిష్కరణల నిషేద చట్టం రూపొందించాలని, వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యా యులకు శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లనున్నట్టు ప్రకటించారు. సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంటు ఇస్తే మూఢనమ్మకాలు, సాంఘీక బహిష్కరణలు తదితర అంశాలపై ఆయనతో చర్చిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో జనవిజ్ఞాన వేదిక, మానస విజ్ఞాన వేదిక, ఐద్వాతో కలిసి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా ప్రతినిధులతో భేటి అయ్యారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు హిమాయత్‌నగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా అవినాశ్‌పాటిల్, సుధేశ్‌గోడేరావు మాట్లాడుతూ మహారాష్ట్రలో డాక్టర్ నరేంద్ర దభోల్కర్ కృషిమేరకు మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం వచ్చిందన్నారు. దొంగ బాబాలు, స్వాముల అరాచకాలను అరికట్టడానికి ఇది ఉపయోగపడుతున్నారు. సాంఘిక బహిష్కరణలను ఎదుర్కోవడానికి ప్రత్యేక చట్టం అవసరమన్నారు. వీటి కోసం దేశవ్యాప్త ప్రచారం చేస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులకు బోధించేందుకుగాను ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. 2013లో డాక్టర్ నరేంద్ర దభోల్కర్ హత్య కేసు నిందితులను ఇప్పటివరకు గుర్తించకపోవడం దారుణమని చెప్పారు. ఫన్సారే, కాల్బుర్గి హత్య కేసులు సైతం ఇప్పటివరకు అలాగే ఉన్నాయన్నారు. సీబీఐ విచారణ చేసినా ఫలితం లేదన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ సాగుతున్నదని, ఎలా విచారణ చేయాలో కూడా సీబీఐకి హైకోర్టు చెప్పాలిస్తున్నదని అన్నారు. సీబీఐ, సిట్, సీఐడీలు ఈ కేసుల్లో విఫలమయ్యాయని విమర్శించారు. నిందితుల వెనుక ఎలాంటి సంస్థలు ఉన్నాయో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. నిధులు సమకూర్చిన వ్యక్తులు, సంస్థలను విచారించాలని కోరారు. కేంద్రంతోపాటు మహారాష్ట్రలోనూ మతోన్మాద బీజేపీ అధికారంలో ఉందన్నారు. ఈనేపథ్యంలో దభోల్కర్, ఫన్సారే, కాల్బుర్గి హత్య కేసులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. హత్యలు చేసిన నిందితులు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నారని, వారిని పట్టుకునేందుకు విచారణ సంస్థల పరిధి పెంచాలని డిమాండ్ చేశారు. మూఢ నమ్మకాలు, సాంఘిక బహిష్కరణల కేసులు గత నాలుగేండ్లుగా మహారాష్ట్రలో 400 కేసులు నమోదు కాగా ఆరు కేసుల్లో తీర్పులు వచ్చాయన్నారు. మిగతావి ఇంకా విచారణలో ఉన్నాయని వివరించారు. అఖిల భారత ప్రజా సైన్స్ నెట్‌వర్క్(ఏఐపీఎస్ఎన్) జాతీయ కార్యదర్శి టి రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరంకుశ చర్యలు సరికాదన్నారు. నిజామాబాద్‌లో 100 కుటుంబాలను వేధించడం సరికాదన్నారు. కులదురంహకార హత్యలు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ హత్య ఈ కోవకు చెందినదేనన్నారు. మూఢ నమ్మకాలు, సాంఘిక బహిష్కరణలను నియంత్రించాలంటే ప్రత్యేక చట్టం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఆదినారాయణ, మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, మానవ జనవేదిక నాయకులు మాదివాడ రామబ్రహ్మం, మానవ వికాస వేదిక నాయకులు విక్రమ్, స్వరాజ్యలక్ష్మి, హేతువాద సంఘం నాయకులు సాంబశివరావు, ఎవిఎన్ మూర్తి, సిహెచ్ రాంచందర్‌రాజు పాల్గొన్నారు.

27-29 తేదీల్లో రాష్ట్రస్థాయి సెమినార్, శిక్షణా తరగతులు

- పోస్టర్ ఆవిష్కరించిన రైతు సంఘం నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 27,28,29 తేదీలలో రాష్ట్రస్థాయి సెమినార్, శిక్షణా తరగతులు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ చెప్పారు. 'వ్యవసాయ సంక్షోభం-రైతు ఆత్మహత్యలు-పరిష్కారమార్గాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. శిక్షణా తరగతులకు అన్ని జిల్లాల నుంచి రైతుసంఘం నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు. గురువారం రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్‌రావు, బొంతల చంద్రారెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు రాష్ట్ర సదస్సుపై రైతుసంఘం రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. రైతులు ఎదు ర్కొంటున్న పలు సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యతు కార్యా చరణను రూపొందిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆత్మ హత్య ల పరంపర కొనసాగుతుందన్నారు. టీఆర్ఎస్ మూడేండ్ల పాలనలోదా దాపు 4 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ం ఆ కుటుంబాలను ఆదుకునేందుకు కనీస చర్యలు తీసుకోలేదని చెప్పా రు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ 6 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చినా...ఆచరణలో అమలు చేయలేదని చెప్పారు.

బియ్యం వ్యాపారిపై పీడీ యాక్ట్ ప్రయోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ సివి ఆనంద్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ శాఖకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బందాలను రంగంలోకి దించి బియ్యం అక్రమ రవాణాదారుల కదలికపై నిఘా ఉంచారు. ఇప్పటికే ఈ బందాల దాడులతో ఇద్దరిపై పీడీ కేసులు, పలువురు అక్రమ వ్యాపారులపై 6ఏ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. తాజాగా కమిషనర్ సిఫార్సు మేరకు ప్రజాపంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టించిన నల్లగొండ జిల్లా దేవరకొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ (50) ఆ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ గురువారం పీడీ కేసు నమోదు చేశారు. నల్గొండ జిల్లాలోనే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాల్లో చంద్రశేఖర్‌ది పెట్టింది పేరు. నల్గొండ, దేవరకొండ కేంద్రంగా కొన్నేండ్లుగా పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నారు. ఇందుకు సంబంధించి 2014లోనే తొలి కేసు నమోదైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు నిందితునిపై 6ఏ కేసులు 16, క్రిమినల్ కేసులు 5, మూడు బైండ్‌ఓవర్ కేసులు నమోదయ్యాయి. అయినా కూడా చంద్రశేఖర్ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతూనే ఉండటం విశేషం.

డిగ్రీకాలేజీల్లో అడ్మిషన్లకు మరోఅవకాశం

26 నుంచి 29 వరకు వెబ్‌ఆప్షన్లు, 31న సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులకు ఉన్నత విద్యామండలి మరో అవకాశమిచ్చింది. ఈనెల 26నుంచి నాల్గోవిడుత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నది. సచివాలయంలో గురువారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, వైస్‌చైర్మెన్ వెంకటరమణ తదితరులతో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య డిగ్రీ అడ్మిషన్లపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఈనెల 26 నుంచి 29 వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలనీ, 31న సీట్లు కేటాయిస్తామనీ, సెప్టెంబర్ 4లోపు కాలేజీల్లో చేరాలని పాపిరెడ్డి సూచించారు. మూడు విడుతలుగా జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో ఇప్పటికి 1,87,368 మంది విద్యార్థులు దోస్త్ పరిధిలోని డిగ్రీకాలేజీల్లో చేరారని, దోస్త్ కేటగిరిలో లేని 42 కాలేజీల్లో 19,031మంది విద్యార్థులు, రెసిడెన్షియల్ కాలేజీల్లో మరో మూడువేలమంది సీట్లు పొందారని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాభిప్రాయసేకరణను టీఆర్ఎస్ అడ్డుకుంటోంది

- కాళేశ్వరం ప్రాజెక్టుపై జానారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వాసితులు, ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పకుండా టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకుంటున్నారని ప్రతి పక్ష నేత కె జానారెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభి ప్రాయాలు ముఖ్యమని హితవు పలి కారు. గురువారం అసెంబ్లీ ఆవరణ లోని మీడియా హాల్‌లో మండలిలోని ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలకు అడ్డం పడటం సరైందికాదన్న కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. అభిప్రాయం చెప్పకూడ దని అధికార పార్టీ భావించడం అప్రజాస్వామికమన్నారు. భూనిర్వాసితుల సమస్యలు, పరిహా రంపై ఎంత కావాలనే విషయాన్ని ప్రస్తావించకుండా ప్రాజెక్టు కట్టాలా? వద్దా? అంటూ అధికారులు బాధితు లను ప్రశ్నలు అడగటం సరైందికా దన్నారు. ప్రాజెక్టుల ద్వారానే సాగు, తాగు అందుతోందని, ప్రాజెక్టుల నిర్మా ణానికి తాము వ్యతిరేకమంకాదన్నా రు. అయితే కాంగ్రెస్ పార్టీయే ప్రాజెక్టులకు అడ్డుపడుతుందని టీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తోందన్నారు. మండలిలోప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ వ్యవస్థను కాపాడాల్సిన పోలీసుతలే వ్యవస్థను చెడగొడుతు న్నారని విమర్శించారు. నేరెళ్ల సంఘట నతో కూడా పోలీసులకు బుద్ధిరాలేద న్నారు. ప్రభుత్వం పోలీసు లను ఉపయోగించి ప్రజావ్యతిరేక నిర్ణయా లను అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. కాళేశ్వ రం ప్రాజెక్టు భూసేకరణకు పోలీసుల ను మోహరించి ప్రజలను భయాం దోళనకు గురి చేస్తోందన్నారు. ముఖ్య మంత్రి కె చంద్రశేఖరరావు అనుభవ రాహిత్యం, మొండితనంతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

భూసర్వేపై విధి, విధానాలు ప్రకటించండి : షబ్బీర్ అలీ

భూ సర్వేకు మేము వ్యతిరేకం కాదని మండలిలోని ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వే ముందు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. విధి విధానాలు లేకుండా భూసర్వే చేయటంతో ప్రజలు ఎంతో ఇబ్బందిపడుతారని చెప్పారు. విధి, విధానాలు తెలిస్తే కాంగ్రెస్ పార్టీ కొన్ని సలహాలు, సూచనలు కూడా ఇస్తోందన్నారు. భూసర్వే శాస్త్రీయంగా చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

కళారంగానికి తీరనిలోటు..

- మధుసూదన్‌రెడిమృతిపట్ల సీపీఐ (ఎం) సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా కళాకారుడు, మార్క్సిస్టు పార్టీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి మరణంపట్ల సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన మరణం కళారంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఖమ్మం జిల్లా విద్యార్థి, యువజన ఉద్యమాల్లో,పట్టణ శాఖా కార్యదర్శిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు.

'చవితి' శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వినాయక చవితి ఉత్సవాల్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ గురువారంనాడొక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, శక్తివంతమైన నవభారత్ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా ముందుగా సాగాలని ఆయన ఆకాంక్షించారు.

ఆంధ్రా సీఐడీ ఐజీపై వరకట్నం కేసు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ సీఐడీ ఐజీ పివి సునీల్ కుమార్‌పై రాష్ట్ర సీఐడీలో వరకట్నం నిరోధక చట్టం క్రింద కేసు నమోదు అయ్యింది. సీఐడీ అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం తనను వరకట్నం కోసం సునీల్ కుమార్ వేధిస్తున్నట్టు ఆయన భార్య అరుణ రాష్ట్ర సీఐడీ విభాగంలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర సీఐడీ అధికారులు సునీల్‌కుమార్‌పై సెక్షన్ 498, 506 తోపాటు డీపీ యాక్ట్‌లోని 3, 4 క్రింద కేసులు నమోదు చేశారు. గత నెలలో ఈ కేసు నమోదైందని, విచారణ జరుపుతున్నామని సీఐడీ ఉన్నతాధికారులు తెలిపారు. కాగా తమ మధ్య చోటు చేసుకున్న వివాదం త్వరలోనే సమసి పోతుందని సునీల్‌కుమార్ ఆయన సన్నిహితులకు తెలిపినట్టు సమాచారం.

భూసర్వేపై టీడీపీ చర్చ

- ముఖ్యనేతలతో రమణ భేటీ
- అంతర్గత వ్యవహారాలపై మాటామంతీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సర్కారు చేపడుతున్న భూసర్వేతోపాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై తెలంగాణ తెలుగుదేశం ప్రత్యేకంగా భేటిని ఏర్పాటు చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ అధ్యక్షతన గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. దీనికి పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కార్యక్రమాల కమిటీ చైర్మన్ బుచ్చిలింగం తదితర నేతలంతా హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ప్రభుత్వం చేపట్టనున్న భూసర్వే విధి విధానాల లోపాలపై చర్చ జరిగింది. అలాగే పార్టీ అంతర్గత అంశాలనూ ప్రస్తావించారు. గ్రామ స్థాయి నుంచి అన్ని కమిటీలు వేయాలని పార్టీ యంత్రాంగాన్ని రమణ ఆదేశించారు. ప్రతి సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు నియోజకవర్గ కేంద్రాల్లో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టనున్న భూసర్వేపై పార్టీ నాయకత్వం అనుమానాలను వ్యక్తం చేస్తున్నది.

సర్కారు సర్వే లోపభూయిష్టంగా ఉందనే అభిప్రాయాలు సమావేశంలో వచ్చినట్టు పార్టీ వర్గాలు చెప్పారు. ఆయా కమిటీల్లో టీఆర్ఎస్ కార్యకర్తలను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని అన్నట్టు తెలిసింద. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ అధ్యక్షులు రమణ సూచించినట్టు సమాచారం. అలాగే రేషన్ దుకాణాలు కేవలం బియ్యానికి పరిమితం చేశారని, మిగతా నిత్యావసర సరుకుల సరఫరాపై కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. ఇకపోతే పరిమితంగా కురుస్తున్న వర్షాల మూలంగా కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దానిపై నివేదికలు ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. ఈ సమావేశానికి రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఆయన తన నియోజకవర్గానికి వెళ్లినట్టు తెలిసింది. సమావేశం అనంతరం నరేందర్‌రెడ్డి, కూన వెంకటేశ్ గౌడ్, సతీశ్ మాదిగ విలేకర్లకు భేటిలో చోటుచేసుకున్న వివరాలను తెలియజేశారు.

సమ్మెకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సన్నద్ధం

వేతనాల పెంపునకు పోరుబాట

- జేఏసీగా ఏర్పడి ఆందోళనలు
- 28న కలెక్టరేట్ల వద్ద కేజీబీవీ ఉద్యోగుల ధర్నాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



(ఫైల్)

సమస్యల పరిష్కారం కోసం సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. సమానపనికి సమాన వేతనం, ఉద్యోగభద్రతతో పాటు మహిళా ఉద్యోగుల హక్కులపై సమరశంఖం పూరించారు. సమస్యల పరిష్కారంలో సర్కారు నిర్లక్ష్యం వహిస్తే..అవసరమైతే సమ్మెకు సై అంటున్నారు. ఎస్ఎస్ఏలోని వివిధ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)గా ఏర్పడి జిల్లాల వారిగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు 'సమ్మె' నోటీసుసైతం అందించారు.

తెలంగాణ రాష్ట్ర సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టులో సుమారు 15,500 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్ర కేంద్రంతో పాటు జిల్లా, మండల కేంద్రాల్లో వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్ఏ ప్రాజెక్టు వచ్చినప్పటి నుంచి పనిచేస్తున్న ఉద్యోగులు చాలా మందే ఉన్నారు. ఉన్నత చదువులు చదివి, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలను నమ్మి మంచి కొలువులను వదులుకున్న వారు చాలామందే ఉన్నారు. కానీ ప్రస్తుతం ఎస్ఎస్ఏ కేంద్ర ప్రాజెక్టు అనీ, రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేదని ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు చెబుతుండటంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు వివిధ స్థాయిల్లో రూ.6వేల నుంచి రూ.20వేల వరకు వేతనాలు పొందుతున్నారు. పొద్దంతా గొడ్డుచాకిరి చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. వేసవిలోనూ వీరందరినీ టర్మినేట్ చేస్తూ, కేవలం పదినెలలకు మాత్రమే వేతనాలు అందిస్తున్నారు. తిరిగి తీసుకోవాలంటే కూడా పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఎస్ఎస్ఏలో నెలకొన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఉద్యోగభద్రత కల్పించాలనీ, మహిళా కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి వేతనంతో కూడిన ప్రసూతిసెలవులు ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం వేతనాలు పెంచిందనీ, తెలంగాణలో మాత్రం సీఎం ఆమోదం కోసం వేతనాల ఫైల్ పంపినట్టు మూడు నెలల నుంచి అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జేఏసీతో ముందుకు...

ఎస్ఎస్ఏలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలు చాలా కీలకం. వీరు లేకుంటే చాలా పనులు అర్థంతరంగా నిలిచిపోతాయనడంలో సందేహం లేదు. ఎస్ఎస్ఏలో శ్రమదోపిడీని నిరసిస్తూ, హక్కుల సాధన కోసం ఉద్యోగులు ఐక్యమయ్యాయి. దీనిలో భాగంగా సీఆర్‌పీలు, ఐఈఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, కేజీబీవీ సీఆర్‌టీలు తదితర ఉద్యోగులంతా ఐక్యంగా జేఏసీగా ఏర్పడ్డారు. ఇప్పటికే జేఏసీ ఆధ్వర్యంలో దాదాపు రాష్ట్రంలోని సగం జిల్లాల్లో భారీ ర్యాలీలు నిర్వహించి, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. దీంతో పాటు ఇప్పటికే సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని, సమ్మెనోటీసును డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యకు జేఏసీ ప్రతినిధులు అందించారు. సెప్టెంబర్‌లో రెండోవారంలో హైదరాబాద్‌లో భారీప్రదర్శన నిర్వహించాలనీ, అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకుంటే సెప్టెంబర్ చివరి వారంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెబాట పట్టాలని జేఏసీ భావిస్తున్నది. ఈ మేరకు కిందిస్థాయి నుంచి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నది.

28న కేజీబీవీ ఉద్యోగుల ఆందోళన..

కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల28న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నారు. పదో పీఆర్‌సీ ప్రకారం వేతనాలు అందించాలనీ, వేసవిసెలవుల్లోనూ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేజీబీవీల్లో పనిచేసే వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని, మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు నిర్వహించిన ఫలితం లేకపోవడంతో, కేజీబీవీ ఉద్యోగులు మరోసారి ఆందోళనబాట పట్టారు.

ప్రభుత్వం వద్ద ఫైల్: జి కిషన్, ఎస్ఎస్ఏ ఎస్పీడీ

ఎస్ఎస్ఏలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను త్వరలో పెంచుతాం. ఉద్యోగుల వేతనాలు పెంచేందుకు ఎస్ఎస్ఏ పాలకమండలిలో ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం.

లుంబిని, గోకుల్‌చాట్ మారణ హోమం

నేటికి పదేండ్లు

- ఇంక దొరకని ప్రధాన నిందితుడు రియాజ్ భత్కల్
- పాకిస్తాన్‌లో ఉన్నాడంటున్న ఎన్ఐఏ
- ఇందులో ఒక నిందితుడికి దిల్‌సుఖ్‌నగర్ కేసులో ఉరి వేయాలని ప్రత్యేక కోర్టు తీర్పు
- నాంపల్లి కోర్టులో ఈ కేసుపై సాగుతున్న ట్రయల్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన హైదరాబాద్ లుంబిని పార్కు, గోకుల్ చాట్‌లలో ఉగ్రవాదులు పేలుళ్లతో మారణహోమానికి పాల్పడి శుక్రవారం నాటికి పదేండ్లయ్యింది. అయితే ఈ పేలుళ్లకు ప్రధాన సూత్రధారి అయిన కరడుగట్టిన ఉగ్రవాది రియాజ్ భత్కల్‌ను ఇంకా పట్టుకోవడంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీసు వ్యవస్థలు ఎలాంటి పురోగతినీ సాధించలేక పోయాయి. కానీ ఆ రెండు పేలుళ్లలో తమ వారిని కోల్పోయిన బాధిత కుటుంబసభ్యులకు ఆనాటి భయానక ఘటనలు ఇంకా వారి స్మృతిపథంలో మెదలుతున్నాయి. 2007 ఆగస్టు 25వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు హైదరాబాద్ నగరం ప్రశాంతంగానే ఉంది. లుంబిని పార్కులో రాష్ట్రం నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు లేజర్‌షోను అత్యంత ఆసక్తిగా వీక్షిస్తున్నారు. సరిగ్గా రాత్రి 7.45 గంటలకు కూర్చున్న వారి సీట్ల కింద బాంబులు ఒక్కసారిగా పేలాయి. ఏం జరిగిందని తెలుసుకునేలోగానే ఆ ప్రాంతంలో హాహాకారాలు మిన్నుముట్టాయి.కూర్చున్న వారు కూర్చున్నట్టే మృత్యుఒడిలోకి వెళ్లిపోయారు. అనేక మంది క్షతగాత్రులయ్యారు. సాక్షాత్తు రాష్ట్ర సచివాలయం ఎదురుగానే ఉన్న లుంబిని పార్కులో ఈ దారుణం చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా రాష్ట్ర పోలీసు యంత్రాంగం విస్మయానికి గురైంది. ఇది ఒక్క చోటు చేసుకున్న ఐదు నిమిషాలకే రాత్రి 7.50 గంటలకు కోఠీలో అత్యంత రద్దీ ప్రదేశంలోని గోకుల్‌చాట్ బండార్‌లో మరో శక్తివంతమైన పేలుడు చోటు చేసుకుంది. ఇందులో లోపల టిఫిన్‌లు చేస్తున్న వారు మొదలుకుని వెలుపల రోడ్డు వెంట వెళ్తున్న వారికి బాంబు శకలాలు తగిలి మృతి చెందారు, అనేక మందికి కాళ్లు చేతులు విరిగిపోయి క్షతగాత్రులయ్యారు. ఈ రెండు ఘటనలు ఒకదానికి వెనుక ఒకటి జరగడంతో మరో చోటు కూడా పేలుడు జరగే ప్రమాదం ఉందని రోడ్లపై జనం భయాందోళనలతో పరుగులు పెట్టారు. ఈ రెండు ఘటనల్లో మొత్తం 44 మంది అమాయకులు, పిల్లలు మరణించగా, అరవై మందికిపైగా తీవ్ర గాయాలతో క్షతగాత్రులయ్యారు. ఈ రెండు ఘటనలకు సరిగ్గా ఏడు రోజుల క్రితం మే 18న మక్కా మసీదులో భారీ పేలుళ్లు చోటు చేసుకోవడంతో వీటి వెనుక బంగ్లాదేశ్ ఉగ్రవాద సంస్థ ఋహర్కతుల్ జీహాదీ ఇస్లామి(హుజి) సంస్థ హస్తం ఉందని పోలీసు అధికారులు అనుమానించారు. ఆ కోణంలోనే వారి దర్యాప్తు సాగి పాతబస్తీకి చెందిన దాదాపు అరవై మంది యువకులను ఇందులో హస్తముందని అనుమానిస్తూ అరెస్టులు జరిపారు. తర్వాత 2008లో ముంబాయి పోలీసులకు హనీక్‌షేక్ సయీద్, మహ్మద్ అక్బర్ ఇస్మాయిల్ చౌదరి, ఇక్బాల్ భత్కల్, ఫరూక్ షర్ఫుద్దీన్ సర్కార్, మహ్మద్ సాదిక్ ఇశ్రాద్, అహ్మద్, ఆమీర్ రజాఖాన్‌లను అరెస్టు చేయడంతో లుంబిన్, గోకుల్‌చాట్ పేలుళ్ల వెనుక హర్కతుల్ జీహాదీ ఇస్లామి సంస్థ ఉగ్రవాదుల హస్తం లేదని కొత్తగా పుట్టుకొచ్చిన దేశవాళీ ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిద్దీన్ హస్తం ఉందని తేలింది. పాకిస్తాన్ ప్రేరణతో సాగుతున్న ఐఎం సంస్థకు రియాజ్ భత్కల్,యాసిన్ భత్కల్, ఇక్బాల్ భత్కల్‌లు నాయకత్వం వహిస్తున్నట్టు ముంబాయి పోలీసులు తేల్చారు. దీంతో ఈ ఏడుగురు ఉగ్రవాదులను 2009లో రాష్ట్రానికి తీసుకు వచ్చిన రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్, అక్టోపస్ విభాగాల అధికారులు వారిని విచారించారు. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన యాసిన్ భత్కల్‌ను నేపాల్ ప్రాంతం నుంచి పట్టుకువచ్చారు. అయితే అసలు కింగ్‌పిన్ రియాజ్ భత్కల్ ఇంకా దొరకలేదు. కర్నాటక రాష్ట్రం భత్కల్ ప్రాంతానికి చెందిన ఈ ముగ్గురు సోదరులలో యాసిన్, ఇక్బాల్‌లు పట్టు బడ్డారు. అసలు నిందితుడు రియాజ్ తర్వాత అల్‌ఖైదాతో సంబంధాలు పెట్టుకున్నాడని , తాజాగా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) వైపు ఆకర్షితుడయ్యాడని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు సమాచారం ఉన్నట్టు తెలిసింది. గోకుల్, లుంబిని పేలుళ్ల ఘటనతో పాటు దిల్‌సు ఖ్‌నగర్ వద్ద అదే సమయంలో పేలు ళ్లకు కుట్ర పన్నిన నేరాభి యోగంపై రియాజ్‌భత్కల్ ప్రధాన నిందితుడుగా పేర్కొంటూ ఈ కేసు దర్యాప్తు సాగిస్తున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం నాంపల్లి రెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో చార్జిషీటు వేసింది. దాని ఆధారంగా ప్రస్తుతం ఈ కోర్టులో వారానికి రెండు రోజులు విచారణ సాగుతున్నది. కాగా పేలుళ్లకు ఈ ఉగ్రవాదులు హైలి ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజీవ్ డివైస్ ఆమ్మోనియం నైట్రేట్ నియోజెల్ 90 పేలుడు పదార్థాలతో శక్తివంతమైన టిఫిన్ బాంబులను తయారు చేసి వాటికి టైమర్లను అమర్చి పేలుళ్లు జరిపినట్టు దర్యాప్తు అధికారులు తేల్చారు. ప్రస్తుతం సాగుతున్న విచారణ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమ బెంగాల్ మొదలైన ప్రాంతాలకు చెందిన బాధితులు సాక్షులుగా హాజరవుతున్నారు. అయితే తమవారు ఈ ఘటనలో మరణించి పదేండ్లు గడిచినా ఇంకా ట్రయల్ పూర్తి కాక పోవడం, ఇందుకు బాధ్యుడైన ప్రధాన నిందితుడు రియాజ్‌భత్కల్ దొరక్కపోవడం బాధితులను తీవ్రంగా వేధిస్తోంది. ఈ కిరాతకులకు ఉరిశిక్ష పడినప్పుడే తమకు తృప్తి కలుగుతుందని అనేక మంది బాధితులు అంటున్నారు. ఇదిలా ఉంటే 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట పేలుళ్ల కేసులో కూడా భత్కల్ సోదరుల పాత్ర తేలింది. ఈ కేసు దర్యాప్తును చురుకుగా సాగించిన ఎన్ఐఏ అధికారులు రియాజ్ భత్కల్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఈ కేసును త్వరితగతిన విచారణ జరుపడానికి వేసిన ప్రత్యేక కోర్టు గత జూలైలో ఐదుగురు నిందితులకు ఉరిశిక్షను విధిస్తూ తీర్పు చెప్పింది. ఉరిశిక్ష పడిన వారిలో రియాజ్‌తో పాటు అతని సోదరుడు యాసిన్ భత్కల్ కూడా ఉన్నాడు. అయితే వీరు ఉరిశిక్షను పై కోర్టులో సవాల్ చేశారు. ఏది ఏమైనప్పటికి లుంబిని, గోకుల్‌చాట్ పేలుళ్లను రాష్ట్ర ప్రజలే గాక బాధితులు మరచి పోలేకపోతున్నారు. అందుకే ఆ రోజు గోకుల్‌చాట్ వద్ద బాధితులు క్యాండిల్స్ వెలిగించి మృతులకు శ్రద్ధాంజలిని ఘటిస్తున్నారు. కాగా ప్రధాన నిందితుడు రియాజ్‌ను తాము వదిలి పెట్టే సమస్యే లేదని, ఇప్పటికే అతని కుడిభుజంలా మెదిలే ఐఎస్ ఉగ్రవాది షఫీ ఆర్మర్ సిరియాలో జరిగిన బాంబు పేలుళ్లలో మరణించాడని ఎన్ఐఏకు చెందిన ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. లుంబిని, గోకుల్‌చాట్ ఘటనలో సైతం నిందితులకు కఠిన శిక్ష పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



గుడ్డిగా అమెరికా వెంట వెళ్లం

జర్మనీ ఛాన్స్‌లర్ మెర్కెల్

- ఉ.కొరియాతో ఉన్న సమస్యను ఆయుధ బలంతో పరిష్కరించలేం

బెర్లిన్ : ఉత్తర కొరియాతో నెలకొన్న సమస్యను ఆయుధ బలంతో పరిష్కరించలేమని జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా–ఉ.కొరియా యుద్ధం దిశగా వెళితే, అమెరికాను జర్మనీ గుడ్డిగా అనుసరించదని తేల్చిచెప్పారు. 'హ్యాండెల్స్‌బ్లాట్' అనే వార్తా పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఉ.కొరియా వివాదంపై మాట్లాడుతూ...సైనిక వ్యూహంతో ఈ సమస్యను పరిష్కరించలేమని చెప్పారు. అయితే వివాదాన్ని చాలా దూరం తీసుకెళ్లారని, వాషింగ్టన్–ప్యాంగ్యాంగ్ నాయకత్వం మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడిందని ఆమె చెప్పారు.

ఈ వివాదంలో అమెరికాను గుడ్డిగా జర్మనీ అనుసరించదని, తాము తప్పనిసరిగా మద్దతు తెలుపాల్సిన అవసరం కూడా లేదని మెర్కెల్ అన్నారు. "సైనిక పరంగా ఈ సమస్యను పరిష్కరించాలనుకోవటం చాలా పెద్ద తప్పు. ముందు ఉద్రిక్తతలను తగ్గించే మార్గాల్ని వెదికి, వాటిని అమలుజేయాలి. ఇంతవరకైతే...దౌత్యమార్గాల్లో పెద్దగా ప్రయత్నాలు జరిగినట్టు లేదు. మిలటరీయేతర మార్గాల్లో అమెరికా వెళ్లదలిస్తే...అందుకు జర్మనీ తప్పకుండా ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తుంది" అని చెప్పారు.



ట్రంప్, జర్మనీ ఛాన్స్‌లర్ మెర్కెల్ (ఫైల్)

వాషింగ్టన్–ప్యాంగ్యాంగ్ మధ్య వెలువడుతున్న మాటలు సమస్యను మరింత ఉద్రిక్తంగా మారుస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఉ.కొరియాను మరింత రెచ్చగొట్టాయి. తమపై అమెరికా దురాక్రమణను అడ్డుకోవటం కోసం గువాంలోనివారి సైనిక స్థావరంపై దాడిచేస్తామని ఉ.కొరియా ప్రకటించింది.

ఈ నేపథ్యంలో ఇరుదేశాలమధ్య నెలకొన్న ఈ ఉద్రిక్త వాతావరణం ప్రపంచ దేశాల్ని తీవ్రంగా కలవరపర్చింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలు ఈ వివాదంపై దృష్టిసారించాయి. రష్యా, చైనాల ద్వారా ఉ.కొరియాపై ఒత్తిడి తీసుకురావాలని అమెరికాకు ఈయూ సూచించింది. ద.కొరియా–అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు ఆపివేయాలని, అదేసమయంలో ఉ.కొరియా తన క్షిపణి పరీక్షలు ఆపేస్తుందని ఈయూ అభిప్రాయపడింది.

ఆర్థికంగా దెబ్బతీయటాన్ని అంగీకరించం : రష్యా

ఒకవేళ ఉ.కొరియాపై అమెరికా యుద్ధం ప్రకటిస్తే, అనూహ్యమైన పరిణామాలు చోటుచేసుకుంటాయని ఐక్యరాజ్యసమితిలో రష్యా ఉప ప్రతినిధి వ్లాదిమిర్ సాఫ్రాంకోవ్ హెచ్చరించారు. అంతేగాక ఆర్థికంగా ఉ.కొరియాను దెబ్బతీయాలన్న వ్యూహాన్ని కూడా రష్యా సమర్థించబోదని ఆయన చెప్పారు. దీనివల్ల ఆ దేశంలోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

జాతివివక్ష చూపాడు...ఉద్యోగం ఊడింది

న్యూయార్క్: అమెరికాలో ఇటీవల జాతి విద్వేష ఘటనలు ఎక్కువవుతున్న విషయం తెలిసిందే. తాజాగా న్యూయార్క్‌లో అలాంటిదే ఓ ఘటన చోటుచేసుకుంది. ఆసియాకు చెందిన వ్యక్తి స్థానిక రెస్టారెంట్‌కు వెళ్లి ఆహారం ఆర్డర్ చేయగా.. అక్కడి వెయిటర్ వ్యక్తి పేరుకు బదులుగా చింగ్‌చాంగ్ అని రాశాడు. దీంతో సదరు రెస్టారెంట్ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది.

యెమెన్ అంతర్యుద్ధంలో నలిగిపోతున్న బాల్యం

- మురుగునీటి వ్యవస్థ దెబ్బతిని ప్రబలిన కలరా

సనా : అంతర్యుద్ధం కారణంగా యెమెన్‌లో ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎవరినెత్తిమీద ఎప్పుడు బాంబు పడుతుందో, తాము తలదాచుకున్న భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని ఆందోళనకరమైన పరిస్థితిలో ప్రజలున్నారు. వీటికి తోడు అక్కడ కలుషిత ఆహారం, నీరు కారణంగా కలరా ప్రబలింది. దీనికారణంగా ఇప్పటికే వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో సగానికిపైగా చిన్నారులే ఉన్నారని, ఇక్కడ బాలల పరిస్థితి ఏమాత్రం బాగాలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

హమీద్‌లాంటి బాలలెంతోమంది..

అంతర్యుద్ధం వల్ల హమీద్ అనే 12 ఏండ్ల బాలుడు తన



హమీద్

చేతిని కోల్పోయాడు. 2014లో యుద్ధం వల్ల హై ఓల్టేజ్ విద్యుత్ తీగలు తెగి హమీద్ ఇంటిపై పడ్డాయి. దీనివల్ల ఇంట్లో ఉన్న హమీద్ తీవ్ర విద్యుద్ఘాతానికి గురై ఎడమచేతిని కోల్పోయాడు. అతడి ప్రాణాలు కాపాడటానికి వైద్యులు 23 శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది. రకరకాల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం తరుచూ హాస్పిటల్‌కు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతటి కష్టాల్లో ఉన్న హమీద్‌కు ఇటీవల కలరా సోకింది. దీనివల్ల హమీద్ ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నదని తండ్రి ఫరాజ్ అల్ అసాదీ మీడియాకు తెలియజేశారు.

"శరీరంపై ఎన్ని గాయాలున్నాయో చూడండి. ఇప్పుడు కలరా సోకింది. ఈ కష్టాలన్నీ యుద్ధం కారణంగా వచ్చాయి. నెలరోజులకు పైగా ఐసీయూలో ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది" అని ఫరాజ్ అల్ అసాదీ ఆవేదన చెందారు. ఇలాంటి హమీద్‌లు, వారిని పట్టుకొని హాస్పిటల్‌కు తిరుగుతున్న తల్లిదండ్రులు యెమెన్‌లో ఎంతోమంది ఉన్నారు. ప్రపంచంలోనే ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా యెమెన్‌లో కలరా విజృంభిస్తున్నదని డబ్ల్యూహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. అడవిలో అగ్ని దావానలం ఎలా విస్తరిస్తుందో...అలా యెమెన్‌లో కలరా వ్యాపిస్తోందని, దీనికి కారణం పారిశుధ్యం లోపించటం, కలుషిత ఆహారమేనని, అంతర్యుద్ధం వల్ల చాలా నగరాలకు శుద్ధిచేసిన నీటి సరఫరా ఆగిపోయిందని, ఇక్కడే కలరా సమస్య మొదలైందని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది.

» బ్రిటన్, అమెరికాలు యెమెన్‌లో కలరా విపత్తు వ్యాప్తిని కలిగించే పరిస్థితులను సృష్టించడంలో కీలక పాత్ర పోషించాయని లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీ పరిశోధకులు విశ్లేషించారు. సౌదీ అరేబియా వైమానిక దాడుల వల్ల యెమెన్‌లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్మాణాలు కూలిపోయాయని వారు అభిప్రాయపడ్డారు.



» యెమెన్‌లోని మొత్తం 23 ప్రావిన్సుల్లో 22 వాటిలో కలరా వ్యాధి అధికంగా ఉంది. అంతర్యుద్ధం కారణంగా మురుగు నీటి పారుదల వ్యవస్థ దెబ్బతిన్నది. దీని కారణంగా కలరా మహమ్మారి తీవ్రరూపం దాల్చిందని, రోజుకు 5 వేల కేసులు నమోదవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరించింది.

ట్రంప్ వ్యాఖ్యలు సరికాదు : పాక్

వాషింగ్టన్: ఉగ్రవాదులకు స్వర్గధామంగా పాక్ తయారైందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను పాకిస్థాన్ తోసిపుచ్చింది. ఆయన వ్యాఖ్యలు తమను తీవ్రంగా నిరుత్సాహపరిచాయని పాక్ విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది. తీవ్రవాదం కారణంగా ప్రపంచంలో మరే దేశం కూడా పాకిస్థాన్ కంటే ఎక్కువగా నష్టపోవడం లేదని చెప్పింది. ఉగ్రవాద నిర్మూలనకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొంది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించింది.

సామర్థ్యం పెంపునకు కసరత్తు

వెనుకబడిన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

- సర్కారు బడుల్లో 60రోజుల త్రిఆర్ కార్యక్రమం
- సత్ఫలితాలపై విద్యాశాఖ ఆశలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సర్కారు బడుల్లోని విద్యార్థుల సామర్థ్యం పెంపుపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. దీనిలో భాగంగా 60రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలో ఉపాధ్యాయుల ద్వారా ప్రావీణ్యం ఇప్పిస్తున్నది. నవంబర్‌లో జరిగే జాతీయ అంచనా సర్వే(నాస్)కు విద్యార్థులందరిని సమాయత్తం చేస్తున్నది.

రాష్ట్రంలోని 40,821 పాఠశాలలున్నాయి. వీటిలో చదువుతున్న 60లక్షల మంది విద్యార్థుల్లో 30శాతానికిపైగా విద్యార్థుల్లో సరిగా చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారని, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యేకంగా సర్కారు బడుల్లోని విద్యార్థులు మరింత వెనుకబడి ఉన్నారని ఆ సర్వేలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 25,994 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటిలో 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో పలు విషయాలు బహిర్గతమయ్యాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 52శాతం మంది విద్యార్థులకు తెలుగు చదవడం రాదని, రాయగలిగేవారు కేవలం 42శాతం మందే ఉన్నారని తేలింది. గణితంలో కూడికలు చేసేవారు 62శాతం, తీసివేతలు 53శాతం, గుణకారాలు 38శాతం, భాగాహారాలు 38శాతం మంది విద్యార్థులే చేయగలుగుతున్నారని గుర్తించారు. ప్రథమ్ 'అసర్' నిర్వహించిన సర్వేలోనూ ఇవే విషయాలు బయటపడ్డాయి. 5.8 తరగతుల



విద్యార్థులు రెండో తరగతి పుస్తకం కూడా చదవలేకపోతున్నారని తేలింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదోతరగతి విద్యార్థులు 40శాతం మంది, 8వ తరగతి విద్యార్థులు 71.7శాతం మాత్రమే చదువుతున్నట్టు తేలింది. మూడోతరగతి చదివే విద్యార్థుల్లో 30.7శాతం మంది మాత్రమే సరిగా తీసివేతలు చేయగలుగుతున్నారని గుర్తించారు. నవంబర్‌లో జాతీయ అంచనా సర్వే(నాస్) జరగనున్నది. అప్పటి వరకు విద్యార్థుల్లో సామర్థ్యం పెంచే ఆలోచనలో విద్యాశాఖ ఉన్నది.

త్రిఆర్ 60రోజులు...

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపుకోసం విద్యాశాఖ త్రిఆర్ పేరుతో 60రోజుల(పనిదినాలు) ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నది. 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసింది. తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులను ఎంపిక చేసుకున్నది. చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు సమర్థవంతంగా చేసేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నది. త్రిఆర్ కార్యక్రమం పై ఇప్పటికే ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రత్యేక శిక్షణ కూడా అందించింది.

ఉదయం పూట సబ్జెక్టులను, మధ్యాహ్నం మూడు పిరియేడ్లు త్రిఆర్‌కు కేటాయించారు. విద్యార్థుల సామర్థ్యం మేరకు గ్రూపులుగా తయారుచేసి ఏరోజుకారోజు షెడ్యూల్ ప్రకారం శిక్షణ అందిస్తున్నారు. ఆగస్టులో ప్రారంభమైన ఈకార్యక్రమం నవంబర్ వరకూ కొనసాగే అవకాశమున్నది.

దీని పర్యవేక్షించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయిలోనూ టీములు ఏర్పాటు చేసినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ 'నవతెలంగాణ'కు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రిఆర్ ద్వారా సత్ఫలితాలు వస్తాయని భావిస్తున్నట్టు తెలిపారు. దీన్ని ప్రయివేటు బడుల్లోనూ నిర్వహించుకోవచ్చని చెప్పారు.

విద్యార్థులపై మానసిక ఒత్తిడి..

త్రిఆర్ కార్యక్రమం నిర్వహణ కారణంగా చదువులో వెనుకబడిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినా కొన్ని పాఠశాలల్లో వారు అతిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వనపర్తి జిల్లాలోని ఓ పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఐదురోజుల పాటు మంది చదవడం, రాయడం రాదని అందరి ఎదుట తరగతి విద్యార్థిపై ఓ టీచర్ తిట్టడం, కొట్టడంతో అతను గాంధీఆస్పత్రిలో చికిత్స పొందినా, పరిస్థితి విషమించడంతో సోమవారం ఆ విద్యార్థి చనిపోయాడు. సిద్ధిపేట జిల్లాలోని ఓ బాలికల హైస్కూల్‌లోనూ చదవడం లేదనే కారణంతో ఓ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కులంపేరుతో దూషించి, చితకబాదాడని విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పలు జిల్లాల్లోనూ జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ చర్యలు చేపడితే, త్రిఆర్ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చు.

పోడుభూములకు పట్టాలిచ్చే వరకు పోరాటం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

- సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-సత్తుపల్లి

పోడు సేద్యంపై అటవీ అధికారులు దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని, పచ్చని పైర్లను ధ్వంసం చేస్తున్నారని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోడుదారులు గురువారం ధర్నా చేశారు. అంతకు ముందు సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ... దశాబ్దాలుగా పోడుభూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులకు అటవీ ప్రాంతంలో హక్కులేవని అనటం సరికాదన్నారు. హరితహారం పేరుతో పచ్చని చేలు ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం లంకపల్లి, కొత్తలంకపల్లి, భువన్నపాలెం, పార్థసారథిపురం, గౌరారం తదితర గ్రామాల పరిధిలో అటవీ ప్రాంతంలో ఉన్న సుమారు 7వేల



ఎకరాల్లో గిరిజనులు సుమారు 500ఎకరాల్లో పోడు సేద్యం చేసుకుంటున్నారని, వారందరికీ పట్టాలిచ్చేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రేంజర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల సీపీఐ(ఎం) కార్యదర్శి చలమాల విఠల్‌రావు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి మోరంపూడి పాండురంగారావు, సత్తుపల్లి, వేంసూరు మండలాల సీఐటీయూ కార్యదర్శులు కొలికపోగు సర్వేశ్వరరావు, మల్లూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొలిక్కిరాని తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ చర్చలు

ఉద్యోగుల మార్పిడికి ఓకే

- ఆర్థిక వాటాల పంపకంలో ఏకాభిప్రాయం
- ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల భేటీ
- సెప్టెంబర్ 15న మరో సారి చర్చ



నవతెలంగాణ -బ్యూరో : ఇరు రాష్ట్రాల ఆర్టీసీల మధ్య నెలకొన్న విబేధాలపై చర్చలు కొలిక్కి రాలేదు. రెండు రాష్ట్రాల ఆర్టీసి ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు విజయవాడ ఆర్టీసి హౌస్‌లో గురువారం భేటీ అయ్యారు. అన్ని అంశాలపై సయోధ్య కుదరకపోవడంతో సెప్టెంబర్ 15న మరో సారి సమావేశం కావాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల మార్పిడికి మాత్రం ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరింది. 2015 జూన్ 1నాటికి ఉన్న ఖాళీల ఆధారంగా ఉద్యోగులు రాష్ట్రాలు మారేందుకు అంగీకరించారు. ఆర్థిక వాటాల పంపకం విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. రాష్ట్రాల విభజన తరువాత నుంచి 14 నెలల పాటు జరిగిన లావాదేవీలపై ఆడిట్ చేపట్టి 58:42 నిష్పత్తిలో ఏపి, తెలంగాణా ఆర్టీసిలు పంపకోవాలన్న తీర్మానానికి రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు అంగీకారం తెలిపారు. తొమ్మిది, పది షెడ్యూళ్లలోని 14 ఉమ్మడి ఆస్తుల విషయంలో మాత్రం ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం రాలేదు. బస్‌భవన్‌తో పాటు హైదరాబాద్‌లో ఉన్న తార్నాక ఆసుపత్రి, అతిథి గృహం, కళ్యాణ మండపం తదితర వంటి ఆస్తులపై గతంలో ఉన్నట్లుగా తమకు హక్కు ఇవ్వాలని ఎపిఎస్ ఆర్టీసి ఉన్నతాధికారులు కోరగా కేంద్రం చేసిన సిఫార్సుల ప్రకారం అలా కుదరదని, కేవలం బస్‌భవన్‌పై మాత్రం హక్కు ఇస్తామని తెలంగాణ ఆర్టీసి ఉన్నతాధికారులు తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. హక్కులపై నివేదిక సమర్పించాలని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ఉన్నతాధికారులు చెప్పడంతో ఏదో విధంగా అన్ని విషయాల్నీ తేల్చేయాలని కేంద్ర కమిటీ సభ్యులు సూచించినట్లు సమాచారం. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులైన ఎస్ఆర్టీయు ఇడి పి ఆనందరావు, సిఐఆర్టీయు డెరెక్టర్ రాజేంద్ర బి సమేర్ పాటిల్‌తో పాటు ఆర్టీసి ఎండిలు ఎం మాలకొండయ్య, బివి రమణ్‌రావు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శులు సుమితా దావ్రా, సునీల్ శర్మ, జిహెచ్ఎంసి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, ఇరు రాష్ట్రాల ఆర్టీసి ఇడిలు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు రౌడీ చర్యను సమర్థిస్తారా.?

- మంత్రి హరీశ్‌రావు ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా మాజీ మంత్రి శ్రీధర్‌బాబు రౌడీలా వ్యవహరించారని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాగిరి, రౌడీయిజాన్ని ప్రదర్శించిన శ్రీధర్‌బాబను సమర్థిస్తారా.? అని కాంగ్రెస్‌ను ఆయన ప్రశ్నించారు. రౌడీలా వ్యవహరించిన శ్రీధర్‌బాబను ఎలా సమర్థిస్తున్నారని సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీని ప్రశ్నించారు. ప్రాజెక్టులను అడ్డుకోవడం ద్వారా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారా..? అని అన్నారు.

కోదండరామ్ కూడా ద్రోహే : ఎంపీ బాల్క సుమన్

రాష్ట్ర అభివృద్ధిని కోదండరామ్ సహా ఎవరడ్డుకున్నా.. వారు తెలంగాణ ద్రోహే అని ఎంపీ బాల్క సుమన్ అన్నారు. కోదండరామ్ అనుసరిస్తున్న వైఖరితో ఆయన ఎజెండా ఏమిటో అందరికీ అర్థమైందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుంటే.. యాత్రలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారా.? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలసి టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేత శ్రీధర్‌బాబు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. కలెక్టర్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారని పేర్కొన్నారు.

గ్రామ సమైఖ్యల్లో మనవారిని ఉంచండి

- 26న టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

వచ్చే ఖరీఫ్ నుండి రైతులకు నాలుగు వేల రూపాయల చొప్పున ఏడాదికి ఎనిమిది వేల రూపాయలు ఇస్తామని చెప్పినందున, దానికోసం ఇప్పట్నుంచే పార్టీ తరపున ప్రచారం చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ టిఆర్ఎస్‌పార్టీ నేతలకు విజ్ఞప్తి చేశారు. రైతులు పార్టీకి అనుకూలంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు. అందుకోసం గ్రాక సమైఖ్యల్లో పార్టీ అనుకూలురు ఉండాలని, అందుకు గ్రామగ్రామాన రైతులను సన్నద్ధం చేయాలని సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలకు, నేతలకు సూచించారు. అదేవిధంగా త్వరలో చేపట్టబోయే భూసర్వేలోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యేలు పాలుపంచుకోవాలని కోరారు. ఈ విషయాలను తెలియజేసేందుకు కేసీఆర్ ఈ నెల 26న టిఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశం కాబోతున్నారు. తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. అందరికీ సమావేశాన్ని చేరవేశారు. అదేవిధంగా పథకాల అమలు, ప్రజల్లో పార్టీ ఆదరణ, ఎమ్మెల్యేల పనితీరు గురించి చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే లక్ష్యంతో తెలుగు రాష్ట్రాల్లో వారధి ఆధ్వర్యంలో వ్యాస, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా తెలిపారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఢిల్లీ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు, సంస్థ ఉపాధ్యక్షులు డీఎస్.రావు, ఉషాలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 27న ఆదిలాబాద్, వరంగల్, కర్నూల్, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, శ్రీకాకులంలో, సెప్టెంబర్ 3న నిజామాబాద్, నల్లగొండ, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో గెలుపొందిన విజేతలకు అక్టోబర్ 8న హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో చివరి విడత పోటీలు ఉంటాయన్నారు. 'లౌకిక రాజ్యమైన భారతదేశంలో విభిన్న సంస్కృతి, సాంప్రదాయాలు, కులమతాలు ఉన్నప్పటికీ ఎంతో సహనంతో, సౌభ్రాతృత్వంతో జీవనం సాగిస్తున్న భారతీయుల ఔన్నత్యం', 'సామాజిక మీడియా నైతిక విలువలు, ప్రభావాలు, బాధ్యత' అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. చివరి పోటీల్లో గెలుపొందిన వారికి కందా బీమశంకర్‌రావు, పాపాయమ్మ స్మారక అవార్డులతోపాటు మొదటి. ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి నగదు బహుమతులను అందజేస్తామని అన్నారు. పోటీల కోసం నగరానికి వచ్చే విద్యార్థులకు పూర్తి ఖర్చులను సంస్థ భరిస్తుందని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల వారు 76809 99293 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

మాజీ సైనికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి సేవలందించిన మాజీ సైనికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయమై త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించాలని నిర్ణయించినట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అమ్మిక రంగయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 1952లోనే అప్పటి ప్రభుత్వం సుమారు 5977 ఎకరాల స్థలాన్ని ఇండ్ల కోసం కేటాయించిందని, ఆ తరువాత కాలక్రమేణ ఆ స్థలంలో కొంతభాగం సీఆర్‌పీఎఫ్‌తోపాటు మరి కొన్ని ప్రయివేటు, ప్రభుత్వ సంస్థల ఏర్పాటు కోసం ప్రభుత్వమే అప్పనంగా ధారాదత్తం చేసిందని గుర్తుచేశారు. మిగిలిన స్థలంలో రాజకీయ నాయకులు, అధికారులు ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొంతమంది మాజీ సైనికుల సేవలకుగాను ఇచ్చిన ఐదెకరాల భూమిని కూడా కబ్జాచేశారన్నారు. ఈ నేపథ్యంతో తాము సీఎంను కలవనున్నట్టు తెలిపారు.

పలు జిల్లాల్లో భారీ వర్షం

భద్రాద్రి జిల్లాలో పిడుగుపడి ఒకరు మృతి

నవతెలంగాణ-యంత్రాంగం

రాష్ట్రంలో పలు జిల్లాలో గురువారం భారీ వర్షం పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పిడుగు పడి ఒకరు చనిపోయారు. మరొకరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. పాల్వంచలో 63.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. అశ్వారావుపేట మండల తిరుమలకుంట గ్రామానికి చెందిన మాడి నాగేశ్వరావు(45), మొడియం ముత్యాలు పశువులను మేపేందుకు సమీపంలోని అడవికి వెళ్లారు. వారిపై పిడుగు పడింది. నాగేశ్వరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ముత్యాలు అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ఆరు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 8300 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. పెద్దపల్లిలో జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలయమం అయ్యాయి. వినాయక చవితి పురస్కరించుకుని వివిధ సామగ్రిని తీసుకెళ్లేందకు వచ్చిన జనం, వినాయక విగ్రహాల వ్యాపారులు ఆయోమయానికి గురయ్యారు. వర్షంతో పలు మండలాల్లోని చెరువులు కొంతమేరకు నిండాయి జగిత్యాల జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, సోమారం, వెన్కెపల్లి తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మండలంలో ఈ ఏడాది ఇంత పెద్ద వర్షం పడటం ఇదే మొదటిసారనీ గ్రామస్తులు తెలిపారు. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లోని రోడన్నీ జలమయంగా మారాయి. పలు కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురిసింది.

నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మిర్యాలగూడలో సాగర్ రోడ్డు వెంట మోకాల్లోతు నీరు ప్రవహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దవూర, అనుముల, నిడమనూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో పత్తిపంట నీట మునిగింది. హైదరాబాద్‌లో కూకట్‌పల్లి, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వర్షంతో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

భర్తీ చేయాలి..

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని అధికరణం 371-డీ ప్రకారం తెలంగాణలో 85 శాతం సీట్లను స్థానిక అభ్యర్థులతో, మిగిలిన 15 శాతం సీట్లను ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులతో అదేవిధంగా ఏపీలో 85 శాతం స్థానిక, 15 శాతం తెలంగాణ అభ్యర్థులతో సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది.

కేంద్ర నిర్ణయం భేష్: కె లక్ష్మణ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర జాబితాలోని ఓబీసీల వర్గీకరణ చేపట్టేందుకు ప్రత్యేక కమిషన్‌ను నియమించడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ స్వాగతించారు. జాతీయ స్థాయిలో ఓబీసీ కేటగిరిలో క్రిమిలేయర్ గరిష్ట వార్షిక ఆదాయం రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ కేంద్ర మంత్రి మండలి నిర్ణయించడం వల్ల బీసీలకు లాభం చేకూరడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల్ కమిషన్ నిర్ణయంతో 27 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించారని, ఉపవర్గీకరణ లేకపోవడం, తక్కువ వార్షిక ఆదాయం వల్ల చాలామంది ప్రయోజనం పొందలేకపోయారని తెలిపారు.

ప్రైవసీకి రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాథమిక హక్కు కాదంటూ గతంలో ఇచ్చిన తీర్పులు చెల్లుబాటు కావని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా పౌరుల ప్రైవసీకి రక్షణ ఉంటుందని, ఆధునిక సాంకేతికతపై ఆధిపత్యమున్న కార్పొరేట్ సంస్థలు వ్యక్తుల డేటాను దుర్వినియోగం చేయకుండా నియంత్రణ ఏర్పడుతుందని పొలిట్‌బ్యూరో తెలిపింది. ఆధార్‌ను పలు పథకాలకు లింక్ చేయడం తప్పనిసరంటున్న ప్రభుత్వ నిర్ణయాలపై సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ప్రత్యేకంగా తీర్పు ఇవ్వాల్సి ఉన్నదని పొలిట్‌బ్యూరో తెలిపింది.

మోడీ ప్రభుత్వానికిది గట్టి ఎదురు దెబ్బ కాంగ్రెస్ నేత చిదంబరం

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదంటూ వాదిస్తూ వచ్చిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి సుప్రీం తీర్పు గట్టి ఎదురు దెబ్బ అని కాంగ్రెస్ తెలిపింది. ప్రైవసీని ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు తేల్చి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరం అన్నారు. రాజ్యాంగస్ఫూర్తిని ఇనుమడింపజేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పుల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని చిదంబరం అన్నారు. మనకిది మరో స్వతంత్ర వేడుక అని, మున్ముందు మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. స్వేచ్ఛగా జీవించే హక్కులో భాగంగా నాగరిక సమాజాలు ప్రైవసీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనే ఆధార్‌ను తెచ్చినప్పటికీ పౌరుల ప్రైవసీని తాము సవాల్ చేయలేదని చిదంబరం స్పష్టం చేశారు.

నూతన ఒరవడికి శ్రీకారం

- యువ కళాకారులకు అవకాశం
- చిత్రస్రాస్ ఎంకోర్ మ్యూజిక్ షో లక్ష్యం
- క్యాప్రిషో మ్యూజిక్ బ్యాండ్ మొదటి ఎపిసోడ్ ప్రారంభం
- సెప్టెంబరు 7న యూట్యూబ్‌లో విడుదలకు సిద్ధం

నవతెలంగాణ-సిటీబ్యూరో

చిత్రస్రాస్ ఎంకోర్ మ్యూజిక్ సంస్థ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. యువ కళాకారులను ప్రోత్సహించేందుకు చిత్రస్రాస్ ఎంకోర్ మ్యూజిక్ షో లక్ష్యంగా ముందడుగు వేస్తున్నది. ఈ సంస్థ వేదికగా యువకళాకారులకు అవకాశం కల్పిస్తున్నది. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో గల బోట్టెగా కేఫ్‌లో హిమాన్షు సైనీ స్టూడియోస్ సౌజన్యంతో గురువారం క్రాప్రిషో మ్యూజిక్ బ్యాండ్ తెలుగు పాటల మొదటి ఎపిసోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు పాటలు ఆలపించారు. ఈ ఎపిసోడ్ తెలంగాణలోనే మొట్టమొదటి మ్యూజిక్ షోగా సెప్టెంబరు 7న యూట్యూబ్ చానల్‌లో విడుదల కానుంది. హైద్రాబాద్‌లో నైపుణ్యమున్న యువ కళాకారులకు యూట్యూబ్ చానల్ ద్వారా కొత్త ప్లాట్ ఫాంను తీర్చిదిద్దారు. ఈ చిత్రస్రాస్ ఎంకోర్ మ్యూజిక్ షో ద్వారా 100 ఎపిసోడ్‌లను చేయడానికి రూపకల్పన చేశారు. ప్రతి వారం ఒకటి చొప్పున మ్యూజిక్ షో ఎపిసోడ్‌ను విడుదల చేయనున్నారు. ప్రతి మ్యూజిక్ షోలో 50మందికి పైగా ఔత్సాహిక కళాభిమానులు పాలుపంచుకునే అవకాశం కల్పిస్తుంది. భవిష్యత్తులో హిందీ పాటల మ్యూజిక్‌ను నిర్మాణం చేయడానికి సిద్ధం చేస్తున్నారు. రెండో ఎపిసోడ్‌లో పాలుపంచుకునే కళాకారులు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.చిత్రాస్రా.కాం కు లాగిన్ కావచ్చు. లోహిత్ వేదవ్యాస్, మొబైల్ నెంబర్ 8106451010కు సంప్రదించవచ్చు. ఈ మ్యూజిక్ షోకు డి.డి.కాలనీలోని శరత్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రోత్సహం కల్పిస్తున్నది. ఈ కార్యక్రమంలో చిత్రస్రాస్ ఎంకోర్ వ్యవస్థాపకులు పృధ్వీ గగారిన్, సహ వ్యవస్థాపకులు లోహిత్ వేదవ్యాస్, బాగరాజు లోహిత్, దేవరకొండ నయనేష్‌లు పాల్గొన్నారు.

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిపై విచారణ చేపట్టిన 9మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెల్లడించింది. రాజ్యాంగంలోని అధికరణం 21 హామీ ఇచ్చే జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ హక్కులో గోప్యత హక్కు సహజంగానే ఉంటుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అంతేగాక రాజ్యాంగంలోని మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులన్నిటిలోనూ గోప్యత హక్కు అంతర్గతంగా ఉంటుందని ధర్మాసనం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆధార్ అనుసంధానంపై పరిమితులుండే అవకాశముంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి సుప్రీం తీర్పుతో ఆధార్‌లింక్‌పై దూకుడు ప్రదర్శిస్తున్న కేంద్రానికి కళ్లెం వేసినట్టేనని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. పౌరుల ఇష్టానికి వ్యతిరేకంగా పలు స్కీంలకు ఆధార్‌ను లింక్ చేయడం ఇక తప్పనిసరి అని ప్రభుత్వంగానీ, ఇతర సంస్థలుగానీ నిర్బంధించలేవని వారు చెబుతున్నారు. అయితే, ఈ అంశంపై మరో ధర్మాసనం తేల్చాల్సి ఉన్నది. కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు తాము అమలు చేసే సంక్షేమ పథకాలకు ఆధార్‌కార్డును అనుసంధానం తప్పనిసరి చేయడంపై 2015లో పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆధార్‌ను లింక్ చేయడం వల్ల తమ వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని ఫిర్యాదిదారులు సుప్రీం దృష్టికి తెచ్చారు. ఆధార్‌పై 2015, ఆగస్టు 11న విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం అసలు వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అవునా..? కాదా..? తేల్చేందుకు విస్తృత ధర్మాసనం అవసరమని సూచించింది. దాంతో, ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని 9 మంది జడ్జిలు ఈ ఏడాది జులై 19న విచారణ ప్రారంభించి, ఆగస్టు 2న ముగించారు. ఆ రోజున తీర్పును రిజర్వ్ చేసి గురువారం వెల్లడించారు. విచారణ సందర్భంగా గుజరాత్,హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం తరపున పలువురు సీనియర్ న్యాయవాదులు వాదన వినిపించారు. అయితే, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అవునా..? కాదా..? అనేది తేల్చేందుకే పరిమితమైంది. ఈ తీర్పులో తేల్చిన అంశాలతో ఆధార్‌పై ఐదుగురు సభ్యుల ధర్మాసనం ప్రత్యేకంగా మరోసారి విచారణ చేపట్టనున్నది.

ప్రైవసీపై గత తీర్పులు చెల్లుబాటు కావు

9మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా తేల్చడంతో ఇదే అంశంపై గతంలో ఇచ్చిన తీర్పులకు కాలం చెల్లినట్టే. 1954లో ఎంపి శర్మ కేసులో 8మంది సభ్యుల సుప్రీం ధర్మాసనం, 1962లో ఖారక్‌సింగ్ కేసులో ఆరుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం గోప్యత హక్కును ప్రాథమిక హక్కుల్లో భాగం కాదని చెప్పాయి. తాజా తీర్పుతో అవి ఇక చెల్లుబాటు కావనేది స్పష్టం.

రాజ్యాంగ ధర్మాసనంలోని న్యాయమూర్తులు:ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ జాస్తి చలమేశ్వర్,జస్టిస్ ఎస్ఏ బాబ్డే,జస్టిస్ ఆర్‌కె అగర్వాల్,జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్,జస్టిస్ ఎఎం సాప్రే, జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ ఎస్‌కె కౌల్, జస్టిస్ ఎస్ అబ్దుల్‌నజీర్

గోప్యతకు పరిమితులుంటాయి

గోప్యత హక్కుసహా పౌరుల ప్రాథమిక హక్కులన్నీ హేతుబద్ధమైన పరిమితులకు లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషన్ అన్నారు. ఆధార్‌ను ఆ పరిమితుల్లోనే చూడాలా అన్నదానిపై నిర్ణయించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఆధార్‌పై విచారణ సందర్భంగా ఈ ఏడాది మే నెలలో అప్పటి అటార్నీ జనరల్ ముకుల్‌రోహ్తగీ తన వాదన వినిపిస్తూ..పౌరులకు తమ శరీరంపై సంపూర్ణ హక్కు అనేది భ్రమ మాత్రమే అన్నారు.

తీర్పును స్వాగతిస్తున్నాం, పరిమితులుంటాయిూ కేంద్ర న్యాయశాఖమంత్రి

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని కేంద్ర న్యాయశాఖమంత్రి రవిశంకర్‌ప్రసాద్ తెలిపారు. అయితే,గోప్యత హక్కు సంపూర్ణమైనది కాదని, దానికి పరిమితులుంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆధార్‌కార్డు అనేది పౌరుల అధికారిక గుర్తింపునకు సంబంధించినది. గుర్తింపు కోసం తీసుకునే వివరాలను ప్రైవసీ హక్కు ఉల్లంఘనగా చూడలేమని న్యాయశాఖ సహాయమంత్రి పిపి చౌదరి వ్యాఖ్యానించారు.

సర్కారుకు జీవన్మరణ సమస్య


(మొదటిపేజీ తరువాయి)

చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం రాష్ట్ర ప్రభుత్వానికి జీవన్మరణ సమస్య అని తెలిపారు. రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశం కూడా అని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వర్క్ ఏజెన్సీలు రేయింబవళ్లు పని చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని చెప్పారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి నీరు అందించాలన్నారు. పనుల్లో ఎక్కడ జాప్యం జరిగినా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి మిషన్ భగీరథ పనులు పరిశీలిస్తానని తెలియజేశారు.. ప్రజాప్రతినిధులు కూడా మిషన్ భగీరథ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, జగదీశ్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో రూ.43 వేల కోట్ల వ్యయంతో దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాన్ని చేపట్టామని చెప్పారు. డిసెంబర్ నాటికి అన్ని ఆవాసాలకు మంచినీరు చేరేలా ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్ ప్లాంట్లు తదితర నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నుంచే పనులు మొదలుపెట్టి డిసెంబర్ నాటికి వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఉద్దేశించి పలు ప్రశ్నలు అడిగారు. దీనికి వారు స్పందిస్తూ 19 ఇంటెక్ వెల్స్‌లో 16 పూర్తయ్యాయని, మిగతావి త్వరలోనే పూర్తవుతాయని అధికారులు చెప్పారు. 50 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో 15 పూర్తి కాగా, మరో 27 పూర్తికానున్నాయని, మిగతా 8 పురోగతిలో ఉన్నాయన్నారు. 49,238 కి.మీ పైపులైనుకు గాను 43,427 (88 శాతం) పైపులైన్లు సిద్ధంగా వున్నాయని చెప్పారు. 421 సంపుల్లో 247 పూర్తయ్యాయని, 143 జి.ఎల్.బి.ఆర్.లలో 73 పూర్తయ్యాయని, 562 ఒ.హెచ్.బి.ఆర్‌లలో 192 పూర్తయ్యాయని, 248 పంపుహౌజ్‌లలో 51 పూర్తయ్యాయని, మిగతావాటి పనులు కొద్ది రోజుల్లోనే ముగుస్తాయన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులన్నీ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయని అధికారులు వివరించారు. గ్రామాల్లో అంతర్గత పనులు మినహా మిగతావన్నీ డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేసి అన్ని గ్రామాలకు శద్ధి చేసిన నదీ జలాలను జనవరి1 నాడు నూతన సంవత్సర కానుకగా ప్రజలకు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆ తరువాత ఆరు నెలల్లో గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, నల్లాలు బిగించడం లాంటి పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

వచ్చే నెల నుంచి ఇంటేక్ వెల్స్ నుండి డబ్ల్యూటిపిల ద్వారా మంచినీటిని పంపింగ్ చేయడం ప్రారంభించాలని చెప్పారు. మొదట్లో బాలారిష్టాలు తప్పవని, ఎప్పటికప్పుడు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. "పనులు చేసే వర్కింగ్ ఏజెన్సీలు సమన్వయంతో వ్యవహరించాలి. ఏజెన్సీలు సమాఖ్యగా ఏర్పడి పరస్పరం సహకరించుకోవాలి. ఎక్కడైనా పనిలో జాప్యం జరిగినా, ఏజెన్సీకి వేరే ఇబ్బంది వచ్చినా ఇతర ఏజెన్సీలు జోక్యం చేసుకుని సహకరించుకోవాలి. మిషన్ భగీరథ పథకం కేవలం ప్రభుత్వానికే కాదు, వర్కింగ్ ఏజెన్సీలకు కూడా ప్రతిష్టాత్మకం. ఇంత గొప్ప పని చేయడం మీకు కూడా గౌరవ ప్రదం, మంచి అనుభవం. ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ఏ మాత్రం పెండింగు లేకుండా బిల్లులు చెల్లిస్తున్నది. సకాలంలో పనులు పూర్తి చేసిన వారికి 1.5 శాతం ఇన్సెంటివ్ కూడా అందిస్తున్నది. ఈ అవకాశాన్ని వర్కింగ్ ఏజెన్సీలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ ఏజెన్సీ సకాలంలో పనులు పూర్తి చేసి ఇన్సెంటివ్ అందుకోవాలని నేను కోరుతున్నాను. ఎక్కడ ఏ సమస్య తలెత్తినా స్థానికంగా వుండే మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరించడానికి సిద్ధంగా వున్నారు" అని పేర్కొన్నారు. "ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయ్యేనాటికే వాటికి కావలసిన కరెంట్ కూడా అందుబాటులోకి రావాలి. దానికి అనుగుణంగా సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగాలి. విద్యుత్ కేటాయింపు పూర్తవ్వాలి. నిరంతర విద్యుత్ సరఫరా అందాలి. మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించేందుకు ట్రాన్స్ కో, ఎస్.పీ.డీ.సీ.ఎల్., ఎన్.పీ.డీ.సీ.ఎల్‌కు చెందిన ముగ్గురు అధికారులను ప్రత్యేకంగా నియమించాలి. రాబోయే 30 ఏండ్ల అవసరాలను దష్టిలో పెట్టుకుని మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించాం. దీనికి అనుగుణంగా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మేర మంచినీరు అందించే ఏర్పాటు జరగాలి. ట్యాంకులు, పైపులైన్ల సామర్థ్యాన్ని మరో సారి మదింపు చేయాలి. అవసరమైతే ట్యాంకుల సంఖ్య, వాటి నీటి నిలువ సామర్థ్యం పెంచాలి. ఇందుకోసం ప్రతి జిల్లాలో మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యేలు, అధికారులు సమావేశమై నిర్ణయం తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో వర్కింగ్ ఏజెన్సీలు జీఎస్టీ వల్ల తమపై అధిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరికరాలు, మెటీరియల్ కొనుగోలు సందర్భంగా తాము 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తుందని, దీనివల్ల నిర్మాణ వ్యయం పెరుగుతున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని జీఎస్టీని తగ్గించడానికి కేంద్రంపై వత్తిడి తేవాలని కోరారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి ప్రజోపయోగ పనులకు అధిక జీఎస్టీ విధించవద్దని తాము కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ సమావేశంలోనూ ఈ అంశాన్ని రాష్ట్రం తరపున గట్టిగా ప్రస్తావిస్తామని సీఎం హామి ఇచ్చారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం స్పందించకుంటే వర్కింగ్ ఏజెన్సీలకు నష్టం కలగని విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

యువ ఇంజినీర్ బలి





(ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

ఆ అధికారి చేష్టలు రోజురోజుకీ మితిమీరిపోతుండటంతో భరించలేకపోయాడు. చివరకు 'ఈఈ వేధింపులకు తట్టుకోలేక చనిపోతున్నా...." అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో గురువారం జరిగింది. తన పైఅధికారి ఈఈ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రాసిన సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం..మండలంలోని ఎండపెల్లికి చెందిన దేవిపోచయ్య-శ్రీలత దంపతుల కుమారుడు శ్రీకాంత్(30) 2015లో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో క్వాలిటీ కంట్రోలర్ విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీకాంత్‌కు హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మితో ఈ ఏడాది మార్చి మొదటి వారంలో వివాహం జరిగింది. శ్రీలక్ష్మి మంథనిలోని కళాశాలలో గెస్టు లెక్చరర్‌గా పనిచేస్తోంది. వీరు స్వగ్రామంలోనే నివాసముంటూ ఉద్యోగానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొమురం భీం జిల్లా ఈఈ రఘువీరారెడ్డి తనను వేధింపులకు గురిచేస్తున్నాడని తన భార్యతో తరుచూ ఆవేదన వ్యక్తంచేస్తుండేవాడు. ఆ ఒత్తిడి భరించలేనని, చచ్చిపోవాలని ఉందని సూసైడ్ నోట్ రాసి ఈ నెల 22న భార్యకు మెయిల్ చేసి ఇంటినుంచి వెళ్లిపోయాడు.

23న కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం మండలంలోని గుల్లకోట శివారులో పొలం వద్ద ఉరేసుకుని చనిపోయినట్టు సమాచారం అందగా అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. "కాంట్రాక్టర్ల నుంచి లంచం తీసుకురావాలని ఈఈ ఒత్తిడి చేయగా...దానికి ఒప్పుకోలేదని, దీంతో మాలోడివైన నీవు దొర లాగా ప్రవర్తిస్తున్నావురా" అంటూ ఈఈ దూషించాడని తనతో శ్రీకాంత్ చెప్పాడని అతని భార్య రోదిస్తూ చెప్పింది. సెలవు మంజూరు చేయాలని ఈఈ రఘువీరారెడ్డిని కోరగా మంచిర్యాలలోని తన ఆఫీసుకు పిలిపించుకుని "నువ్వుపిచ్చోడివిరా, నీకు ఉద్యోగం ఎందుకు రా" అని ఈఈ తిట్టినట్టు కూడా ఆమె వాపోయింది. తన భర్త మృతికి కారణమైన ఈఈ రఘువీరారెడ్డిని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఈఈపై కఠిన చర్యలు తీసుకోవాలి...

శ్రీకాంత్‌ను కులంపేరుతో దూషించి ఆత్మహత్యకు కారణమైన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఈఈ రఘువీరారెడ్డిని ఉద్యోగం నుండి డిస్మిస్‌చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జగిత్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ముద్దం ప్రకాశ్ డిమాండ్ చేశారు. కుటుంబసభ్యులతో కలిసి జగిత్యాల రోడ్డుపై ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సూసైడ్ నోట్



నవచిత్రం

అతి శుభ్రతకు ప్రాణమిచ్చే మహానుభావుడు


శర్వానంద్, మెహరీన్

శర్వానంద్, మెహరీన్ జంటగా మారుతి దర్శకత్వంలో యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మహానుభావుడు'. ఈ చిత్ర టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో శర్వానంద్ హీరోగా నటిస్తున్న మూడవ చిత్రమిది. క్యారెక్టరైజేషన్‌తో కామెడీ పండించగల చాలా అరుదైన దర్శకుల్లో మారుతి ప్రథముడు. తాజాగా విడుదలైన టీజర్ చూస్తే ఇందులో కామెడీ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థమవుతుంది. టీజర్‌లో 'నా పేరు ఆనంద్. నాకో ఓసిడి ఉంది. ఓసిడి అంటే బి.టెక్, ఎమ్.టెక్ లాంటి డిగ్రీలు కాదు.. డిజార్డర్. ఈ లక్షణాలు అతి శుభ్రం, విపరీతమైన నీట్‌నెస్..' అంటూ శర్వానంద్ చెప్పే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. త్వరలో ట్రైలర్‌ని విడుదల చేస్తాం. ఒక్క సాంగ్ మినహా షూటింగ్ పూర్తయ్యింది. గురువారం నుంచి డబ్బింగ్ కార్యక్రమాలు జరుపుతున్నాం. విదేశాల్లో, ఇండియాలోని పలు ప్రదేశాల్లో సినిమాను షూట్ చేశాం. శర్వానంద్‌కి మా బ్యానర్‌లో మరో మంచి చిత్రమవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి విజయదశమికి సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. 'భలేభలే మగాడివోయ్' చిత్రం తర్వాత నాకు బాగా నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రమిది. తాజాగా విడుదలైన టీజర్‌ను చూసిన వారంతా 'సినిమా నీ స్టయిల్లో పూర్తి కామెడీగా ఉంద'ని చెబుతున్నారు. శర్వానంద్ కెరీర్‌లో ఇది బెస్ట్ చిత్రమవుతుంది. శర్వానంద్ చాలా బాగా చేశాడు. థమన్ సూపర్ ఆడియో అందించాడు. మ్యూజికల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం ఉంటుంది' అని దర్శకుడు మారుతి చెప్పారు. వెన్నెలకిషోర్, నాజర్, భద్రం, కళ్యాణి నటరాజ్, పిజ్జాబాయ్, భాను, హిమజ, వేణు, సుదర్శన్, సాయి, వెంకీ, శంకర్‌రావు, రమాదేవి, మధుమణి, రాగిని, రజిత, అబ్బులు చౌదరి, సుభాష్, ఆర్.కె. తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.థమన్, సినిమాటోగ్రాఫర్: నిజార్ షఫి, ఆర్ట్: రవిందర్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

బర్త్‌డే గిఫ్ట్

'జల్సా', 'అత్తారింటికి దారేదీ' చిత్రాల తర్వాత పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం విదితమే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవర్‌స్టార్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానులకు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చేందుకు చిత్రయూనిట్ సిద్ధమవుతోంది. ఆ రోజు చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నారు. 'కీప్ కామ్.. పీఎస్‌పీకే (పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్) ఆన్ ది వే' అని ఉన్న ఓ పోస్టర్‌ను చిత్రయూనిట్ గురువారం అభిమానులతో పంచుకుంది. పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఈ 25వ చిత్రంలో కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయెల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'రాజు వచ్చినాడు' అనే టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేయనున్నారు.


పవన్ కళ్యాణ్

పులి నాలాగే ఉంటుందట..


పైసా వసూల్‌లో బాలకృష్ణ

బాలకృష్ణ, శ్రియ, ముస్కాన్, కైరా దత్ హీరోహీరోయిన్లుగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద్ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'పైసా వసూల్'. సెప్టెంబర్ 1న విడుదల కానున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'ఇటీవల విడుదలైన స్టంపర్, పాటలకు మంచి స్పందన లభించింది. ముఖ్యంగా స్టంపర్‌లో 'తమ్ముడూ.. నేను జంగిల్ బుక్ సినిమా చూడ్లా. కాని అందులో పులి నాలాగే ఉంటుందని చాలా మంది చెప్పారు. అది నిజమో కాదో మీరే చెప్పాలి', 'మందేసిన మదపుటేనుగునిరా! క్రష్ ఎవ్రీవన్'.. అంటూ డైలాగులతో, 'మావా.. ఏక్ పెగ్గు లా..' పాటతో బాలకృష్ణ తన అభిమానులను ఖుషీ చేశారు. టీజర్, స్టంపర్‌తో దర్శకుడు పూరీ జగన్నాథ్ ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనేలా చేశారు. ఫుల్ ఎనర్జిటిక్ క్యారెక్టర్‌ని బాలయ్య అద్భుతంగా పోషించారు. డూప్ లేకుండా ఆయన చేసిన యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తాయి. పూరీ ఈ చిత్రం ద్వారా ఓ కొత్త బాలయ్యను చూపించబోతున్నారు. బాలకృష్ణ అభిమానులు కోరుకునే అంశాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. అనూప్ రూబెన్స్ అందించిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా సినిమాకు సంబంధించి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'యు/ఎ' సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 1న చాలా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. బాలీవుడ్, హాలీవుడ్ నటుడు కబీర్ బేడి ప్రత్యేక పాత్ర పోషించిన ఈ చిత్రంలో అలీ, పృథ్వీ, పవిత్రా లోకేష్, విక్రమ్ జిత్ ఇతర పాత్రధారులు.

బంపర్ ఆఫర్..

ఇటీవల 'బరేలీ కి బర్ఫీ' చిత్రంతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని అలరించిన కృతి సనన్ తాజాగా 'ఫర్జీ' చిత్రంలో నటించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. 'వన్ నేనొక్కడినే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై కృతి ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ సరైన అవకాశాలను అందుకోలేక పోయింది. దీంతో బాలీవుడ్‌లోకి అడుగిడి అక్కడ తానేమిటో నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా పలు ఆఫర్లను సొంతం చేసుకోవడం విశేషం. రీసెంట్‌గా రాజ్ అండ్ డీకే దర్శకద్వయంలో రూపొందనున్న 'ఫర్జీ' చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అర్జున్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్న ఈచిత్రంలో తొలుత శ్రద్ధాకపూర్‌ని హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నారు. పూర్తి స్క్రిప్ట్ విన్న తర్వాత అంతగా సంతృప్తి చెందని శ్రద్ధా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్టు తెలుస్తోంది. దీంతో చిత్రయూనిట్ కృతిని ఎప్రోచ్ అయ్యారట. 'బరేలీ కి బర్ఫీ' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత 'ఫర్జీ'లో నటించే ఛాన్స్ రావడం పట్ల కృతి స్పందిస్తూ, 'చాలా ఆనందంగా ఉంది. 'బరేలీ కి బర్ఫీ' అందరి ప్రశంసలను సొంతం చేసుకుంటోంది. ముఖ్యంగా ఇందులోని నా పాత్రకు మంచి అప్రిషియేషన్ లభిస్తోంది. ఆర్టిస్టులుగా మేం మా వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేస్తాం. అయితే మా వృత్తిపరమైన పనిని చూడకుండా చాలా మంది వ్యక్తిగత జీవితంపై దృష్టిపెట్టడం చాలా బాధ కలిగిస్తోంది' అని తెలిపింది.


కృతి సనన్

మంచితనం నేర్పిన గుణపాఠం..

'మంచితనం.. అది పుస్తకాల్లో ఉంటే పాఠం అవుతుంది.. మనలో ఉంటే గుణపాఠం అవుతుంది. అదే నా జీవితాన్ని తలకిందులు చేసింది' అని అంటున్నారు ఎన్టీఆర్. ఆయన త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. బాబీ (కె.ఎస్.రవీంద్ర) దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్.. జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే జై పాత్ర తాలుకా టీజర్‌ను విడుదల చేయగా, తాజాగా వినాయక చవితి పండుగను పురస్కరించుకుని లవ పాత్రకు సంబంధించిన టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ఇందులో 'హాయ్.. నా పేరు లవకుమార్. ఒక ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా వర్క్ చేస్తున్నాను. నాకో వీక్‌నెస్ ఉంది' అంటూ సాగే ఈ టీజర్ ఆసక్తికరంగా ఉంది. మంచితనం గురించి ఎన్టీఆర్ అమాయకంగా చెబుతున్నట్టుగా ఉన్న ఈ టీజర్ సినిమాలోని లవ పాత్ర తీరుతెన్నులను చెబుతుంది. ఇటీవల లవ పాత్ర ఫస్ట్‌లుక్ విడుదలై మంచి ఆదరణ పొందింది. తాజాగా టీజర్ సైతం సినిమాపై అంచనాలను మరింతగా పెంచుతోంది. ఎన్టీఆర్ సరసన రాశీఖన్నా, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 21న విడుదల చేయనున్నారు.


'జై లవ కుశ'లో ఎన్టీఆర్

శత్రువులను చంపే ఆత్మ


లావణ్య త్రిపాఠి

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా సి.వి.కుమార్ దర్శకత్వంలో ఎస్.కె.అబ్దుల్లా సమర్పణలో ఎస్.బి.కె.ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఎస్.కె.బషీద్, ఎస్.కె.కరీమున్నీసా సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. ఈ చిత్రం సెప్టెంబర్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత బషీద్ మాట్లాడుతూ, 'ఇదొక విభిన్న కథా చిత్రమిది. ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సినిమా సాగుతుంది. హీరో మరో వ్యక్తిలోకి ఆత్మగా వెళ్ళి ప్రత్యర్థులను చంపేస్తుంటాడు. అతను ఎందుకలా చేస్తున్నాడనేది మాత్రం తెరపైనే చూడాలి. 40 ఏండ్ల క్రితం మనిషి ఎలా ఉన్నాడు. ఇప్పుడెలా ఉంటున్నాడు. 40ఏండ్ల తర్వాత ఎలా ఉంటాడనేది ఈ చిత్రంలో చూపించాం. ఇన్వెస్టిగేషన్ అధికారిగా సందీప్ కిషన్ నటించారు. లావణ్య త్రిపాఠి అందం, నటనతో ఆకట్టుకుంటుంది. ఈ సినిమాను ఏకకాలంలో తెలుగు, తమిళంలో ద్విభాషా చిత్రంగా తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్ని ఈ చిత్రంలో ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇదిలా ఉంటే ఇటీవల టీవీల్లో, పేపర్‌లో నాపై పలు తప్పుడు వార్తలు వచ్చాయి. నేను 100 కోట్ల స్కాం చేసినట్టు, మోసం చేసినట్టు వార్తలు వచ్చాయి. నేను ఏ తప్పు చేయలేదు. నేను సినిమాలపై ప్యాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇప్పటికి రెండు సినిమాలు నిర్మించి ఓ కోటి రూపాయలు కూడా నష్టపోయాను. కొంత మంది కావాలనే నాపై పాలిటిక్స్ చేస్తున్నారు. దయజేసి నన్ను వదిలేయండి' అని అన్నారు.

కాలనీలో జరిగే వినూత్న ప్రేమకథ..


'తొంగి తొంగి చూడమాకు చందమామ'లో ఒక దృశ్యం

దిలీప్, శ్రావణి, రాజ్‌బాల, అపర్ణ, బేబీ అక్షర ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. ఆనంద్ కానుమోలు దర్శకత్వంలో గురు రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో హరి వల్లభ ఆర్ట్ పతాకంపై ఏ.ఎం.రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి దర్శకుడు ఆనంద్ కానుమోలు మాట్లాడుతూ, 'ఒక కాలనీలో జరిగే వినూత్న ప్రేమ కథ ఇది. తమ మధ్య ఉన్నది ఎలాంటి బంధమో తెలియని జంట.. చివరి వరకు ఒకరికి ఒకరు ఆ అనుభూతిని వ్యక్తీకరించుకోరు. తమ మధ్య ఉన్నది ప్రేమ అనే విషయం తెలుసుకునే లోపు వాళ్ళకు అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. తమ ప్రేమను పరస్పరం తెలుపుకోవడంతోనే కథ ముగుస్తుంది. క్లైమాక్స్‌లో ప్రేమను చెప్పుకోవడం చిత్రానికి కొత్తదనాన్ని తీసుకొస్తుంది. లవ్‌తో పాటు జబర్దస్త్ నటులు మంచి వినోదాన్ని అందిస్తారు. బొబ్బిలి టీపీ కాలేజ్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిపాం. సెప్టెంబర్ తొలి వారం నుంచి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి డిసెంబర్‌లో సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. బస్టాప్ సాయి, జబర్దస్త్ మహేష్, అప్పారావు, జెమినీ సురేష్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీనివాస్ విన్న కోట, సంగీతం: హరి గౌర, ఆర్ట్ : రమేష్.

ప్రేమిక పాటలొచ్చాయ్..


'ప్రేమిక' చిత్ర ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

తనీష్, శృతి యుగళ్ హీరో,హీరోయిన్లుగా మహేంద్ర దర్శకత్వంలో ఎస్.వి.ఎన్.రావు సమర్పణలో దేశాల ఆర్ట్ మూవీస్, స్టార్ లైన్ మూవీస్ పతాకాలపై దేశాల లక్ష్మయ్య నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమిక'. ఈ చిత్ర ఆడియో లాంచ్ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఆడియో సీడీలను దర్శకుడు త్రినాథరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో తనీష్ మాట్లాడుతూ, 'దర్శకుడు మహేంద్ర కథ చెప్పినప్పుడు నేను చేయగలనా? అనే సందేహం కలిగింది. నా కెరీర్‌కి ఇంత మంచి కథ ఇచ్చినందుకు దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. కెమెరామెన్ రాహుల్ టేకింగ్ చాలా బాగుంది. దిలీప్ సంగీతానికి ప్రాణం పోశాడు. అన్ని విభాగాల వాళ్ల కుటుంబ సభ్యులుగా ఈ చిత్రానికి పనిచేశారు. ఇది అందరిని ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని అన్నారు.

దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ, 'టైటిల్ ఆకట్టుకునేలా ఉంది. పాటలు చాలా బాగున్నాయి. దిలీప్ బండారి అద్భుతమైన ట్యూన్స్ అందించారు. సినిమా చాలా కొత్తగా కనిపిస్తుంది. హీరో తనీష్ కిది మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా. నవ్యమైన కథాంశంతో పల్లెటూరు నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. చిత్ర యూనిట్‌కి మంచి పేరును తీసుకురావాలి' అని అన్నారు. 'నా మొదటి సినిమానే ప్రేమ కథతో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఛాన్స్ ఇచ్చిన నిర్మాత లక్ష్మయ్యకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. టీమ్ అందరి సపోర్ట్‌తో సినిమాను బాగా తెరకెక్కించగలిగాను' అని దర్శకుడు మహేంద్ర తెలిపారు. చిత్ర సమర్పకుడు ఎస్.వి.ఎన్.రావు చెబుతూ, 'లవ్, మదర్ సెంటిమెంట్‌తో.. సహజత్వానికి దగ్గరగా, పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రమిది. అల్లరి చిల్లరిగా అమ్మాయిల వెంట తిరిగే కొంతమంది యువకులకు, అమ్మాయిల్ని పెళ్ళి చేసుకోవాలంటే ప్రేమిస్తే సరిపోద్ది, అదే అమ్మాయిని పోషించాలంటే సంపాదించాలి అనే నిజం తెలుసుకున్న మరుక్షణం వాళ్ళ జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి. వాళ్ళు ప్రేమలోనూ, జీవితంలోనూ గెలిచారా? ఓడారా? అనే ఇతివృత్తంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఎమోషన్స్‌కి కమర్షియల్ టచ్‌తో ఉద్వేగ భరితంగా తెరకెక్కించాం. మంచి మెలోడీతో ఎనిమిది పాటలను నూతన సంగీత దర్శకుడు దిలీప్ బండారి అద్భుతంగా కంపోజ్ చేశారు. పాటలు అలరిస్తాయి' అని చెప్పారు. 'ఇది చిన్న సినిమా కాదు, పెద్ద సినిమాగా చేశాం. వచ్చే నెల 8న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

ప్రేమిస్తే సినిమా స్థాయిలో..


రుహాని శర్మ, భరత్, అంగనా రాయ్

భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ హీరోహీరోయిన్లుగా రవి భార్గవన్ దర్శకత్వంలో రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మిస్తున్న చిత్రం 'మళ్ళీ ప్రేమిస్తే'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, "ప్రేమిస్తే' తర్వాత భరత్ నటిస్తున్న ప్రేమ కథా చిత్రమిది. తను ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే ఓ కుర్రాడు ఎంతటి స్ట్రగుల్ పడ్డాడనే ఇతివృత్తంతో దర్శకుడు రవి భార్గవన్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించాడు. మోసపోయిన కుర్రాడి పాత్రలో భరత్ అద్భుతంగా నటించాడు. విజయ్ కురకాల సంగీతం సారథ్యంలో రూపుదిద్దుకున్న 5 పాటలు చక్కగా వచ్చాయి. పాటలు శ్రోతలని అలరిస్తాయి. సెన్సార్‌తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో రిలీజ్‌కు చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమా 'ప్రేమిస్తే' అంతటి స్థాయిలో ఘన విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు. కాశీ విశ్వనాథ్, సురేఖా వాణి, సన, కోటేశ్వరరావు, త్రిశూల్, శివరాం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ముజీజ్ మాలిక్, ఎడిటింగ్: నందమూరి హరిబాబు.


మనీషానే స్ఫూర్తి


అదితి రావు హైదరి

"బాంబే' సినిమాలో శైలా బాను పాత్రలో మనీషా కొయిరాలా అత్యద్భుతంగా నటించారు. ఆమే నాకు స్ఫూర్తి' అని అంటోంది అదితి రావు హైదరి. ఇటీవల మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'చెలియా' చిత్రంలో అదితి నటించి మెప్పించింది. మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'బాంబే' చిత్రంలో అరవింద్ స్వామి, మనీషా కొయిరాలా జంటగా నటించారు. అలాగే మనీషా, షారూఖ్ జంటగా నటించిన 'దిల్ సే' చిత్రం విడుదలై 19ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అదితి స్పందిస్తూ, 'లవ్ లవ్ లవ్! 'దిల్ సే'..షారూఖ్ ఖాన్, మనీషా కొయిరాలా. ఎపిక్.. మణిరత్నం సార్ మ్యాజిక్' అంటూ ట్వీట్ చేసింది. దీనికి మనీషా కొయిరాలా స్పందిస్తూ, 'థ్యాంక్యూ.. నువ్వు అందంగా ఉంటావ్. చాలా టాలెంటెడ్ కూడా' అంటూ ట్వీట్ చేసింది. దీనికి అదితి రీట్వీట్ చేస్తూ, "బాంబే'లో మీ నటన అత్యుత్తమం. నాకెప్పుడూ మీరే స్ఫూర్తి. మీలా నేను కూడా కావాలనుకుంటున్నా' అని తెలిపింది. అదితి ప్రస్తుతం 'భౌర్ దేవదాస్', 'భూమి', 'పద్మావతి' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

ఆధ్యాత్మిక గురువు స్వామి ఓంకు రూ.10లక్షలు జరిమానా విధించిన సుప్రీం

- తదుపరి సీజేగా దీపక్‌మిశ్రా నియామకాన్ని సవాల్ చేసినందుకు..



న్యూఢిల్లీ : ఆధ్యాత్మిక గురువు స్వామి ఓంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, భారత ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ ఈనెల 27న పదవీ విరమణ పొందనున్నారు. తదుపరి సీజేఐగా దీపక్‌మిశ్రా ప్రమాణం చేయనున్నారు. జస్టిస్ దీపక్ మిశ్రాను సీజేగా నియమించొద్దని స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి గురువారం కొట్టేసింది. అంతేగాకుండా, తదుపరి సీజే నియామకాన్ని ప్రశ్నించిన ఓం ప్రకాశ్‌కు రూ.10లక్షల జరిమానా విధించింది. కాగా, హిందీ బాషలో ప్రసారమవుతున్న బిగ్‌బాస్ కార్యక్రమంలో పాల్గొన్న స్వామి, అతని అనుచరుడు సంతోష్ ఆనంద్ ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆ ప్రోగ్రామ్ నుంచి వైదొలిగారు. బాధితురాలు స్వామి ఓం అసభ్యకర ప్రవర్తన గురించి భజన్‌పూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో స్వామి అరెస్టయిన సంగతి తెలిసిందే.

గోరఖ్‌పూర్ ఆస్పత్రి దుర్ఘటన

తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ అందక చిన్నారులు మృతి చెందిన ఘటనలో బీఆర్‌డీ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సహా తొమ్మిది మందిపై పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ అందకపోవడంతో ఇటీవల 60 మందికి పైగా చిన్నారులు ప్రాణాలొదిలిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేసేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈనెల 12న రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించారు. కాగా కమిటీ.. బుధవారం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఘటనకు బాధ్యులైన వారిని రిపోర్టులో పేర్కొని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఎఫ్.ఐ.ఆర్ నమోదైన వారిలో మాజీ ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రా, ఆయన భార్య పూర్ణిమా శుక్లా, వైద్యుడు కఫీల్‌ఖాన్ ఉన్నారు. అంతేకాక, ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా చేస్తున్న 'పుష్పా సేల్స్' కంపెనీపై కూడా కేసు నమోదైంది. గడిచిన మూడేండ్లలో ఆస్పత్రి కొనుగోలు చేసిన మందులు, తదితర సామాగ్రిపై ప్రత్యేక కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)తో ఆడిట్ చేయించాలని దర్యాప్తు కమిటీ పేర్కొన్నది. ఇక ఇదే కేసులో వైద్య విద్య శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అనితా భట్నాగర్ జైన్‌పై బదిలీ వేటు పడింది. కాగా ఈ బాధ్యతలను రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రాజ్‌నీశ్ దుబేకు తాత్కాలికంగా అప్పగించారు.

బాలిక చేయి నరికిన ఉన్మాది

లక్నో: ప్రేమను అంగీకరించక పోవడంతో పాటు లైంగికదాడి యత్నాన్ని తిప్పి కొట్టిందన్న అక్కసుతో అందరూ చూస్తుండగానే బాలిక చేయి నరికాడు ఓ దుర్మార్గుడు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్పీ ఎస్. చెన్నప్ప వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఫతేపూర్ ప్రాంతానికి చెందిన రోహిత్ చౌహారియా.. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక(15)ను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం బాలిక సెల్‌ఫోన్ చార్జర్‌ను రోహిత్ దొంగిలించాడు. చార్జర్ కావాలంటే తన ఇంటికి రావాలంటూ ఒత్తిడి చేశారు. కాగా అతడి నివాసానికి వెళ్లిన బాలికపై రోహిత్ అఘాయిత్యానికి యత్నించాడు. దీన్ని ప్రతిఘటించి బాలిక బయటకు పరుగులు తీసింది. కోపోద్రిక్తుడైన రోహిత్ కత్తి తీసుకొని ఆమెను వెంబడించి చేయి నరికాడు. ఘటనలో తల, మరో చేతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని హుటాహుటిన జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్నోకు తరలించారు. వైద్యులు తీవ్రంగా శ్రమించి బాధితురాలి చేయిని తిరిగి అతికించారు. మరోవైపు.. నిందితుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

కాంగ్రెస్ నేతల నివాసాలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ: దేశరాజధానిలోని కాంగ్రెస్ నేతల నివాసాలపై ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు నిర్వహించారు. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం(ఫెమా) కింద గురువారం ఈ దాడులు జరిగినట్టు సమాచారం. కాంగ్రెస్ ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే సుమేష్ షోకీన్ ఇంటితో సహా నగరవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

రైల్వే బోర్డు చైర్మెన్‌గా

అశ్వని లోహని బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ : రైల్వే బోర్డు నూతన చైర్మెన్‌గా అశ్వని లోహని బాధ్యతలు స్వీకరించారు. భద్రతకు, స్టేషన్ల ఆధునీకరణకు ప్రాధాన్యత ఇస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అపరిశుభ్రత, వీఐపీ సంస్కృతి, అవినీతిని అంతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఎయిర్ ఇండియాలో రెండేళ్లు పని చేసిన అశ్వని, ఎకె మిటల్ రాజీనామా చేయడంతో రైల్వే బోర్డు చైర్మన్‌గా నియమించబడ్డారు.

యూపీ ఎన్‌కౌంటర్‌లో ఎస్ఐ మృతి

- ముగ్గురు దోపిడీ దొంగల అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో పోలీసులకు, దోపిడీ దొంగలకు మధ్య గురువారం భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఎస్ఐ ప్రాణాలు కోల్పోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎట్టకేలకు ముగ్గురు దోపిడీ దొంగలను బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. బుందేల్‌ఖండ్ రీజియన్‌లో బందిపోటు బాబ్లీకోల్ ముఠా కొన్నేండ్లుగా అక్రమాలు, అరాచకాలకు తెగబడుతున్నది. బాబ్లీ కోల్ తలపై ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. ఇదిలా ఉండగా చిత్రకూట్ జిల్లాలోని నిహీ చిరాజ్య అటవీ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున బాబ్లీ కోల్ ముఠా సభ్యులకు, పోలీసులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో చిత్రకూట్ జిల్లాకు చెందిన పోలీసు బృందాలు పాల్గొన్నాయి. కాగా ఎదురుకాల్పుల్లో బుల్లెట్ గాయాలై ఎస్ఐ జై ప్రకాశ్‌సింగ్ ప్రాణాలు కోల్పోయారు. మరో ఎస్ఐకి తీవ్ర గాయాలయ్యాయి. అయితే దోపిడీ దొంగలను పట్టుకునేందుకు స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) బలగాలు రంగంలోకి దిగాయి. ముఠాలో కీలక వ్యక్తి అయిన రాజు కోల్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశాయి. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు దోపిడీ దొంగలకు కూడా బుల్లెట్ గాయాలైనట్టు పోలీసు అధికారి ఎస్ఎన్ సాబాత్ వెల్లడించారు.

హర్యానా, పంజాబ్‌లో భద్రత కట్టుదిట్టం

- రామ్ రహీమ్ సింగ్ లైంగిక వేధింపుల కేసులో నేడు తీర్పు

చండీగఢ్: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై లైంగికవేధింపుల కేసుకు సంబంధించి తీర్పు వెలువడనున్న నేపథ్యంలో హర్యానా, పంజాబ్, చండీగఢ్‌లలో భద్రతను కట్టుదిట్టం చేశారు. గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో పంచకులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు ఇప్పటికే పంచకులకు చేరుకున్నారు. దీంతో నగరంలో దాదాపు ఐదు వేల మంది పోలీసులను మోహరించారు. రామ్ రహీం సింగ్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే పెద్దఎత్తున హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సైనిక బలగాలతో చర్చలు జరిపింది. రెండు రాష్ట్రాల్లో 150 కంపెనీల పారామిలటరీ బలగాలను రంగంలోకి దించారు. పంచకులలో పాఠశాలలు, కళాశాలలకు బుధవారం నుంచి శనివారం వరకూ సెలవు ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దుచేశారు. డ్రోన్‌ల సహాయంతో నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

మోడీవి అనాలోచిత నిర్ణయాలు

బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఈ) ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో మోడీ తీసుకొస్తున్న సంస్కరణలన్నీ అనాలోచితమైనవని విమర్శించారు. జీఎస్టీ ప్రభావంతో బ్యాంక్ ఖాతాదారులపై సర్వీస్ చార్జీలను పెంచడం తగదన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఎగవేతకు పాల్పడుతున్న పారిశ్రామికవేత్తలపై, వ్యాపారులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. బ్యాంకు రుణాల ఎగవేతకు పాల్పడ్డవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిశ్వాస్ డిమాండ్ చేశారు. మొండి బకాయిల వసూళ్ల కోసం పార్లమెంటరీ కమిటి సూచించిన ప్రతిపాదనలను అమలు చేయాలని కోరారు. బ్యాంక్ బోర్డు బ్యూరో విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రతిపాదనను యునైటెడ్ మూమెంట్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (యూఎఫ్‌బీయూ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్తంగా బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్న సంగతి తెలిసిందే. వచ్చేనెల 15న ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్టు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. ఇదిలా ఉండగా, పీఎస్‌బీ విలీన ప్రక్రియ కోసం మంత్రుల కమిటీతో ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. వృద్ధి బాటలో పయనిస్తోన్న దేశ ఆర్థిక వ్యవస్థ నిధుల అవసరాలు తీర్చేందుకు, ప్రభుత్వ ఖజానాపై ఆధారపడకుండా పీఎస్‌బీల నిధుల సమీకరణ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. విలీన ప్రక్రియ నిమిత్తం పీఎస్‌బీ బోర్డుల నుంచి వచ్చే ప్రతిపాదనలను మంత్రుల కమిటీ పరిశీలిస్తుందని అన్నారు.

సోషల్ టచ్



మహిళల సమస్యలపై అధ్యయనాలకు

మరిన్ని ప్రోత్సాహాలు అవసరం

యూజీసీని కోరిన మహిళా సంఘాలు



న్యూఢిల్లీ : మహిళలకు సంబంధించిన వివిధ సమస్యలపై అధ్యయనం చేసే కేంద్రాలకు మద్దతు కొనసాగించాలని యూజీసీకి ఇండియన్ అసోసియేషన్ ఫర్ వుమెన్స్ స్టడీస్ విజ్ఞప్తిచేసింది. సామాజికంగానూ, ఇతరత్రా మహిళల అభ్యున్నతికి దేశవ్యాప్తంగా దాదాపు 163 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వాల ఆమోదంతో వివిధ సమస్యలపై అధ్యయనం చేయడానికి జాతీయ విద్యా విధానంలో భాగంగా 1986లో ఏర్పాటు చేశారు. గతంలో షాబానో కేసు, మథుర రేప్ కేసు, రూప్ కన్వర్ కేసులపై ఈ కేంద్రాలు విస్తృతంగా అధ్యయనాలు నిర్వహించాయి. వీటికి యూజీసీ నుంచి ఆర్థిక సహకారం 2017 సెప్టెంబర్ వరకు మాత్రమే అందించేందుకు ఉత్తర్వులు ఉన్నాయి. వాటిని పొడిగించాల్సిందిగా బుధవారం ఇక్కడ జరిగిన జాతీయ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. జూన్ 16న యూజీసీ జారీచేసిన నోటీసుల ప్రభావంతో ఈ కేంద్రాల భవిష్యత్తు సందిగ్ధంలో పడిందని వారు తెలిపారు. ఈ నోటీసు ప్రకారం మార్చి 2018 వరకు మాత్రమే ఈ కేంద్రాలకు యూజీసీ నుంచి నిధుల సహకారం ఉంటుంది. ఈ కేంద్రాల కృషి కారణంగానే మహిళలపై అత్యాచారాలు తగ్గుముఖం పట్టాయనీ, వివిధ రంగాలలో వారికి అవకాశాలు మెరుగయ్యాయని, ఈ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యురాలు దేవికా జైన్ తెలిపారు. వివిధ సమస్యలపై మహిళల కోణంలో సమాజానికి మార్గదర్శకం అందించడం సాధ్యమైందని ఆమె గుర్తుచేశారు. ఇకముందు కూడా ప్రభుత్వాలు తమ విధాన రూపకల్పన సమయంలో ఐసీఎంఆర్, ఐసీఏఆర్, నిటి అయోగ్ వంటి సంస్థలు ఈకేంద్రాలతో సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో తిరోగమన గతి కనిపిస్తున్నదని, అందువల్లే మళ్లీ మహిళలపై అరాచకాలు పెరిగిపోతున్నాయని ఈ అసోసియేషన్ ప్రెసిడెంట్ రీటూ దేవాన్ తెలిపారు. గతంలో ఈ కేంద్రాల పేరును మహిళలు, కుటుంబ అధ్యయన కేంద్రాలుగా మార్పు చేసి వాటి పరిధిని కుటుంబానికి పరిమితం చేసే ప్రయత్నం జరిగిందని ఆమె అన్నారు.

నేపాల్‌తో 8 ఒప్పందాలు



న్యూఢిల్లీ : మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు వివిధ అంశాలపై ఎనిమిది ఒప్పందాలను నేపాల్‌తో భారత్ కుదుర్చుకుంది. నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాతో భారత ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఇరువురు ప్రధానులు రిమోట్ ద్వారా నేపాల్ సరిహద్దుల్లో పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ను ప్రారంభించారు. ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోడీ మాట్లాడుతూ నేపాల్‌తో ద్వైపాక్షిక సంబంధాలు సానుకూలంగానూ, నిరంతరాయంగానూ సాగుతున్నాయని అన్నారు. దేవ్‌బాతో చర్చలు చాలా సానుకూలంగా జరిగాయని, నేపాల్ అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో సహకారం వుంటుందని అన్నారు. ద్వైపాక్షిక ఒప్పందాల్లో భద్రత, రక్షణ అంశాలకు కూడా ప్రాధాన్యత వుందన్నారు. నేపాల్‌కు ఎప్పుడూ సహాయం చేస్తామని, ఇటీవల వరదల సమయంలోనూ సహాయం చేసామన్నారు. నేపాల్ ప్రధాని దేవ్‌బా మాట్లాడుతూ నేపాల్ గడ్డపై ఎటువంటి భారత వ్యతిరేక కార్యక్రమాలను అనుమతించమని తెలిపారు.

వరద ముంపు ప్రాంతాల్లో

యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలి

ఏఐకేఎస్ డిమాండ్



న్యూఢిల్లీ : తీవ్ర వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని ఆలిండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తీవ్ర వరద ప్రభావానికి గురైన బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 749 మంది మృతిచెందారని తెలిపింది. ప్రత్యేకంగా బీహార్, పశ్చిమబెంగాల్, అసోం, తూర్పు యూపీలలోని అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. తీవ్ర వరద పరిస్థితుల్లో సాధారణ జీవితం అస్తవ్యస్థమైంది. త్రిపుర, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ వంటి ఈశాన్య రాష్ట్రాలు కూడా వరద ప్రభావానికి గురయ్యాయి. ఈ రాష్ట్రాల్లోనూ మరణాలు సంభవించాయి. వేలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. ఒక్క బీహార్‌లోనే ఆగస్టు 22 నాటికి 361 మంది మృతిచెందారనీ, పశ్చిమబెంగాల్‌లో 152, అసోంలో 154, తూర్పు యూపీలో 82 మంది చనిపోయారనీ ఏఐకేఎస్ పేర్కొంది. కాగా, ప్రధాన స్రవంతి జాతీయ మీడియాలో వరద పరిస్థితుల తీవ్రత గురించి పెద్దగా వార్తలు రాలేదని అభిప్రాయపడింది. వరద నీట మునిగిన ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని, ఈ నాలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 3.42 కోట్ల మంది డెంగ్యూ బారిన పడినట్టు తెలిపింది. ఒక్క బీహార్‌లోనే దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమి నీటి మునిగిందని పేర్కొంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 4.38 లక్షల మంది ప్రజలు సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందగా, ఇందులో బీహార్‌లో శిబిరాల్లో ఉన్న వారి సంఖ్య 3.27 లక్షలు. అసోంలో 68 వేల మంది ప్రజలు ఇంకా సహాయ శిబిరాల్లోనే తలదాచుకుంటున్నట్టు ఏఐకేఎస్ తెలిపింది. తీవ్ర వరద పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాలను ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విమర్శించింది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధమై ఉంటే, ఇన్ని మరణాలు సంభవించేవికావని ఆరోపించింది. రుతుపవనాల సీజన్ ప్రారంభమైన తొలి దశలో మే-జులైలో దేశవ్యాప్తంగా దాదాపు 700 మంది మరణించారని గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కదిలి యుద్ధప్రాతిపదికన సహాయకచర్యలను చేపట్టాలని డిమాండ్ చేసింది. జాతీయ విపత్తుగా ప్రకటించి వరదల్లో మృతిచెందిన వారి కుటుంబానికి రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.2 లక్షలు చెల్లించాలని కోరింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సమాచార వ్యవస్థలను వెంటనే పునరుద్ధరించాలని, బాధితులకు ఆహారం, బట్టలు సరఫరా చేయాలని డిమాండ్ చేసింది. వరదబాధితులను ఆదుకోవడంలో నిమగ్నమైన కిసాన్‌సభ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలను ఏఐకేఎస్ ప్రశంసించింది. వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చింది.

లాలూ ర్యాలీకి సోనియా దూరం

- 27న పాట్నాలో 'బీజేపీ భగావో...దేశ్ బచావో ర్యాలీ'

పాట్నా : 'బీజేపీ భగావో..దేశ్ బచావో' (భారతీయ జనతా పార్టీని తరిమేయండి...దేశాన్ని కాపాడండి) అనే నినాదంతో ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలో తీయనున్న ర్యాలీకి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిరాకరించారు. ఈనెల27న పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ప్రారంభంకానున్న ఈ ర్యాలీలో పాల్గొనబోమని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, బహుజన్ సమాజ్‌పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు మాయవతి స్పష్టం చేశారు. పశుగ్రాసం స్కాం వంటి భారీ కుంభకోణాల్లో కూరుకునిపోయిన లాలూకు మద్దతివ్వాలా? వద్దా? అనే విషయంలో వామపక్షాలు తర్జనభర్జన పడుతున్నాయి. ర్యాలీలో పాల్గొనే విషయంలో ఇంకనూ తుది నిర్ణయం ప్రకటించలేదు. కాగా, అధికార బీజేపీ సర్కార్‌ను కూలదోసేందుకు లాలూప్రసాద్ ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావాలని భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో జరగనున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను ఏకంచేసి బీజేపీని ఓడించాలనే వ్యూహరచనలు చేస్తున్నారు. మహాగట్‌బంధన్ (అతిపెద్ద సంకీర్ణం) పేరిట అన్ని పార్టీలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తన రాజకీయ ప్రత్యర్థులైనా బహుజన సమాజ్‌పార్టీ, సమాజ్‌వాదీపార్టీ ముఖ్యనేతలైన మాయావతి, అఖిలేష్‌యాదవ్‌లతోనూ సఖ్యతతో మెలుగుతున్నారు. బీజేపీ భగావో...దేశ్ బచావో ర్యాలీలో పాల్గొనాల్సిందిగా వారిని ఆహ్వానించారు. ఇదిలా ఉండగా, లాలూ తీయనున్న ర్యాలీలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, జేడీయూ రెబల్ ఎంపీ శరద్‌యాదవ్ పాల్గొననున్నట్టు ప్రకటించారు. సోనియాగాంధీ ఈ ర్యాలీలో పాల్గొనేందుకు అనాసక్తి చూపడంతో కనీసం ప్రియాంక గాంధీనైనా ర్యాలీలో పాల్గొనేలా చూడాలని కాంగ్రెస్ అధ్యక్షురాలిని లాలూ అభ్యర్థించారు. లాలూ అభ్యర్థనను సోనియా సున్నితంగా తిరస్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత గులామ్‌నబీ ఆజాద్ ఈ ర్యాలీలో పాల్గొననున్నట్టు సమాచారం.


ఉచ్చులో భావితరం

ప్రాణాలు తోడేస్తున్న "బ్లూ వేల్ ఛాలెంజ్" గేమ్

ఆట ను కనిపెట్టిన వ్యక్తి జైల్లో ఉన్నా.. ఆగని గేమ్

- మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలకు సైతం మూలాలు దొరకని వైనం
- గేమ్ వ్యాప్తిని అరికట్టడానికి సోషల్ మీడియా సంస్థలు తీసుకున్న చర్యలను ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు
- ఇంటర్నెట్ ఎక్స్ పర్ట్స్, దేశాల సహకారంతో వికృత క్రీడ ఆగడాల్ని అరికట్టవచ్చంటున్న విశ్లేషకులు

- కడవేర్గు



ఆటల్ని మనుషులు ఆడాలి. కానీ, ఓ ఆట మనిషి జీవితంతోనే ఆడుకుంటోంది. ఆ ఆట అలాంటి ఇలాంటి ఆట కాదు.. సుమారు యాభై రోజుల మృత్యుకేళి. అభం శుభం ఎరుగని చిన్నారుల మనసుల్ని ప్రభావితం చేసి వారి జీవితాన్ని ఛిద్రం చేసే ఘోరకలి.. "బ్లూ వేల్ ఛాలెంజ్". ఈ రాక్షస క్రీడ భారతంలో రేపుతున్న కల్లోలాన్ని గ్రహించిన కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ సదరు వికృత క్రీడకు సంబంధించిన అన్ని లింకులను నిర్వీర్యం చెయ్యాలని పదిరోజుల క్రితమే సోషల్ మీడియా దిగ్గజాలను ఆదేశించింది. బ్లూ వేల్ ఛాలెంజ్ గేమ్ వ్యాప్తిని అరికట్టడానికి సోషల్ మీడియా సంస్థలు ఎటువంటి చర్యలు తీసుకున్నాయో తెలపాలని ఢిల్లీ హైకోర్టు తాజాగా ఆదేశించిన నేపథ్యంలో.. అసలు బ్లూ వేల్ గేమ్ ఏంటీ? అది ఎలా వ్యాప్తి చెందుతుంది? దాని మూలాల్ని దిగ్గజ సంస్థలు కూడా కనిపెట్టలేకపోతున్నాయా? వంటి ప్రశ్నలు సామాన్య ప్రజానీకానికి సైతం వస్తుండటం గమనార్హం.. ఈ సందర్భంగా "బ్లూ వేల్ ఛాలెంజ్" గేమ్‌పై "నవ తెలంగాణ" స్పెషల్ ఫోకస్..

యావత్ భారతావనిలో గత నెల రోజుల కాలంలో బ్లూ వేల్ ఛాలెంజ్ గేమ్ సృష్టిస్తోన్న అలజడి అంతా ఇంతా కాదు.. నాలుగేండ్ల కిందట రష్యా నుంచి పుట్టుకొచ్చినట్టు భావిస్తున్న ఈ గేమ్ మూలంగా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 130 కి పైగా టీనేజర్లు తనువు చాలించారని సమాచారం.

రూపకర్త జైల్లో! రయ్యిమంటూ నడుస్తున్న గేమ్

2013లో రష్యాకు చెందిన ఫిలిప్ బుడ్కెకిన్ అనే 22 ఏండ్ల యువకుడు బ్లూ వేల్ ఛాలెంజ్ గేమ్ ను రూపొందించినట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్ వేదికగా సాగే ఈ ఆటను ఆడాలంటే ముందు అకౌంట్ క్రియేట్ చెయ్యాల్సి ఉంటుంది. ఒక్కసారి సభ్యత్వం లభించాక 50 దశల్లో వివిధ టాస్క్ లు(పనులు) ఉంటాయి. ఆయా టాస్క్ లను బ్లూ వేల్ గేమ్ ఛాలెంజ్ తీసుకున్న యూజర్లకు అప్పగించేందుకు మెంటర్లు కూడా ఉంటారు. ఐతే, ఆ మెంటర్ల వివరాలు మాత్రం బహిర్గతం అవ్వవు. గేమ్ ప్రారంభంలో సులభమైన పనులను చెప్తూ.. క్రమక్రమంగా టాస్క్ డోస్ ను పెంచుతారు. ఆఖరికి, ఇచ్చే టాస్క్ ఆత్మహత్యతో ముగుస్తుండటం గమనార్హం. ఇవ్వబడిన టాస్క్ లు పూర్తికాగానే,టాస్క్ కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు విధిగా అప్ లోడ్ చెయ్యాలి. ఎవరికి ఏ టాస్క్ ఇచ్చారో టాస్క్ పూర్తయ్యేంత వరకు బయట షేర్ చెయ్యకూడదు.. ఇటువంటి రూల్స్ తో ఈ అమానవీయ క్రీడ సాగుతుండటంతో అమాయకులైన టీనేజర్స్ సదరు గేమ్ ఆకర్షణకు లోనయ్యి ప్రాణాలను తీసుకుంటున్నారు.

బ్లూ వేల్ గేమ్ ఛాలెంజ్ -ఆసక్తికర అంశాలు

- వేక్ మి అప్ ఎట్ 4.20 ఏఎం, డార్క్ రూమ్ వంటి వివిధ పేర్లతో కూడా బ్లూ వేల్ గేమ్ ఛాలెంజ్ పెచ్చరిల్లుతోంది.
- బ్లూ వేల్ చాలెంజ్‌ను ఆడే వారు (యూజర్స్).. నియంత్రించేవారు (క్యూరేటర్) వివిధ చాట్‌రూమ్స్ వేదికగా కనెక్ట్ అవుతారట!
- సమాజాన్ని క్లీన్ చేసే ఉద్దేశంతో ఈ ఆట ప్రారంభించానని బ్లూ వేల్ గేమ్ స ష్టికర్త ఫిలిప్ పేర్కొనడం సంచలనం సృష్టించింది.


ముఖ్యమైన విషయమేంటంటే, ఆట ప్రారంభించిన తొలినాండ్లలో బ్లూ వేల్ గేమ్ ను స ష్టించిన ఫిలిప్ సభ్యత్వం పొందిన యూజర్లకు సలహాలు, సూచనలు ఇస్తూ మెంటర్ గా ఉండేవాడు. ఫిలిప్‌ను అరెస్ట్ చేశాక.. ఇప్పుడు యూజర్లకు టాస్క్ లు ఇస్తోంది ఎవరో అంతుబట్టకపోవడం విస్తుగొలుపుతోంది.

ఆపడం సాధ్యమా?

చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్న 'బ్లూ వేల్ ఛాలెంజ్'పై ఏం చర్యలు తీసుకున్నారో తెలిపాలని ఫేస్‌బుక్, గూగుల్, యాహూ వంటి దిగ్గజ సంస్థలను ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. అసలు బ్లూ వేల్ గేమ్ ను ఆపడం సాధ్యమా? అనే ప్రశ్న ప్రతీ ఒక్కరిలో మొలకెత్తుతోంది. దీనికి కారణం.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ - ఇండియా బ్లూ వేల్ గేమ్ లింకులను తొలగించే ప్రయత్నాలను వేగవంతం చేసినట్టు పేర్కొన్నప్పటికీ.. #%curatorfindme #i_am_whale act, #bluewhalechal-lenge% లాంటి హ్యాష్ ట్యాగ్‌లతో క్యూరేటర్ (బ్లూ వేల్ గేమ్ యూజర్లకు టాస్క్ లను ఇస్తున్నవారు) నుంచి సూచనలు, సలహాలు, టాస్క్ లు ఇప్పటికీ వస్తుండటం ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది. ఏదైనా సైట్, గేమ్ యాప్ ను నియంత్రించాలంటే గేట్‌వే లేదా ఐఎస్‌పీల కోడ్ లను గుర్తించాల్సి ఉంటుంది. ఐతే, అత్యంత క్లిష్టతతో, రహస్యంగా సాగుతున్న ఈ మృత్యు క్రీడ అన్నింటిలా యాప్ లేదా ఆన్ లైన్ సైట్ కాదు. ఇదొక కమ్యూనిటీ. అంతర్జాతీయంగా పాపులర్ అయిన సోషల్ మీడియా వెబ్‌సైట్లను వేదికలుగా చేసుకొని టీనేజర్ల ఉసురు తీస్తోన్న మహమ్మారి. బ్లూవేల్ గేమ్ ను సమూలంగా నియంత్రించుటకు ఇప్పటికే, వివిధ దేశాలు చేస్తోన్న ప్రయత్నాలు దాదాపుగా విజయం సాధిస్తున్నా యనే చెప్పాలి. ఇంటర్నెట్ ఎక్స్ పర్ట్స్, దిగ్గజ కంపెనీల డొమైన్ నిపుణుల సాయంతో.. వివిధ దేశాల మధ్య సమాచారాన్ని అందించుకోవడం ద్వారా ఈ గేమ్ మూలాలను నియంత్రించడం అంత కష్టం కాదంటున్నారు విశ్లేషకులు.

సెన్సెక్స్ ▲ 28	నిఫ్టీ ▲ 5	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,596	9,857	64.03	రూ. 29,582	రూ. 42,600





కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



ఎయిరిండియాను నిలబెట్టుకుందాం..

- భారతీయులందరూ సహకరించాలి : సంస్థ కొత్త సీఎండీ రాజీవ్ బన్సాల్



ముంబయి: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయి రిండియా (ఏఐ) కొత్త సీఎండీగా రాజీవ్ బన్సాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏఐ సీఎండీగా ఉన్న అశ్విన్ లోహానీని రైల్వే బోర్డు చైర్మెన్‌గా పంపిన సర్కారు.. ఆయన స్థానంలో రాజీవ్ బన్సాల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. బన్సాల్ పెట్రోలియం, సహజ వాయువు శాఖలో (ఆర్థిక వ్యవహారాల విభాగపు) అదనపు కార్యదర్శి బాధ్యతలతో పాటుగా ఎఐ బాధ్యతలను కూడా పర్యవేక్షించనున్నారు. బన్సాల్ 'ఇండియాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్-1988' బ్యాచ్‌కు చెందిన వారు. సంస్థను లాభాల బాట పట్టించేందుకు గాను ఉత్సాహంతో అంకితభావంతో పని చేసేందుకు తాను కట్టుబడి ఉన్నట్టుగా బన్సాల్ వివరించారు. ప్రయాణికుల సంతృప్తిని కాపాడుకుంటూ సంస్థ పని తీరును మెరుగుపరచుకునేందుకు కృషి చేయనున్నట్టుగా ఆయన ఈ సందర్భంగా వివరించారు. జాతీయ విమానయాన సంస్థ అయిన ఎయిరిండియాను కొత్త శిఖరాలకు చేర్చేందుకు గాను భారతీయులందరి సహకారాన్ని తాను ఆశిస్తున్నట్టుగా ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

విత్త విధానంలో మార్పులు రావాల్సిందే..

ఐసీఐసీఐ సీఈవో చందా కొచ్చర్




ముంబయి : పెట్టుబడుల పునర్జీవానికి వీలుగా ప్రస్తుత ప్రాజెక్టులకు అనుసరిస్తున్న విత్త విధానాన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో చందా కొచ్చర్ అన్నారు. ప్రాజెక్టుల ఫైనాన్సింగ్ విధివిధానాల్లో మార్పులు చేయాలన్నారు. ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ రాకేష్ మోహన్ రచించిన ఓ పుస్తకావిష్కరణకు హాజరైన కొచ్చర్ మాట్లాడుతూ ఒక సంస్థకు రుణం ఇవ్వాలంటే ఆ కంపెనీ ప్రాజెక్టుకు ముందూ, వెనకటి సమగ్ర సమాచారం, స్థల లభ్యత, సహజ వనరులు, ఆర్థికాంశాలు కీలకమైనవన్నారు. ఇవన్నీ ఉంటే బ్యాంకులు వేగిరంగా అప్పులివ్వచ్చన్నారు. 2016-17లో భారత్‌లో రుణాల జారీ వృద్ధి 5.08 శాతానికి పతనమయ్యింది. ఇది 1953 నాటి నుంచి అత్యంత కనిష్ఠ స్థాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనూ రుణాల డిమాండ్ వృద్ధి 6 శాతానికే పరిమితమైనట్టుగా ఆమె వివరించారు.

కోత బాటలో బీవోఐ

న్యూఢిల్లీ : సేవింగ్ ఖాతాల డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్న జాబితాలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) కూడా చేరిపోంది. పొదుపు ఖాతాల్లో రూ. 50 లక్షల కంటే తక్కువ ఉన్న నిల్వలపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 3.5 శాతానికి పరిమితం చేసింది. వడ్డీ తగ్గింపునపై రెండంచెల విధానాన్ని అనుసరిస్తున్నట్లు బ్యాంకు పేర్కొంది. ఇందులో భాగంగా రూ. 50లక్షల కంటే తక్కువ ఉన్న నగదు నిల్వలపై 3.5శాతం వడ్డీ అమలు చేయనుంది. కాగా రూ. 50లక్షలు పైబడిన డిపాజిట్లపై యధావిధిగా 4శాతం వడ్డీరేటు ఉండనుంది.

నందనే నయా బాస్..

- ఇన్ఫీ బోర్డు చైర్మెన్‌గా నీలేకని ఎంపిక
- నాటకీయ పరిణామాల మధ్య నిర్ణయం
- గురువారం రాత్రి పొద్దుపోయాక వెల్లడి
- రాజీనామాలు సమర్పించిన 'సిక్కా' వర్గం



బెంగళూరు: ఊహించినదే జరిగింది. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌ను చక్కబెట్టే బాధ్యతలను మాజీ చైర్మెన్ నందన్ నీలేకని భుజాన ఎత్తుకున్నారు. దిగజారి కంపెనీ ప్రతిష్టను నిలబెట్టి తిరిగి మునపటి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు ఆయన ఇక రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభి ంచనున్నారు. గురువారం ఇన్ఫోసిస్‌లో జరిగిన పలు నాటకీయ పరిణామాల అనంతరం నందన్ నీలేకనిని కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా, నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కూడా నియమిస్తున్నట్టు కంపెనీ గురువారం రాత్రి పొద్దుపోయాక వెల్లడించింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇన్ఫీ మార్కెట్ నియంత్రణ సంస్థకు పంపిన వర్తమానంలో తెలిపింది. కంపెనీ వ్యవస్థాపకులు ఎన్.ఆర్. నారాయణ మూర్తి తర్వాత 2002 ఏప్రిల్ నుంచి 2007 చివరి వరకు నీలేకని ఇన్ఫీ సంస్థ సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం నీలేకనికి సంస్థలో దాదాపు 2.29 శాతం వాటాలు ఉన్నాయి.

వేగంగా మారిన పరిణామాలు..

ఇన్ఫోసిస్‌లో గురువారం నుంచి రాత్రి నీలేకనిని చైర్మెన్‌గా నియమిస్తున్నట్టు వార్తలు వెలువడే వరకు పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. నందన్ నీలేకని సంస్థలోకి తిరిగి రానున్నారన్న వార్తల నేపథ్యంలో పలువురు కీలక సభ్యులు తమ పదవులకు రాజీనామా సమర్పించారు. ఇన్ఫీ బోర్డు చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న ఆర్.శేషశాయి, కొ-చైర్మెన్ రవి వెంకటేశన్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. వీరిలో రవి వెంకటేశన్ స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారని సంస్థ తెలిపింది. వీరితో పాటు మాజీ సీఎండీ, విశాల్ సిక్కా, జెఫ్రీ ఎస్. లెహ్‌మన్, జాన్ ఎట్కె, మెండీలు కూడా బోర్డు నుంచి నిష్క్రమించారు.

సంస్థ ప్రయోజనాలను కాపాడుతా: నీలేకని

నా మాతృ సంస్థ ఇన్ఫోసిస్‌లోకి తిరిగి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని నీలేకని అన్నారు. తన సహచరులతో కలిసి ఇకపై ఇన్ఫీ బంగారు భవిష్యత్త కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. నేటి నుంచి నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా నా వంతు బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానని వెల్లడించారు. సంస్థ ఖాతాదారులకు, వాటాదారులకు, ఉద్యోగులకు, మేటి ఫలితాలను అందిచడంమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్టుగా నీలేకని వివరించారు. గత మూడేండ్లుగా ఇన్ఫీ బాధ్యతలు నిర్వర్తించిన విశాల్ సిక్కాకు ధన్యవాదాలు.. భవిష్యత్తులో ఆయన ప్రయత్నాలకు మేలు జరగాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఆదర్శవంతమైన నాయకుడు : సిక్కా



ఇన్ఫోసిస్ కొత్త చైర్మెన్‌గా నందన్ పునరామనాన్ని నేను స్వాగతిస్తున్నానని ఇటీవలే సంస్థ సీఎండీ పదవికి రాజీనామా చేసిన విశాల్ సిక్కా అన్నారు.సంస్థలో అధికార మార్పిడి ప్రక్రియ సజావుగా ముందుకు సాగేందుకు నీలేకని నియామకం ఎంతో తోడ్పడుతుందని ఆయన వివరించారు. సంస్థను సరైన దిశలో పరుగులు పెట్టించేందుకు గాను ఇన్ఫోసిస్‌కు ఆదర్శవంతమైన నాయకుడు లభించాడని నేను పూర్తిగా విశ్వసిస్తున్నానని సిక్కా ఒక ప్రకటనలో వెల్లడించారు. నీలేకని ఆయన శు భాకాంక్షలు తెలిపారు. సంస్థలో పని చేస్తున్న ప్రవీణ్ రావుతోపాటు ఇన్ఫీ కార్యనిర్వహక బృందానికి సిబ్బందికి ఆయన బంగారు భవిష్యత్తు చేరువవ్వాలని తాము ఆశిస్తున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

రెండంకెల వృద్ధితో కష్టాలే!



న్యూఢిల్లీ: రెండంకెల వృద్ధి రేటు ఆశించడమంటే అప్పుల భారాన్ని పెంచుకోవడమేనని రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్యా అన్నారు. వేగవంతమైన వృద్ధి కారణంగా ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి గురైయ్యే అవకాశాలు లేకపోలేదన్నారు. ప్రస్తుతం సంస్థాగత ఆర్థిక వ్యవస్థపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా స్థిరమైన వృద్ధిని అందిపుచ్చుకొనేందుకు ప్రయత్నిస్తే మంచిదేనని ఆయన వివరించారు. 9 నుంచి 10 శాతం వృద్ధి రేటు సాధించడమంటే అప్పుల ఆధారిత ఆస్తులను పెంచుకోవడమేనని తన అభిప్రాయంగా పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఆసియా సొసైటీ కార్యాక్రమంలో ఆచార్యా మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి రేటు తొమ్మిది, పది శాతం పెరగడమంటే ఆందోళనతో కూడుకున్న అంశమేనని వివరించారు. ఈస్థాయిలో వృద్ధి సాధించడమంటే స్వల్ప కాలంలో భారీగా ఉత్పత్తిని పెంచడమేనన్నారు.

స్వల్ప లాభాలతో సరిపెట్టిన మార్కెట్లు



చెన్నై: ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టుల గడువు ముగియడం.. లాభాల స్వీకరణ తదితర ప్రతికూల పరిణామాల నేపథ్యంలో మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. దీంతో రియాల్టీ, ఎఫ్ఎంసీజీ షేర్లు నిరాశపరిచాయి. మరోవైపు ఫార్మా షేర్లతో పాటు ఇన్ఫోసిస్‌లోకి నందన్ నిలేకనీ రీఎంట్రీ ఇవ్వబోతున్నట్టుగా వస్తున్న వార్తల నేపథ్యంలో మార్కెట్లు సానుకూలంగా స్పందిచడంతో గురువారం ఐటీ షేర్ల ర్యాలీ జరిపినప్పటికీ తుదకు మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 28.05 పాయింట్లు లాభపడి 31,596.06 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.55 పాయింట్లకు పెరిగి 9,857.05 వద్ద ముగిసింది. నేడు వినాయక చవితి సందర్భంగా మార్కెట్లకు సెలవు. బీఎస్ఈలోని రంగాల వారిగా హెల్త్ కేర్ సూచీ 2.53శాతంతో టాప్‌లో నిలిచింది. ఇదే క్రమంలో ఐటీ సూచీ 0.69శాతం, టెక్ 0.54శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.53శాతం లాభపడ్డాయి. మరోవైపు రియాల్టీ సూచీ 0.83శాతం, ఎఫ్ఎంసీజీ 0.24శాతం, అయిల్ అండ్ గ్యాస్ 0.12శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్‌లో లూపిన్ 3.87శాతం, సన్ ఫార్మా 3.1శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.88శాతం, సిప్లా 2.47శాతం, ఇన్ఫోసిస్ 2.01శాతం చొప్పున అధిక లాభాలను అర్జించిన వాటిలో ముందు వరుసలోఉన్నాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 1.32శాతం, బజాజ్ ఆటో 1.04శాతం, రిలయన్స్ 0.88శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.73శాతం, హెచ్‌యూఎల్ 0.72శాతం చొప్పున అధిక నష్టాలను చవి చూశాయి.

ఓబీసీల వర్గీకరణను స్వాగతించిన ఎంబీసీ సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర క్యాబినెట్ ఓబీసీల వర్గీకరణను ఆమోదించటాన్ని ఎంబీసీ సంఘం స్వాగతిస్తున్నది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నప్పటికీ వర్గీకరణ లేకపోవటం వల్ల అత్యంత వెనుకబడిన కులాలకు ఎలాంటి అవకాశాలూ రావటం లేదని పేర్కొన్నారు. దాంతోపాటు క్రిమిలేయర్ రూ.8 లక్షలుగా నిర్ణయి ంచారని తెలిపారు. వీటిని కొనసాగించాలంటూ జస్టిస్ ఈశ్వరయ్య కమిషన్ 2013లో కేంద్రానికి సిఫారసు చేసిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో బీసీ, ఎంబీసీలు, సంచార జాతులుగా వర్గీకరించాలని (ఏ,బీ,సీలుగా), వాటిని వెంటనే అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తారా? చేయరా?: మందకృష్ణ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ చేస్తారా.? చేయరా..? ఏదో ఒకటి చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నిం చారు. వర్గీకరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి మాదిగల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. వర్గీకరణ చేయని పక్షంలో మాదిగ జాతి ఆవేశాన్ని చూస్తారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ వర్గీకరణ కోసం కమిషన్ వేయడాన్ని తాము స్వాగతి స్తున్నామని చెప్పారు. బీసీల కోసం కమిషన్ వేసిన కేంద్రం, ఎస్సీ కులాల వర్గీకర ణపై ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల్లో ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన వారే లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వర్గీకరణ జరిగితే, అట్టడుగులో ఉన్న వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఐదు దశాబ్దాల కింద కమిషన్ వేసినా..ఎస్సీ వర్గీకరణ చేయక పోవడం దారుణమని, ఇది ఎస్సీలను చిన్నచూపు చూడడమే అని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ, ఇప్పుడలాంటివి ఏమి లేదంటూ చెప్పడాన్ని ఆయన తప్పుపట్టారు.

కృష్ణా నీటి విడుదలపై కొనసాగుతున్న ఉత్కంఠ

నోరుమెదపని కర్నాటక

- అపెక్స్ కమిటీకి కృష్ణా బోర్డు తీర్మానం
- రాజకీయ ఒత్తిడి పెంచని తెలుగు రాష్ట్రాలు
- ఆందోళన బాటలో సాగర్ రైతులు
- నాగార్జునసాగర్ వద్ద ధర్నాకు సీసీఐ(ఎం) పిలుపు



అడుగంటిన నాగార్జున సాగర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కృష్ణా నీటి విడుదల విషయంలో ఉత్కంఠ కొనసాగుతున్నది. తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీల నీరు విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు లేఖ రాసి పదిరోజులు గడచినా కర్నాటక నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం తక్షణం నీరు విడుదల చేయాలని మంగళవారం విజయవాడలో సమావేశమైన కృష్ణా బోర్డు కూడా ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర జలవనరుల శాఖకు పంపింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేక పోవడంతో కేంద్రం కూడా నోరుమెదపడం లేదు. కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నప్పటికీ కేవలం తమ ఆయకట్టుకు తరలించుకుంటున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విజ్ఞప్తిని పట్టించుకోలేదు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు ఇప్పటి వరకూ కర్నాటక ముఖ్యమంత్రితో కనీసం టెలిఫోన్‌లో కూడా మాట్లాడక పోవడం రెండు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కర్నాటక ప్రాజెక్టుల నుంచి వెంటనే నీరు విడుదల చేయాలని టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతికి బుధవారం లేఖ రాశారు. టీఆర్ఎస్ ఎంపీలందరూ కలపి ప్రధాన మంత్రిని కలవడం లేదా అఖిపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకు వెళ్ళడం వల్ల ప్రయోజనం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కావేరి నీటి విడుదల విషయంలో తమిళనాడు ప్రజలు, ప్రజాప్రతినిధులు గతంలో చేసిన ఆందోళనతో కేంద్రం కర్నాటకతో చర్చలు జరిపింది. ఒక దశలో సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకున్నది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు కూడా ఆ స్థాయిలో ఉద్యమిస్తేనే ప్రయోజనం ఉంటుందని రైతులు కూడా అభిప్రాయపడుతున్నారు.

సాగర్ రైతుల ఆందోళన బాట...

కర్నాటక నుంచి నీటి విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా రైతులు దశల వారీ ఆందోళన చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ నెల 28న నాగార్జునసాగర్ వద్ద ధర్నా చేయడానికి సీసీఐ (యం) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సాగర్ ఎడమకాల్వకు గత రెండు సంవత్సరాలుగా నీరు లేక పోవడంతో పంటలకు తీవ్ర నష్టం జరిదిందని తెలిపింది. సాగర్‌లో పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంతానికి కూడా తాగునీరందించడం కష్టమేనని ఒక ప్రకటనలో తెలిపింది.

మరింత అడుగంటిన శ్రీశైలం, సాగర్

తెలంగాణ, ఏపీలకు తాగునీరు, సాగునీరందించే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం డెడ్ స్టోరేజీలో ఉండటంతో ప్రస్తుత పరిస్థితిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపైనే కృష్ణా బోర్డులో చర్చ జరిగింది. నాగార్జునసాగర్‌లో పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా 510 అడుగులు డెడ్‌స్టోరేజీ స్థాయి కన్నా కిందికి పడిపోయింది. గురువారం ఈ రిజర్వాయర్‌లో నీటిమట్టం 500.1 అడుగుకు చేరుకుంది. రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం312 అడుగులు కాగా ప్రస్తుత నీటి నిల్వ 115.47 అడుగులుగా ఉంది. 470 అడుగుల వరకూ ఈ రిజర్వాయర్ నుంచి నీరు తీసుకునే విధంగా స్లూయిజ్‌లను డిజైన్ చేసినప్పటికీ క్యారీ ఓవర్ స్టోరేజీ పేరుతో 120 టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలనే నిబంధన విధించారు. ఫలితంగా జంటనగరాలకు తాగునీరందించడానికి ప్రత్యేకంగా పంప్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ కూడా కనిష్ఠ పరిమాణానికి చేరింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా గురువారం 21.29 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కర్నాటకలోని ఆల్మట్టి రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా 121.4 టీఎంసీలుగానూ, నారాయణపూర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలకు గానూ 34.21 టీఎంసీలుగా ఉన్నది.

భూ సర్వే మంచిదే..

కానీ అక్రమార్కులపై చర్యలేవి...?

- రాష్ట్రంలో నగ్నంగా భూ దందా
- దీనిపై మీరెందుకు స్పందించరు?: సీఎం కేసీఆర్‌కు తమ్మినేని సూటి ప్రశ్న
- సర్వేపై ఏకపక్షంగా వ్యవహరించొద్దని సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు సిద్ధమవటం మంచి పరిణామమేనని సీపీఐ (ఎం) పేర్కొంది. అయితే రాష్ట్రంలో వందల, వేల ఎకరాలు కబ్జాకు గురవుతుంటే పట్టించుకోకపోవటం శోచనీయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. భూ దందాలు బంద్ కావాలంటూ మాటిమాటికీ చెప్పే ముఖ్యమంత్రి కేసీఆర్.. వీటిపై ఎందుకు దృష్టి సారించటం లేదని ఆయన ప్రశ్నించారు. దీన్నిబట్టి ప్రభుత్వానికి, కబ్జాకోరులకు ఎంత దగ్గర సంబంధాలున్నాయనే విషయం విదితమవుతున్నదని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, బి.వెంకట్‌తో కలిసి తమ్మినేని విలేకరులతో మాట్లాడారు. భూకబ్జాలు వెలుగులోకి వచ్చినప్పుడు.. కబ్జాకోరులను వదిలిపెట్టబోమంటూ సీఎం మాట్లాడుతున్నారు..వారిపై కఠినంగా వ్యవహరిస్తామంటూ ప్రకటనలు జారీ చేస్తున్నారు.. కానీ ఆక్రమణదారుల నుంచి ఒక్క ఎకరా భూమిని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని ఎద్దేవా చేశారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో రాంకీ సంస్థ రైతులను మాయ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రైతులకు చెందిన నూట యాభై ఎకరాలను బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. రైతుల నుంచి ఎకరా భూమిని మూడు లక్షల నుంచి మూడున్నర లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రాంకీ యాజమాన్యం.. రిజిస్ట్రేషన్‌లో మాత్రం ఆ భూముల విలువను ఎకరాకు తొమ్మిదిన్నర లక్షలుగా చూపించిందని తెలిపారు. అదే భూమిపై రాంకీ సంస్థ వివిధ బ్యాంకుల నుంచి (ఎకరాకు రూ.35 లక్షల చొప్పున) అప్పులు తెచ్చుకుందని వివరించారు. మరోవైపు ఆదాయపు పన్నుశాఖ రైతులకు నోటీసులు జారీ చేసిన తర్వాత.. అధిక ధరలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాగోతం వెలుగు చూసిందని వివరించారు. దీంతో నాలుక్కరుచుకున్న రాంకీ ఎమ్‌డీ గౌతమ్‌రెడ్డి.. తమకు భూములమ్మిన ఏజెంట్లు మోసం చేశారని, మూడు నెలల్లో తిరిగి రైతులకు భూములను స్వాధీనం చేస్తామంటూ హామీపత్రం రాసిచ్చారని గుర్తుచేశారు. ఈ తతంగంపై సీసీఎల్ఏకు, జిల్లా కలెక్టర్‌కు, జాయింట్ కలెక్టర్‌కు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. రాంకీ సంస్థపై రెండు నెలలుగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

విధి విధానాలు రూపొందించాలి..

భూ సర్వేపై ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం.. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందించలేదని తమ్మినేని విమర్శించారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించాలని కోరారు. సర్వేపై ఏకపక్షంగా నిర్ణయాలు చేయకుండా విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘాలను భాగస్వాములను చేయాలని చెప్పారు. రైతుల అభ్యంతరాలను కూడా స్వీకరించాలని, అఖిలపక్షం నిర్వహించిన తర్వాతే సర్వేను ప్రారంభించాలని సూచించారు.

కాళేశ్వరంపై స్పష్టమైన వైఖరి అవసరం..

కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలని తమ్మినేని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా రైతులపై టీఆర్ఎస్ కార్యకర్తల దాడులు, అణచివేత సరికాదని అన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు జరపకుండా పర్యావరణంపై విచారణ చేపట్టటం వల్ల ప్రయోజనం లేదని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికైనా ఒక స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు.

'విక్టోరియా మెమోరియల్'ను సంక్షేమానికే వాడాలి..

రంగారెడ్డి జిల్లా నడిబొడ్డున ఉన్న విక్టోరియా మెమోరియల్ హోంను విద్యాభివృద్ధి, అనాథలు, వృద్ధుల సంక్షేమానికే వాడాలని తమ్మినేని కోరారు. ఇక్కడి స్థలాన్ని పోలీస్ కమిషనరేట్‌కు, ఇతర అవసరాలకు వాడేందుకు ప్రభుత్వం ప్రయత్నించటం శోచనీయమని అన్నారు. బీసీ, ఎంబీసీ, మైనారిటీ తరగతులకు ఉపయోగపడే పద్ధతుల్లో అక్కడ వసతి గృహాలను నిర్మించాలని కోరారు.



మాట్లాడుతున్న తమ్మినేని, చిత్రంలో సున్నం రాజయ్య, జూలకంటి రంగారెడ్డి, బి.వెంకట్

కృష్ణా జలాలపై కేసీఆర్ స్పందించాలి...: జూలకంటి డిమాండ్

కృష్ణా నది నీటిని కర్నాటక రాష్ట్రం ఏకపక్షంగా వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఈ అంశంపై తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు స్పందించాలని సీపీఐ (ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆల్మట్టిలో నీటిని అవసరానికంటే ఎక్కువగా నిల్వ చేస్తున్న కర్నాటక.. దిగువనున్న శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేయటం లేదని చెప్పారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ పరీవాహక ప్రాంతాలైన మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వ్యవసాయం పెను ప్రమాదంలో పడిందని చెప్పారు. హైదరాబాద్‌కు మంచినీటి సమస్య తలెత్తనుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకుని కర్నాటక ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపైన, కృష్ణా బోర్డుపైనా ఒత్తిడి తీసుకొచ్చి దామాషా పద్ధతిలో నీటిని వినియోగించేట్టు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీళ్లతో వైద్యం



తాగేనీటిలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. నీటిని ఉపయోగించి అనేక వ్యాధులను నివారించొచ్చని అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. అవేమిటో చూద్దాం...


- ★ నీరు వేడి చేసి అందులో కాసింత ఉప్పు వేసి కరిగించాలి. ఆ నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, టాన్సిల్స్ తగ్గుతాయి.
- ★ నీటిని మరిగించి కొద్దిగా పసుపు లేదా రెండు చుక్కల యూకలిప్టస్ ఆయిల్ కలిపి ఆవిరి పడితే జలుబు, ఆస్మా, బ్రాంకైటిస్ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- ★ ఐస్ ముక్కల్ని నుదిటిపై రాసుకుంటే తలనొప్పి తగ్గుతుంది.
- ★ గ్లాసుడు గోరువెచ్చని నీటిని నెమ్మదిగా సిప్ చేస్తూ తాగితే ఎక్కిళ్లు తగ్గుతాయి.
- ★ కరిస్తే సబ్బునీటితో ఆ భాగం కడిగి శుభ్రం చేయాలి. ఏకధారగా గాయం మీద నీరు పోస్తే రేబీస్ కలిగించే సూక్ష్మజీవులు తొలగిపోతాయి.
- ★ చర్మం కాలితే వెంటనే చల్లటి నీటితో గాయాన్ని తడపాలి. దీనివల్ల కాలిన గాయం చల్లబడి మరింత పెరగకుండా ఉంటుంది.
- ★ వేడినీరు తాగితే కఫం కరుగుతుంది. పసుపును మరిగేనీటిలో వేసి ఆవిరి పడితే దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది.
- ★ చిన్న చిన్న గాయాలను చల్లటి నీటిలో కడిగితే మలినాలు, సూక్ష్మజీవులు పోతాయి. రక్తం నెమ్మదిగా గడ్డకడుతుంది. రక్తం కారడం తగ్గుతుంది.
- ★ వేడి నీళ్లలో ఉప్పు వేసి కాపడం వల్ల ఒళ్లు నొప్పులు తగ్గుతాయి.
- ★ రాత్రి రాగి చెంబులో నీరు పోసి పరగడుపున తాగితే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది.
- ★ ముక్కులోంచి రక్తం పడుతుంటే చల్లటి నీరు తలమీద పోయాలి. నుదుట/ముక్కుమీద తడిగుడ్డ వేయాలి.
- ★ గోరువెచ్చని నీటిలో ఉప్పువేసి పుక్కిలిస్తే దంతాల నొప్పి తగ్గుతుంది.
- ★ ఎక్కువనీరు తాగితే రక్తం పలచబడుతుంది. యూరిక్ యాసిడ్ లెవెల్ తగ్గుతుంది. మూత్రం ద్వారా యూరిక్ ఆమ్లం బయటికిపోతుంది.
- ★ నీరు ఎక్కువగా తాగితే సూక్ష్మజీవులు వేగంగా మూత్రం ద్వారా బయటకు పోయి మూత్రనాళ ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

కీళ్ల నొప్పులు తగ్గాలంటే..



వయసు పెరిగే కొద్దీ కీళ్ల నొప్పులు రావడం సర్వసాధారణం. కొందరికి వయసుతో నిమిత్తం లేకుండానే ఈ సమస్య వస్తుంది. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు దీనికి ప్రధాన కారణం. అయితే.. ఈ కీళ్ల నొప్పులను కొన్ని చిట్కాల ద్వారా తగ్గించుకోవచ్చంటు న్నారు ఆయుర్వేద నిపుణులు. అవేమిటో చూద్దాం...

- ఆవనూనెతో క్రమం తప్పకుండా రోజూ రెండు పూటలా మర్దన చేస్తుంటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.
- కొంచెం దానిమ్మ చిగుళ్లు, సైంధవ లవణం కలిపి నూరాలి. శనగ గింజంత మాత్రలు చేసుకుని ఒక్కొక్కటి మూడు పూటలా తీసుకోవాలాలి.
- మిరియాలు ఒక స్పూను, విషముష్టి గింజలు ఒక స్పూను తీసుకుని అల్లం రసంలో మూడు రోజుల పాటు నాన బెట్టాలి. ఆ తర్వాత మెత్తగా చేసి చిన్న చిన్న కంది గింజలంత మాత్రలు చేసుకుని ప్రతిరోజూ రెండు పూటలా ఒక్కొక్కటి చొప్పున వేసుకుంటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.
- ఉల్లిపాయ, ఆవాలు సమ భాగాలుగా తీసుకుని బాగా నూరి కీళ్ల మీద మర్దన చేసుకుంటే వెంటనే నొప్పులు తగ్గుతాయి.
- కప్పు నువ్వుల నూనెలో నాలుగు వెల్లుల్లిపాయ రేకులు వేసి బాగా మరగించాలి. చల్లారాక నూనెను వడగట్టి కీళ్ల నొప్పులున్న చోట మర్దన చేయాలి.



'తట్టు'కోవడం కష్టమేనా.. 'పొంగు'తుంటే అరికట్టలేమా!

మీజిల్స్, రుబెల్లా నివారణ ఎలా?

తట్టు(మీజిల్స్)ను చిన్నమ్మవారు అని కూడా అంటారు. ఇది అంటు వ్యాధి. వైరస్ వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. దీని పర్యవసానంగా ఆరోగ్యపరంగా సంక్లిష్ట సమస్యలు ఎదురవు తుంటాయి. న్యూమోనియా, ఎన్సెఫలిటీస్(మెదడు వాపు) వంటివి సంక్రమిస్తాయి. దీంతో ఒక్కోసారి మరణం సంభవించొచ్చు.

పొంగు (రుబెల్లా) అనేది వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. పిల్లలు వాక్సిన్ తీసుకోని కారణంగా ఇది సంక్రమిస్తుంది. యువత, వృద్ధుల్లోనూ పొంగు వచ్చే అవకాశాలున్నాయి. వాక్సిన్ తీసుకోని మహిళలు గర్భంతో ఉన్నప్పుడు ఇదొస్తే తీవ్ర దుష్ఫలితాలు ఉంటాయి. ముఖ్యంగా మొదటి మూడు నెలల వరకు పొంగు వస్తే గర్భస్రావం అవుతుంది. గర్భంలోనే శిశువు చనిపోవచ్చు. శిశువుకు పుట్టుకతోనే పొంగు వచ్చే అవకాశం కూడా ఉంది.

ఏమిటీ వ్యత్యాసం?

తట్టు, పొంగుకు సంబంధించిన వైరస్లు వివిధ వైరస్ కుటుం బాలకు చెందినవి. కానీ ఈ రెండు రకాల పోలికలూ మాత్రం దగ్గరగా ఉంటాయి.

- మనుషలకు మాత్రమే ఈ వ్యాధులు సంక్రమిస్తాయి.
- ఒకరి నుంచి మరొకరికి దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాపిస్తాయి.
- ఇన్ఫెక్షన్ తర్వాత జ్వరం వస్తుంది. చర్మం మీద దద్దుర్లు ఏర్పడతాయి.

పుట్టుకతో 'పొంగు' అంటే?

పుట్టుకతో పొంగు వ్యాధి రావడానికి ప్రధాన కారణం 90 శాతం వరకు తల్లి అవుతుంది. గర్భం దాల్చిన మహిళకు మొదటి పది వారాలలోపు పొంగు వస్తే బిడ్డకు పుట్టుకతో ఆ వ్యాధి సంక్రమిస్తుంది. తల్లికి పొంగు వ్యాధి రావడం వల్ల గర్భస్రావం అవుతుంది. లేదా శిశువుకు పుట్టుకతో లోపాలు తలెత్తొచ్చు. గుండె సంబంధిత వ్యాధులతోపాటు చెవిటి మూగ, మెదడు దెబ్బతినడం, కంటి సమస్యలు రావచ్చు. కాటరాక్ట్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.



వ్యాప్తి ఇలా...

తట్టు సర్వసాధారణంగా శ్వాస ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. మీజిల్స్ వైరస్ వల్ల తట్టు వస్తుంది. దగ్గడం, తుమ్మడం ద్వారా గాలి ద్వారా ఈ ఇన్ఫెక్షన్ సంక్రమిస్తుంది. నాలుగురోజుల్లోనే చర్మం మీద దద్దుర్లు ఏర్పడతాయి. పొంగు మాత్రం ముక్కు, నోరు నుంచి కారుతున్న స్రావాల ద్వారా చాలా వేగంగా వ్యాపిస్తుంది. వాక్సిన్ వేసుకోని వారికి పొంగు దాడి చేసే ప్రమాదం ఉంది.

ముప్పు ఎవరికి?

ఎవరికైనా ఈ వైరస్ ముప్పు పొంచి ఉంటుంది. వాక్సిన్ తీసుకోని వారితో పాటు గతంలో పొంగు ఇన్ఫెక్షన్ ఉన్న వారికి పొంగు వచ్చే ప్రమాదముంది. తొమ్మిది నెలలలోగా తట్టు నివారణకు రెండు డోసులు వాక్సిన్ వేసుకోని వారికి మీసల్స్ వైరస్ సంక్రమిస్తుంది. ఎవరికైతే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందో వారికి తట్టు, పొంగు వ్యాధులు వ్యాపిస్తుంటాయి. క్యాన్సర్ రోగులు తీసుకునే కీమోథెరపీ లేదా రేడియోథెరపీ వల్ల కూడా వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువ డోస్ ఉన్న ఉత్ప్రేరక మందులు వాడటం వల్ల ఈ రెండు రకాల వ్యాధులు వస్తాయి.

నివారణ ఎలా?

- తట్టు, పొంగు నివారణకు రెండు డోసుల ఎంఎంఆర్(మీజిల్స్, మమ్ప్స్, రుబెల్లా) వాక్సిన్ తీసుకోవాలి. ఇది ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడుతుంది.
- ఈ వాక్సిన్ పిల్లలకు తొమ్మిది నెలలలోపే ఇవ్వాలి.
- రెండో డోసు ఎంఎంఆర్వీ(మీజిల్స్, మమ్ప్స్, రుబెల్లా, వెరిసెల్లా) వాక్సిన్ 15 నెలల వయసులో ఉన్న శిశువుకు ఇవ్వాలి. మూడో డోసు మూడేళ్ల వయసులో ఉన్నప్పుడు ఇవ్వాలి.
- రెండు పర్యాయాలకన్నా ఎక్కువగానే ఈ వ్యాక్సిన్ ఇవ్వడం సురక్షితం.
- తట్టు వైరస్ సంక్రమించినవారు ఇంట్లోనే ఉండటం ఉత్తమం. దీంతో ఇన్ఫెక్షన్ సంక్రమించదు. కనీసం నాలుగురోజుల పాటు దద్దుర్లు ఉంటాయి. తట్టు లేనివారికి దూరంగా ఉండాలి.
- పొంగు వ్యాధి సంమ్రించిన గర్భిణికి వాక్సిన్ ఇవ్వకపోవడమే ఉత్తమం

నిర్ధారణ ఇలా...

పొంగు వ్యాధిని నిర్ధారించడం చాలా కష్టం. ఇతర వైరస్ల వల్ల అనారోగ్యం వాటిల్లినట్టుగానే ఈ వ్యాధి లక్షణాలు ఉంటాయి. జ్వరం, దద్దుర్లు వస్తుంటాయి. రక్తపరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారణ చేసుకోవాలి.

తట్టును త్వరగా గుర్తించొచ్చు. దీని బారినపడిన వ్యక్తులకు అసౌకర్యంగా ఉంటుంది. తరచూ దగ్గుతుంటారు. ముక్కు నుంచి స్రావాలు కారడం, జ్వరం, దద్దుర్లు వాటిల్లి తట్టు లక్షణాలుగా అనుమానించొచ్చు. తట్టు వ్యాధి లక్షణాలు కనిపించగానే రక్త పరీక్ష చేయించాలి. వ్యాధిని సులభంగా గుర్తించడానికి ముక్కు, గొంతు, మూత్రం నుంచి శాంపిల్స్ సేకరిస్తారు.

చికిత్స

తట్టు, పొంగు వ్యాధులను అరికట్టడానికి విశ్రాంతి చాలా అవసరం. పారాసెటమల్ మాత్రలు వేసుకోవడం వల్ల జ్వరం తగ్గుతుంది. ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి. తట్టు, పొంగు వ్యాధి వచ్చినవారికి ఇంట్లోనే ఉండే విధంగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. లేదంటే ఒకరి నుంచి మరొకరికి ఇవి వ్యాపిస్తాయి. వీటి లక్షణాలు కనిపించగానే వైద్య సహాయం తీసుకోవాలి.

- డాక్టర్ శ్రీకాంత్ కోనా
కన్సల్టెంట్ నియోనాటలజిస్ట్ అండ్ పీడియాట్రిషయన్,
కాంటినెంటల్ హాస్పిటల్స్



వయసుతో నిమిత్తంలేని రోగ నిరోధకశక్తి

వృద్ధులెవరైనా అనారోగ్యానికి గురైతే ఏమంటాం? వయసు మీరింది కదా రోగాలు మామూలే అనేస్తాం. అయితే.. వయసుకు అనారోగ్యానికి ఎలాంటి సంబంధం లేదంటోంది ఓ అధ్యయనం. వయసు పెరుగుతున్న కొద్దీ రోగ నిరోధక శక్తి తరిగిపోతుందనుకోవడం అపోహ మాత్రమే అని కెనడాలోని మెక్ మాస్టర్ యూనివర్సిటీ తేల్చింది. రోగ నిరోధకాల్లో ఒకటైన టీ కణాలు యువకుల్లోనే కాకుండా వృద్ధుల్లోనూ వైరస్ ఇన్ ఫెక్షన్ల ను సమర్ధంగా ఎదుర్కొంటాయని ఆ విశ్వవిద్యాలయం పరిశో ధకులు వెల్లడిం చారు. రోగ నిరోధక శక్తి వృద్ధి చెందే సామర్థ్యం వృద్ధుల్లోనూ ఉంటుందని గుర్తించారు.



పాలు..పెయిన్ కిల్లర్

శారీరక నొప్పులు తగ్గించే గుణం పాలలో దాగి ఉందని అంటున్నారు పరిశోధకులు. పెయిన్ కిల్లర్గా పనిచేయడమే కాకుండా హార్మోన్ల అభివృద్ధికి పాలు దోహపడ తాయని స్పెయిన్లో చేపట్టిన అధ్యయ నంలో తేలింది. పరిశోధనలో భాగంగా ఆవు పాలతోపాటు మేక, తల్లి పాల నమూనాలను పరిశీలించారు. ఆవు పాలలో దొరికే హానిరహిత ద్రవ్యాలు నిఫ్ లూమిక్ యాసిడ్, మీఫినామిక్ యాసిడ్, కిటో ప్రాఫిన్ పదార్థాలు 20 రకాల నొప్పుల నివారణకు తోడ్పడతాయని వెల్లడించారు



తెలుసుకుందాం..

పురిటి నొప్పులంటే...

నెలలు నిండాక గర్భసంచి కండరాల సంకోచ వ్యాకోచాల వల్ల నొప్పులు వస్తున్నట్టు అనిపిస్తుంది. గర్భవతుల్లోనే కాదు... మామూలు మహిళల్లోనూ గర్భసంచి సంకోచ వ్యాకోచాలు ఉంటాయి. అయితే.. ప్రసవానికి చాలా రోజుల ముందు నుంచే గర్భసంచి కండరాల్లో సంకోచవ్యాకోచాలు ఒకదాని తర్వాత ఒకటి వస్తూ ఉంటాయి. వీటినే బ్రాక్స్టన్-హిక్స్ కంట్రాక్షన్స్ అంటారు. ఈ సంకోచవ్యాకోచాలన్నవి తొమ్మిది నెలలూ ఉండనే ఉంటాయి. కాకపోతే ఇవి వచ్చే వ్యవధి, ఫ్రీక్వెన్సీ పెరుగుతూ నెలలు నిండాక అవే పురిటినొప్పులుగా రూపాంతరం చెందుతాయి. ఈ సంకోచవ్యాకోచాల సమయంలో పొట్ట కండరాలు బిగుసుకుని, ఆ తర్వాత మెత్తబడుతూ ఉంటాయి. ఈ గర్భసంచి కండరాల్లోని సంకోచ-వ్యాకోచాల్లో ఏవి పురిటి నొప్పులో గుర్తించడానికి ఒక గుర్తు ఉంటుంది. ఈ సంకోచ సమయంలో పొట్ట కండరాలు గట్టిబడటంతో పాటు నొప్పి కూడా వస్తుంటుంది. ఈ నొప్పి నడుము వెనక భాగం నుంచి మొదలై క్రమంగా ముందు భాగంలో తొడల వరకు (ప్యూబిక్ బోన్ వరకు) వ్యాపిస్తుంది. పురిటి నొప్పులుగా వచ్చిన నొప్పులు ఒకసారి వచ్చాక అదేపనిగా ఆ నొప్పిగానే ఉండక... వస్తూ, తగ్గుతూ ఉంటాయి.

ఈ పురిటినొప్పులు పూర్తి ప్రభావపూర్వకంగా ఉన్నప్పుడు గర్భసంచి ముఖద్వారం (సర్విక్స్) తెరచుకుంటూ ఉంటుంది. అంటే.. గర్భసంచి పైభాగం (ఫండస్) ముడుచుకుంటూ, ముఖద్వార (సర్విక్స్) భాగం తెరచుకుంటూ ఉండేవి నిజమైన పురిటినొప్పులన్నమాట. నిజమైన పురిటినొప్పుల్లో 10 నిమిషాల వ్యవధిలో మూడుసార్లు కండరాల సంకోచాలు వచ్చి... ఒక్కో సంకోచ సమయం కనీసం 45 సెకన్ల పాటు కొనసాగుతాయి. ఆ సమయంలో గర్భాశయ ముఖద్వారం తెరచుకుంటూ ఉంటే అది నిజమైన ప్రసవ సమయం (ట్రూ లేబర్) అని చెప్పొచ్చు. ఇదిలా ఉండగా గర్భవతి నొప్పులతో డాక్టర్ దగ్గరికి ఎప్పుడు వెళ్లాలంటూ చాలామంది అడుగు తుంటారు. భరించలేనంత నొప్పులు వస్తూ ఉన్నప్పుడుగానీ ఇలా పురిటినొప్పులువస్తూ ఉన్న సమయంలో రక్తస్రావం కనపడుతున్నా గానీ ఉమ్మనీరు నియంత్రణలో లేకుండా పడిపోతున్నా లేదా నొప్పిలేనప్పుడు కడుపులో బిడ్డ తిరిగినట్టు అనిపించకపోయినా అత్యవసరంగా డాక్టర్ను సంప్రదించడం తప్పనిసరి.



తొలిచూలు గర్భవతుల్లో చాలా మంది తమకు వచ్చే నిజమైన ప్రసూతి నొప్పులను గుర్తించకపోవడంతో ఇలా ఆస్పత్రికి వెళ్లి తిరిగి రావడం మామూలే. కాబోయే తల్లి కంటే డాక్టర్లే పురిటినొప్పులను బాగా గుర్తించగలరు కాబట్టి వాళ్లు తిప్పిపంపినా ఈ విషయంలో నిరాశపడాల్సిన అవసరం లేదు. నిజమైన నొప్పులను గుర్తించడం అన్నది ఆ సమయంలో తేలిగ్గానే జరుగుతుంది. అప్పుడు డాక్టర్లు తప్పనిసరిగా సహాయపడతారు.

మంచి కొవ్వుతోనూ ముప్పే!



శరీరంలో చెడు కొవ్వు పేరుకుపోతే రోగాలు మూకుమ్మడి దాడి చేస్తాయని అందరికీ తెలిసిందే. అయితే.. మంచి కొవ్వు కూడా కొన్ని సందర్భాల్లో హానికరమని ఓ అధ్యయనం తేల్చింది. అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ చేపట్టిన పరిశో ధనలో ఈ విషయం వెల్లడైంది. మంచి కొవ్వు ఉన్న ఆహారాన్ని అధికంగా తీసుకున్నా కాలేయ వ్యాధులు, బీపీ, డయాబెటిస్ తదితర రుగ్మతలు చుట్టుముడతాయని పరిశో ధకులు తేల్చారు. అధ్యయనంలో మంచి, చెడు కొవ్వులున్న పిండి పదార్థాలు కలుపుతూ కేలరీలు అధికంగా ఉన్న నాలుగు రకాల ఆహార పదార్థాలను సిద్ధం చేశారు. వాటిని ఆరు నెలలపాటు ఎలుక పిల్లలకు కడుపు నిండా తినిపించారు. ఆ తర్వాత పరీక్షించగా పిండి పదార్థం, అసంతృప్త కొవ్వులు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకున్న ఎలుకల కాలేయం చుట్టూ 40 శాతం ఎక్కువగా కొవ్వు పేరుకుపోయి ఉంది. వాటి కాలేయాలు కాస్త ఉబ్బినట్లు కనిపించాయి. కడుపులో చనిపోయిన కొవ్వు కణాలు గుట్టలుగా పేరుకున్నాయని, వాపు సంకేతాలనూ గుర్తించామని పరిశోధకులు తెలిపారు. రక్తపోటు, మధుమేహాన్ని పెంచేందుకు ఇవే కారణమవుతున్నాయని వెల్లడించారు.

ఊబకాయ పిల్లల్లో గ్రహణశక్తి లోపం



ఊబకాయం వల్ల పిల్లల్లో విషయ గ్రహణ సామర్థ్యం కూడా దెబ్బతింటున్నట్టు చికాగోలోని ప్రికర్ స్కూల్ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా అధిక బరువు గల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో ఈ తేడా ఎక్కువగా ఉంటుందని పరిశో ధకులు గుర్తించారు. పిల్లల బరువు, నిద్ర సమస్యలు, తెలివి తేటలన్నీ ఒకదానితో మరోటి ముడిపడి ఉంటుందని వెల్లడించారు. అధికబరువు గల పిల్లలు తగినంత నిద్రకు నోచుకోవటం లేదని, ఇది తరగతిలో పాఠాలను నేర్చుకోవటంలో ఇబ్బందులకు కారణమవుతోందని తేల్చారు. అధ్యయనంలో భాగంగా సగటున ఏండ్ల వయసున్న విద్యార్థులను ఎంచుకున్నారు. వారికి పాఠాలను నేర్చుకోవటం, జ్ఞాపకశక్తి, ప్రణాళికా రచన, సమస్యలను పరిష్కరించటం, ఏకాగ్రత వంటి తెలివి తేటలకు సంబంధించిన పరీక్షలు పెట్టారు. అలాగే రాత్రిపూట వాళ్ల నిద్రపోయే విధానాన్ని కూడా పరీక్షించారు. నిద్ర సరిగా పట్టని పిల్లలకు ఊబకాయం ముప్పు పెరగటమే కాకుండా తెలివి తేటల పరీక్షలో తక్కువ మార్కులు కూడా రావడాన్ని గుర్తించారు. ఈ పిల్లల్లో నిద్ర సంబంధ శ్వాస సమస్యలు, విషయ గ్రహణ సామర్థ్య లోపం వంటి ఇబ్బందులు ఉన్నాయని తేల్చారు.

ఫుట్బాల్ ఆడితే ఎముకల్లో పుష్టి



ఫుట్బాల్ ఆడే పిల్లల్లో ఎముకల సాంద్రత మెరుగ్గా ఉంటుందని బ్రిటన్లోని ఎక్స్టర్ యూనివర్సిటీ చేసిన అధ్యయ నంలో వెల్లడైంది. ఈ క్రీడా వల్ల కాల్షియం బాగా పెరిగి ఎముకలు పుష్టిగా తయారవుతాయని ఆ విశ్వవిద్యా లయం పరిశోధకులు తేల్చారు. అధ్యయనంలో భాగంగా 12-14 ఏండ్ల బాలలను ఏడాది పాటు పరిశీలిం చారు. ఇతర క్రీడలకంటే ఫుట్బాల్ ఆడే వారిలో ఎముకలోని ఖనిజాల మోతాదు (బీఎంసీ) మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారానికి 9 గంటల సేపు ఫుట్బాల్ ఆడే వారిని తాము పరిశీలించినప్పటికీ వారానికి 3 గంటల సేపు ఫుట్బాల్ ఆడినా గణనీయమైన ఫలితం కనిపించిందని పరి శోధకులు చెబుతున్నారు

ప్రొ కబడ్డీలో నేడు
ముంబయి X జైపూర్
రాత్రి 8 గంటలకు
బెంగాల్ X పట్నా
రాత్రి 9 గంటలకు
వేదిక : ముంబయి



భలేగా ఆడాను కదా! విజయానందంలో భువనేశ్వర్, ధోని

భువనేశ్వర్ 53 నాటౌట్

ధోని 45 నాటౌట్

లక్ష్యం 231. ఓపెనర్లు రోహిత్, ధావన్‌లు తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించారు. కోహ్లీసేనకు మళ్లీ ఏకపక్ష విజయం ఖాయమే అనిపించింది. కానీ యువ స్పిన్నర్ ధనంజయ (6/54) మాయతో 131/7తో కష్టాల్లో భారత్. పల్లెకెలె పోరు శ్రీలంక వశమైందని ఆశలు వదులుకున్న తరుణం. కానీ ధోని (45), భువనేశ్వర్ (53)ల 100 పరుగుల అజేయ భాగస్వామ్యం భారత్‌కు అద్భుత విజయం అందించింది. మూడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్, సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

ఆశలొదుకుంటే అదరగొట్టేశారు

- ధోని, భువీల అసమాన ఇన్నింగ్స్
- ధనంజయ స్పిన్ మాయ వృథా
- పల్లెకెలెలో భారత్ థ్రిల్లింగ్ విజయం

నవతెలంగాణ-పల్లెకెల్

ఆశలు అడుగంటిన పల్లెకెలె వన్డేలో ఎం.ఎస్ ధోని (45 నాటౌట్, 68 బంతుల్లో 1 ఫోర్), భువనేశ్వర్ కుమార్ (53 నాటౌట్, 80 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్)లు ఎనిమిదో వికెట్‌కు రికార్డు స్థాయిలో అజేయంగా 100 పరుగులు జోడించటంతో భారత్ అద్భుత విజయం సాధించింది. అఖిల ధనంజయ (6/54) మెరుపు స్పెల్‌తో 131/7తో భారత్ ఓటమి అంచుల్లో నిలిచింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (54), శిఖర్ ధావన్(49) రాణించారు. సిరివర్ధన (58, 58 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), కపుగెదర (40) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 236 పరుగులు చేసింది. వర్షం అంతరాయంతో భారత్ లక్ష్యాన్ని 47 ఓవర్లలో 231కి కుదించారు.

ఆరు బంతుల్లో మూడు వికెట్లు. తొలి బంతికి కేదార్ జాదవ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన ధనంజయ.. కోహ్లి, లోకేశ్ రాహుల్ వికెట్లనూ గిరాటేశాడు. దీంతో 113/2తో ఉన్న భారత్ ఈ ఓవర్ ముగిసేసరికి 119/5తో కష్టాల్లో కూరుకుపోయింది.

మహీ, భువీ అదిరే : స్వల్ప ఛేదనలో భారత్‌కు అనుకున్నట్టుగానే ఓపెనర్లు తిరుగులేని ఆరంభాన్ని అందించారు. రోహిత్ శర్మ (54, 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), శిఖర్ ధావన్ (49, 50 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించారు. దీంతో భారత్ మరో అలవోక విజయం దిశగా సాగింది. ఈ దశలో బంతి అందుకున్న యువ స్పిన్నర్ అఖిల ధనుంజయ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. రోహిత్ శర్మ సహా ఒకే ఓవర్లో కేదార్ జాదవ్ (1), విరాట్ కోహ్లి (4), లోకేశ్ రాహుల్ (4)లను క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో మ్యాచ్ ఒక్కసారిగా శ్రీలంక వైపు తిరిగింది. హార్దిక్ పాండ్య (0), అక్షర్ పటేల్ (6)లను సైతం వెనక్కి పంపిన ధనుంజయ భారత్ పతనాన్ని శాసించాడు. కానీ ఎం.ఎస్ ధోని (43)ఓ ఎండ్‌లో వికెట్ కాచుకున్నాడు. టెయిలెండర్ భువనేశ్వర్ కుమార్ (53) అర్థ సెంచరీతో మెరిశాడు. ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 100 పరుగులు జోడించిన ధోని, భువిలు మరో 16 బంతులుండగానే విజయాన్ని అందించారు.



ధనంజయ (6/54)

బుమ్రా బూమ్‌బూమ్ : తొలి 14 ఓవర్లలో శ్రీలంక స్కోరు 70/1. చక్కటి ఆరంభం. కానీ 29 ఓవర్లలో ఆ జట్టు పరిస్థితి 121/5. శ్రీలంక శుభారంభం చేసినా.. భారత బౌలర్లు మరోసారి మెరిశారు. శ్రీలంక టాప్ ఆర్డర్‌ను పెవిలియన్‌కు చేర్చి వరుసగా రెండో వన్డేలో స్వల్ప స్కోరుకే పరిమితం చేశారు. బుమ్రా (4/43) విజృంభణకు చాహల్ (2/43) తోడవటంతో శ్రీలంక కోలుకోలేక పోయింది. ఓపెనర్లు డిక్‌వెల్లా (31, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), గుణతిలక (19)లు మంచి ఆరంభం అందించారు. కుశాల్ మెండిస్ (19), గుణతిలక, ఉపుల్ తరంగ (9), మాథ్యూస్ (20)లు వెంటవెంటనే వికెట్లు కోల్పోవటంతో శ్రీలంక ఒక్కసారిగా కష్టాల్లో పడింది. కానీ మిలింద సిరివర్ధన (58, 58 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), కపుగెదర (40, 61 బంతుల్లో 2 ఫోర్లు)లు ఆరో వికెట్‌కు విలువైన 91 పరుగులు జోడించారు. ప్రతికూల పరిస్థితుల్లో పరుగులు చేసిన సిరివర్ధన అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. కపుగెదర సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. స్లాగ్ ఓవర్లలో పరుగులు కట్టడి చేసి శ్రీలంకను 236 పరుగులకే పరిమితం చేశారు.

శ్రీలంక ఇన్నింగ్స్ : నిరోశన్ డిక్‌వెల్లా (సి) ధావన్ (బి) బుమ్రా 31, గుణతిలక (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 19, కుశాల్ మెండిస్ (ఎల్బీ) చాహల్ 19, ఉపుల్ తరంగ (సి) కోహ్లి (బి) పాండ్య 9, ఏంజెలో మాథ్యూస్ (ఎల్బీ) అక్షర్ పటేల్ 20, సిరివర్ధన (సి) రోహిత్ శర్మ (బి) బుమ్రా 58, కపుగెదర (బి) బుమ్రా 40, ధనుంజయ (సి) అక్షర్ పటేల్ (బి) బుమ్రా 9, చమీరా నాటౌట్ 6, విశ్వ ఫెర్నాండో నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 22, మొత్తం : (50 ఓవర్లలో 8 వికెట్లకు) 236.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 10-53-0, జస్‌ప్రీత్ బుమ్రా 10-2-43-4, యుజ్వేందర్ చాహల్ 10-1-43-2, హార్దిక్ పాండ్య 5.2-0-24-1, అక్షర్ పటేల్ 10-0-30-1, కేదార్ జాదవ్ 4.4-0-32-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (ఎల్బీ) ధనుంజయ 54 , శిఖర్ ధావన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49, లోకేశ్ రాహుల్ (బి) ధనుంజయ 4, కేదార్ జాదవ్ (బి) ధనుంజయ 1, విరాట్ కోహ్లి (బి) ధనుంజయ 4, ఎం.ఎస్ ధోని నాటౌట్ 45, హార్దిక్ పాండ్య (స్టంప్డ్) డిక్‌వెల్లా (బి) ధనుంజయ 0, అక్షర్ పటేల్ (ఎల్బీ) ధనుంజయ 6, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 53, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం : (44.2 ఓవర్లలో 7 వికెట్లకు) 231.**

బౌలింగ్ : లసిత్ మలింగ 8-0-49-0, విశ్వ ఫెర్నాండో 6.2-32-0, ఏంజెలో మాథ్యూస్ 3-011-0, చమీరా 7-0-45-0, ధనంజయ 10-0-54-6, సిరివర్ధన 10-0-39-1.



పి.వి సింధు

పసిడి వేట దిశగా మరో అడుగు ముందుకు పడింది. స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్ ,పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు వరుస విజయాలతో క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రీ క్వార్టర్స్‌లో తొలుత సింధు తడబడినా.. వేగంగా పుంజుకుని సత్తా చాటింది. కిదాంబి మరో అలవోక విజయంతో అదరగొట్టాడు. సైనా, సింధు, శ్రీకాంత్‌లు మరో మ్యాచ్ నెగ్గితే కనీసం కాంస్యం ఖాయం చేసుకోనున్నారు.

మరో అడుగు ముందుకు..

క్వార్టర్‌ఫైనల్లో సైనా, సింధు, శ్రీకాంత్

- ప్రీ క్వార్టర్స్‌లో చెమటోడ్చిన పి.వి సింధు
- శ్రీకాంత్‌కు మరో అలవోక విజయం
- బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

నవతెలంగాణ-గ్లాస్గో

రియో ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్ పి.వి సింధు ప్రీ క్వార్టర్స్ పోరులో వెనుకంజలో నిలిచినా మూడు గేముల మ్యాచ్‌లో 2-1తో గెలుపొందింది. 13వ సీడ్ హాంగ్‌కాంగ్ అమ్మాయి చెయెంగ్ గన్ యిపై 19-21, 23-21, 21-17తో సింధు విజయం సాధించింది. వరల్డ్ నెం.3 సంగ్ జీ హ్యూన్ (కొరియా)తో పోరులో 21-19, 21-15తో వరుస గేముల్లో గెలుపొందిన సైనా నెహ్వాల్.. పూర్వపు ఫామ్ చాటుకున్నది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో మెరుపు విజయం సాధించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో శ్రీకాంత్‌కు ఇది వరుసగా మూడో ఏకపక్ష విజయం. క్వార్టర్స్ పోరులో చైనా స్టార్ షట్లర్ సన్ యూతో సింధు తలపడనున్నది. వరల్డ్ నెం.1, సన్ వాన్ హో (కొరియా)తో కిదాంబి శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చొప్రా, సిక్కి రెడ్డిలు సహా పురుషుల సింగిల్స్‌లో అజయ్ జయరాంలు పోరాడి ఓడారు. బి. సాయిప్రణీత్ 21-19, 10-21, 12-21తో చెన్ చో (చైనీస్ తైపీ) షట్లర్ చేతిలో మూడు గేముల మ్యాచ్‌లో ఓటమిపాలయ్యాడు.

చెమటోడ్చిన సింధు : మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు గట్టి పోటీ ఎదుర్కొన్నది. ప్రీ క్వార్టర్స్‌లో హాంగ్‌కాంగ్ అమ్మాయి సింధుతో హోరాహోరీగా ఆడింది. కానీ గంటన్నర మ్యాచ్‌లో సింధు 19-21, 23-21, 21-17తో గెలుపొందింది. తొలి గేమ్‌లో 4-2, 9-6తో ముందంజలో నిలిచినా విరామ సమయానికి 9-11తో సింధు ఓ పాయింట్ వెనుకపడింది. ద్వితీయార్థంలో ఇద్దరు షట్లరు హోరాహోరీగా తలపడ్డారు. దీంతో 15-16, 16-17, 17-18తో నువ్వా నేనా అన్నట్టు కనిపించింది. కానీ ఆఖర్లో చెయెంగ్ గేమ్ పాయింట్‌తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లో సింధు పుంజుకున్నది. 4-0తో ఘనంగా ఆరంభించింది. కానీ బ్రేక్ టైమ్‌కు 10-11తో ఆధిక్యం నిలుపుకోలేదు. 13-16 వద్ద వరుసగా మూడు పాయింట్లు సాధించి 16-16తో స్కోరు సమం చేసింది. 20-17తో చెయెంగ్‌ను వెనక్కినెట్టి రెండో గేమ్‌ను గెల్చుకున్నది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు తనెంటో చూపించింది. 5-1, 11-4తో దుమ్మురేపిన సింధు.. చెయెంగ్‌తో చెడుగుడు ఆడేసుకున్నది. 15-12, 18-15తో సాధికారిక విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి చేరుకున్నది. పురుషుల సింగిల్స్ లో శ్రీకాంత్ 6-6 నుంచి 11-6, 18-11తో తొలి గేమ్‌లో ఆధిపత్యం చాటుకున్నాడు. రెండో గేమ్‌లోనూ 2-0, 5-1, 11-3తో విరామ సమ యానికి తిరుగులేని ఆధిక్యం సాధించాడు. 17-12తో ఉన్న దశలో అండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) పుంజుకున్నాడు. వరుస పాయింట్లతో 18-20తో పోటీలోకొచ్చాడు. కానీ గేమ్‌ను పాయింట్ సాధించిన శ్రీకాంత్ 40 నిమిషాల్లోనే క్వార్టర్స్ బెర్త్ బుక్ చేసుకున్నాడు. చెన్ లాంగ్ (చైనా)తో పోరులో అజయ్ జయరాం 11-21, 10-21తో పోరాడి ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఏడో సీడ్ ఇండోనేషియా జంట ప్రణవ్ జోర్డాన్, డెబ్బి సుశాంటో చేతిలో 22-20, 18-21, 18-21తో ప్రణవ్ జెర్రీ చొప్రా, సిక్కి రెడ్డిలు తృటిలో విజయానికి దూరమయ్యారు.



కిదాంబి శ్రీకాంత్

సింధు	ఎవరెలా	చెయెంగ్
05	వరుస పాయింట్లు	04
08	గేమ్ పాయింట్లు	01
122	మొత్తం పాయింట్లు	122
63	నెగ్గిన పాయింట్లు	59



బీసీసీఐ పురుషాధిపత్య సంస్థ

పాలకుల కమిటీ సభ్యురాలు ఎదుల్జీ విమర్శ

నవతెలంగాణ-ముంబయి

సుప్రీంకోర్టు నియమిత పాలకుల కమిటీ సభ్యురాలు, భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయాన ఎదుల్జీ బీసీసీఐ వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించిన ఎదుల్జీ మహిళల క్రికెట్ సాధించిన విజయాలను బీసీసీఐ గుర్తించేందుకు వెనుకాడుతోందని మండిపడింది. ' 2006లో మహిళల క్రికెట్‌ను బీసీసీఐలో కలిపిన నాటి నుంచే బోర్డు వైఖరి పట్ల వ్యతిరేకతతో ఉన్నాను. భారత క్రికెట్ బోర్డు పూర్తిగా పురుషాధిపత్య వ్యవస్థతో కూడినది. మహిళల క్రికెట్‌ను దిశానిర్దేశం చేయాలని వారెప్పుడూ అనుకోలేదు. నేను ఆడిన రోజుల్లోనైనా, ఇప్పుడైనా నేను చెప్పేది ఒక్కటే. మహిల క్రికెట్ సాధించిన విజయాలను గుర్తించేందుకు బీసీసీఐకి మనసు రావటం లేదు. 2011లో ఎన్.శ్రీనివాసన్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక అతడికి శుభాకాంక్షలు తెలిపేందుకు వాంఖడేలో కలిశాను. నా దారిలో నేను వెళితే మహిళల క్రికెట్‌ను జరగనివ్వనని అన్నాడు' అని ఎదుల్జీ గుర్తుచేసింది. ప్రపంచకప్ సెమీఫైనల్లో అజేయంగా 171 ఇన్నింగ్స్‌తో రికార్డు సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ మహిళల ఐపీఎల్ ఆరంభమైతే బాగుంటుందని అభిప్రాయపడింది. ' నా చిన్ననాటి రోజుల్లో క్రికెట్ ఆడేందుకు 11 మంది అమ్మాయిలను చేర్చి జట్టుగా చేర్చేందుకు ఎంతో ప్రయాసపడ్డాను. అప్పట్లో నా కోసమే మా ఊర్లో ఒక్క క్రికెట్ అకాడమీ లేదు. కానీ ఇప్పుడు మోగాలో మహిళల కోసమే ప్రత్యేకంగా మూడు క్రికెట్ అకాడమీలు పనిచేస్తున్నాయి. ఈ సమయంలో మహిళల ఐపీఎల్ మొదలైతే గొప్పగా ఉంటుంది' అని పేర్కొన్నది.

సారథి డుప్లెసిస్

వరల్డ్ ఎలెవన్ పాకిస్థాన్ టూర్



దుబాయ్ : పాకిస్థాన్‌లో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగా టీ20 సిరీస్ కోసం ఆ దేశంలో పర్యటించనున్న వరల్డ్ ఎలెవన్‌కు సఫారీ సారథి డుప్లెసిస్ నాయకత్వం వహించనున్నాడు. 15 మందితో కూడిన వరల్డ్ ఎలెవన్‌ను ఐసీసీ గురువారం ప్రకటించింది. ఆండీ ఫ్లవర్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. డుప్లెసిస్‌కు తోడు మరో నలుగురు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు వరల్డ్ ఎలెవన్‌లో చోటుచేసుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి ముగ్గురు, వెస్టిండీస్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, శ్రీలంకల నుంచి ఒక్కో ఆటగాడు ప్రాతినిథ్యం వహించనున్నారు. వరల్డ్ ఎలెవన్ జట్టులో భారత ఆటగాళ్లు పాలుపంచుకోవటం లేదు. సెప్టెంబర్ 10 నుంచి లాహోర్‌లో జరిగే మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో వరల్డ్ ఎలెవన్‌తో పాకిస్థాన్ తలపడనున్నది.

వరల్డ్ ఎలెవన్ : డుప్లెసిస్ (కెప్టెన్), హాషీమ్ ఆమ్లా, శామ్యూల్ బద్రీ, జార్జీ బెయిలీ, పాల్ కొలింగ్‌వుడ్, బెన్ కట్టింగ్, గ్రాంట్ ఎలియట్, తమీమ్ ఇక్బాల్, డెవిడ్ మిల్లర్, మోర్నె మోర్కెల్, టిమ్ పైనీ (వికెట్ కీపర్), తిశార పెరీరా, ఇమ్రాన్ తాహీర్, డారెన్ సామీ.




సైక్లిస్ట్‌లకు సీఎం అభినందన

నవతెలంగాణ-హైదరాబాద్ : ఇంగ్లాండ్‌లో జరిగిన 1436 కిలోమీటర్ల సైక్లింగ్ రైడ్‌లో ప్రతిభ కనబర్చి, రజత పతకం సాధించిన తెలంగాణ బృందాన్ని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అభినందించారు. జులై 30 నుంచి ఆగస్టు 4 వరకూ సాగిన సైకిల్ రైడ్ లండన్ నుంచి ఎడిన్‌బర్గ్‌కు సాగింది. తెలంగాణ ఇంటలీజెన్స్ డీఎస్పీ వి.సదానంద రెడ్డి నాయకత్వంలోని సైక్లిస్ట్‌ల బృందం ఈ రేసులో సిల్వర్ మెడల్ సాధించింది. సదానందరెడ్డి సహా రాజేశ్ కృష్ణమనేని, ప్రద్యుమ్న పెన్మచ్చ, గౌతమ్ నార్నె, సాయిరామ కృష్ణ, కృష్ణకూనం, జితేందర్‌లు రేసులో పాల్గొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మెన్ ఎ. వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సైక్లిస్ట్‌ల బృంద సభ్యులు గురువారం సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిశారు.

టైటాన్స్ ఓటమి

లక్నో: తెలుగు టైటాన్స్‌పై యూపీ యోధా 25-23తో గెలుపొందింది. సొంత గడ్డపై ఎట్టకేలకు ఓ విజయాన్ని అందుకుంది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్ యూపీ వశమైంది. రైడర్ నితిన్ తోమర్ ఆరు పాయింట్లతో ఆకట్టుకోగా నితీష్ కుమార్ అయిదు టాకిల్స్‌తో రాణించాడు. సురేందర్ సింగ్ నాలుగు పాయింట్లు సాధించాడు. 12 రైడ్స్ చేసిన రిషాంక్ దేవడిగా ఒక్క పాయింటు కూడా నమోదు చేయలేదు. టైటాన్స్‌లో ఫర్హాద్, సోంబీర్‌లు చెరో మూడు టాకిల్స్ చేశారు. 23 సార్లు కూతకు వెళ్లిన టాప్ రైడర్ రాహుల్ సైతం నాలుగు పాయింట్లతో నిరాశపరిచాడు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.